శనివారం 7-1-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 287



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆకుపచ్చ ధనం


రేష్మా రంజన్

పచ్చగా కళకళలాడటం అంటే ఏమిటో
రేష్మా రంజన్‌కు తెలుసు.
అందుకే తృప్తినివ్వని గవర్నమెంట్ ఉద్యోగాన్ని
వదిలి మరీ ఇంట్లో ఉండిపోయింది.
ఇంట్లో ఏం చేసింది?
తనకిష్టమైన మొక్కలు పెంచింది.
మట్టి, నీరు, కుండీ, ఆకు, ఎరువు...
ఇవి ఎలా ఉపయోగిస్తే
ఇంటి మొక్కలు అందంగా అద్భుతంగా
ఉంటాయో బాగా తెలుసుకుంది.
వాటినే వీడియో పాఠాలు చేసింది.
'ప్రకృతీస్ గార్డెన్' పేరుతో వందలాది
వీడియోలు చేసింది.
పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఏర్పడ్డారు.
రేష్మా దిశా నిర్దేశంలో
ఇళ్లల్లో మొక్కలు పెంచుతున్నారు.
వారు హ్యాపీగా ఉన్నారు.
దీనివల్ల వచ్చే ఆదాయంతో రేష్మా పచ్చగా ఉంది.

జార్ఖండ్‌లోని బొకారోలో రేష్మా రంజన్ ఇంటికి వెళితే చిన్న సైజు వనంలో అడుగు పెట్టినట్టు ఉంది. దాదాపు 2000 అందమైన, రకరకాల కుండీల్లో వందలాది రకాల మొక్కలు కనిపిస్తాయి. కొత్తిమీర, పొదీనాతో మొదలు ఆపిల్, అవకాడో వరకూ రేష్మా కుండీల్లో సృష్టించనిది అంటూ ఏదీ లేదు. ఒక కుండీలో ఉల్లిపాయలు పెరుగుతుంటాయి... మరో కుండీలో అనాసపళ్లు... ఇంకో కుండీలో చిలగడ దుంపలు, మరో కుండీలో నేతి బీరకాయలు... ఇక పూలైతే లెక్కే లేదు. వాటి మధ్య కూచుని వీడియోలు చేస్తుంటుంది రేష్మా. కేవలం తను పెంచి చూసిన మొక్కల గురించే ఆమె మాట్లాడుతుంది. ఆ అనుభవాల నుంచి వచ్చిన పాఠాలు కాబట్టే ఆమెకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు.

■ బాల్యం ముఖ్యం

బాల్యంలో ఏర్పరిచే మంచి ప్రభావాలు వారికి జీవితాంతం ఉంటాయి అనడానికి రేష్మ రంజన్ ఒక ఉదాహరణ. రేష్మాది బొకారో అయినా ఐదో క్లాస్ వరకూ బీహార్‌లోని పల్లెలో అమ్మమ్మ, తాతయ్య దగ్గర పెరిగింది. తాతయ్య ఇంట్లో విపరీతంగా చెట్లు. 'దారిన పసిబిడ్డను వదిలి వెళ్లిపోతే చూసినవారు ఎలా కలత చెందుతారో ఎవరైనా ఏదైనా మొక్కను పారేసి ఉంటే మా తాత అంత కలత చెందేవాడు' అంటుంది రేష్మా. అతడు ఎక్కడ ఏ మొక్క నిర్లక్ష్యంగా పడేసి ఉన్నా తెచ్చి ఇంట్లో దానికి ప్రాణం పోసేవాడు. రేష్మా మూడో క్లాసు పాసై నాలుక్కు వెళుతున్నప్పుడు మూడు మొక్కలు తెచ్చి వీటిని నువ్వే పెంచాలి అని చెప్పాడు తాతయ్య. 'అయితే నేను మరీ అతిగా పెంచి ఎక్కువ నీళ్ళు, ఎక్కువ ఎరువు వేసేసి వాటిని చంపేశాను' అని నవ్వుతుంది రేష్మా. ఆ గుణపాఠం నుంచి బాల్యంలోనే మొక్కలను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో నేర్చుకుంది. 'అదే మొక్కల మీద నా ప్రేమకు అంకురం' అంటుంది రేష్మా.

■ అందమైన ఇల్లు

మొక్కలు ఎలా అంటే అలా పెంచడం కాదు. వాటిని అందమైన కుండీల్లో అందమైన అరల మీద పెడితే వచ్చే అందాన్ని కూడా రేష్మా చెబుతుంది. సహజంగా ఎరువుల్ని, క్రిమి సంహారకాలను ఎలా తయారు చేసుకోవాలో చూపుతుంది. సేంద్రియ విధానాలు కూడా చూపుతుంది. ఇండోర్ ప్లాంట్స్ ఎలా శుభ్రం చేయాలి అనే ఆమె వీడియో ఇండోర్ ప్లాంట్స్ ఉన్నవారంతా చూడతగ్గది. 'వాల్ డెకరేషన్'గా గోడలకు కుండీలు బిగించి ఎలాంటి మొక్కలు పెంచాలో చూపుతుంది. ఇంకా ఆమె చెప్పే విషయాలు అనంతం.



■ ఉద్యోగంలో అసంతృప్తి

ఇంటర్ తర్వాత ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ.సి.ఎ.ఆర్) నుంచి అగ్రికల్చర్ సైన్స్ డిగ్రీ చేసిన రేష్మా ఆ వెంటనే అగ్రికల్చర్ కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ ఉద్యోగం పొందింది. '2015లో నాకు ఉద్యోగం వచ్చింది. నాకు ఇష్టమైన ఉద్యోగం అనుకున్నాను. నా పని రైతులకు వారి పంట పోషణలో సాయం చేయడం. కాని నా లాంటి చిన్న పిల్ల చెప్తే వినడం ఏమిటి అనుకునేవారో లేదా వారి సంప్రదాయ జ్ఞానం మీద విశ్వాసమో కాని నేను చెప్పే సూచనలు రైతులు వినేవారు కాదు. అంతేకాదు మట్టిని బట్టి, విత్తును బట్టి పంటలో మార్పు చేర్పులు చెప్తే లక్ష్యం చేసేవారు కాదు. ఆ అసంతృప్తి నాకు ఉండేది. మరో వైపు ఉద్యోగం వల్ల నేను స్వయంగా మొక్కలు పెంచలేకపోయేదాన్ని. అదే సమయంలో నా చదువును చూసి ఫ్రెండ్స్ ఫలానా మొక్కలు ఎవరు వేయాలి... ఫలానా తీగను ఎలా పెంచాలి... అని సలహా అడిగేవారు. ఈ అన్ని సమస్యలకు సమాధానంగా ఉద్యోగం మానేసి యూట్యూబ్ చానల్ మొదలెట్టాను' అంటుంది రేష్మా.

■ పదివేల మంది అనుకుంటే

'నేను మొక్కలు, తీగలు, పూల చెట్లు, పండ్ల చెట్లు, కూరగాయలు, ఇండోర్ ప్లాంట్లు... వీటన్నింటిని ఎలా పెంచాలో, కేర్ తీసుకోవాలో చెప్తే నాలాగే మొక్కలను ఇష్టపడే ఒక పదివేల మంది అయినా ఫాలో కాకపోతారా అనుకున్నాను. సహజ పద్ధతిలో గులాబీ పెంచడం ఎలా? అనేది నా మొదటి వీడియో. దానికి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. పది వేల మంది అనుకుంటే రెండు మూడేళ్ల లోనే లక్ష మంది అయ్యారు. 2016 నుంచి నా పాఠాలు కొనసాగితే 2022 చివరకు పది లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్ అయ్యారు. ప్రొడక్ట్ ప్రమోషన్స్ కోసం వచ్చే వారి వల్ల కాని, యూట్యూబ్–ఫేస్‌బుక్ పేజ్ వల్ల కాని నాకు నెలకు లక్ష నుంచి లక్షన్నర ఆదాయం వస్తోంది' అంటుంది రేష్మా.

ఒక పనిలో పూర్తిగా నైపుణ్యం ఉంటే ఆ పనిలో ఆనందం, ఆదాయం రెండూ పొందవచ్చు. మీకు బాగా మొక్కలు పెంచడం వస్తే రేష్మాలా యూట్యూబ్ చానల్ నడపొచ్చు. బాగా మొక్కలు పెంచాలని ఉంటే ఆమె చానల్ ఫాలో కావచ్చు.

'అందరూ మొక్కలు పెంచితే ప్రపంచం పచ్చగా మారడానికి ఎక్కువ టైమ్ పట్టదు' అని రేష్మా చెప్పే మాట అందరూ వినాలి.


9 చుక్కలు, సందు చుక్క చుట్టూ 1 వచ్చేవరకు


డి.భానుమతి
పాకాల టౌన్, తిరుపతి జిల్లా


సిరిపురం లక్ష్మీకళ
విద్యానగర్, నకిరేకల్


19 చుక్కలు ఎదురు చుక్క 1 వచ్చేవరకు

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
(మీ ఊరుతోపాటు కాలనీ- వీధి పేరు కూడా రాయండి)

లాక్డౌన్ సమయంలో చాలా మంది క్రియేటివ్ ఆలోచనలతో వెలుగులోకి వచ్చారు. అదేవిధంగా బిజినెస్ రంగంలోనూ ఎదిగారు. అలాంటివారి జాబితాలో ముందుంటారు సీమా మక్వానా. ముంబైలో ఉంటున్న సీమ కరోనా సమయంలో ఇంట్లో వారి కోసం ముఖ్యంగా పిల్లలు ఇష్టపడేలా హెల్తీ బన్స్, ఫాస్ట్ ఫుడ్‌ను తయారు చేసేది. వాటి తయారీని పెంచి తమ అపార్ట్‌మెంట్ సభ్యులకు పంచేది. ఈ రోజు సీమా చేసే బన్స్‌కి ఫాస్ట్ ఫుడ్‌కి విదేశీల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి. దీని వెనక ఉన్న ఆమె కృషి ఎంతో మందికి ప్రేరణనిస్తోంది.

హెల్తీ ఫాస్ట్ ఐడియా


సీమా మక్వానా

పిల్లల నుండి పెద్దల వరకు ఫాస్ట్ ఫుడ్‌ని అందరూ ఇష్టపడతారు. అయితే, జంక్ ఫుడ్ అని వాటిని ఎక్కువగా తిననివ్వరు. కానీ, నోరూరించే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ అందుబాటులో ఉంటే ఎవరూ అడ్డుచెప్పరు. అదే థీమ్‌తో హెల్తీ ఫాస్ట్‌ఫుడ్‌ని అందిస్తుంది సీమా మక్వానా. దేశంలోనే మొదటిసారి హెల్తీ ఫాస్ట్ ఫుడ్ తయారీదారుగా పేరు తెచ్చుకుంది. ఈ తయారీ వెనక చోటు చేసుకున్న పరిణామాలను ఇలా వివరిస్తుంది.. ''వంట చేయడం, కొత్త వంటకాలను ప్రయత్నించడం నా అభిరుచి. ప్రతి వంటకాన్ని ఆరోగ్యకరమైనదిగా మార్చడం అంటే నాకు చాలా ఇష్టం. ఇద్దరు పిల్లల తల్లిని అవడంతో వారికి రుచికరమైన ఆహారాన్ని ఎలా ఇవ్వాలా అనే ఆలోచిస్తుంటాను. తల్లిగా వారి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో నాకు తెలుసు. అందుకే, నా పిల్లలు నేను తయారు చేసే ఫుడ్ తప్ప ఇతర జంక్ ఫుడ్‌ను ఎప్పుడూ ఇష్టపడరు.



నమ్మకమైన బ్రాండ్

లాక్‌డౌన్ టైమ్ అందరిలోనూ సృజనాత్మక ఆలోచనలకు, పనులు చేయడానికి అవకాశం ఇచ్చింది. నేను మా అత్తమామలు, ఇరుగుపొరుగు వారితో సహా అందరికీ ఫుడ్ సిద్ధం చేసేదాన్ని. అప్పటి నుంచి నాలో నలుగురి కోసం నేనేమీ చేయలేకపోతున్నానే అనే గిల్టీ భావన దూరమైంది. ఆరోగ్యకరమైన, అందరికి మేలు చేసే ఫాస్ట్ ఫుడ్ తయారు చేస్తూ దీనినే ఒక నమ్మకమైన బ్రాండ్‌గా రూపొందించాలనుకున్నాను. ఆ ఆలోచన నుంచి వచ్చిందే బన్స్ అండ్ డెలుచాస్.

హెల్తీ కంపెనీ

దేశంలోనే మొదటిసారి చేతితో తయారుచేసే ఆరోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్ కంపెనీగా బన్స్ అండ్ డెలుచాస్ నిలిచింది. వంటల తయారీలో ఉపయోగించేవన్నీ సేంద్రియ పదార్థాలే. ఇండియన్, ఇటాలియన్, చైనీస్ గ్రేవీలతో స్టఫ్డ్ బన్స్ తయారు చేస్తాను. అన్నిరకాల రుచికరమైన కుల్చా ర్యాప్‌లు, స్నాక్ స్టఫ్ వాఫ్లెస్‌ను కస్టమైజ్డ్ ఫింగర్ లీకీ డిప్స్‌తో సర్వ్ చేస్తాం. పండగల సమయాల్లో ఆరోగ్యకరమైన కొత్తతరహా వంటకాలను అందిస్తాం.

నా కూతురే గొప్ప ప్రేరణ

నేను చదివింది పదవ తరగతి వరకే. కానీ, నాకెప్పుడూ సొంతంగా ఏదైనా పని చేయాలని ఉండేది. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి స్పెషల్లీ ఛాలెంజ్డ్ కిడ్. నా ఫాస్ట్‌ఫుడ్ వెంచర్‌కి వెనకాల అతి పెద్ద ప్రేరణ నా కూతురు. తను నా వంటకాలకు ఫీడ్ బ్యాక్ ఇచ్చేది. సొంతంగా ఏదైనా ప్రారంభించమని ప్రోత్సహిస్తుంటుంది. చాలా కుటుంబాలు ప్రతిభావంతులైన మహిళలకు వారి అభిరుచిని కొనసాగించడానికి మద్దతు ఇవ్వవు. కానీ, నా కుటుంబం నుండి నాకు మద్దతు లభించింది. మా కుటుంబం నన్ను ఎంతగానో సపోర్ట్ చేస్తున్నప్పటికీ నేను తల్లిని. నా బిడ్డలను జాగ్రత్తగా చూసుకోవాలి. అలాగే గృహిణిగా కుటుంబ బాధ్యతలనూ చూసుకోవాలి. కొన్నేళ్ల క్రితం మా ఇంటికి దగ్గరలో ఉన్న ఒక బొమ్మల లైబ్రరీలో పనిచేశాను. కానీ, రోజూ బాబును వదిలి ఇంటి నుంచి బయటకు రావడం కష్టంగా ఉండటంతో ఆ పని మానేశాను. పిల్లలను చూసుకుంటూ వంట పనులు చేయడం ఇష్టంగా మారింది.



మంచి స్పందన

ప్రతి వ్యాపారంలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కానీ వాటిని తెలివిగా ఎదుర్కోవడం ముఖ్యం. ఒక గృహిణిగా ఇటి పనులు, బాధ్యతలు నిర్వహించడం, ఆర్డర్లన్నింటిని పూర్తి చేయడం కష్టంగా ఉంటుంది. కానీ నా కల అన్నింటికన్నా బలమైనది. కష్టమర్ల నుండి వచ్చే మంచి స్పందన కూడా నేను మరింత కష్టపడేలా ప్రోత్సహిస్తుంది.

విదేశాలకు ఎగుమతి..

మా ఉత్పత్తుల కంపెనీ ప్రధాన లక్ష్యం ఫాస్ట్ ఫుడ్ స్టైల్‌లో ఫుడ్‌ని ఆరోగ్యకరంగా అందించడం. గోధుమ పిండితో బన్స్ తయారు చేస్తాను. అన్ని పదార్థాలు శాకాహారమే. బన్ లోపల కూరగాయలను, సాస్‌ను స్టఫ్‌గా ఉపయోగిస్తాను. దీని వల్ల ఎంత దూరం తీసుకువెళ్లినా బన్ లోపలి పదార్థం బయటకు రాదు. ఇదే మా సక్సెస్‌కు కారణం. విదేశాల నుంచి ఆర్డరు రావడానికి కూడా ఇదే కారణం. ప్రధాన ఆహార పరిశ్రమలో ప్రవేశించడానికి ఫ్రాంచైజ్ నెట్‌వర్క్‌ను ప్రారంభించబోతున్నాను. సొంతంగా వెబ్‌సైట్ ఉంది. దీని ద్వారానే కాకుండా ఫుడ్ డెలివరీ కంపెనీల నుంచి కూడా ఆర్డర్లు వస్తుంటాయి.

దేశం నలుమూలల నుంచే కాదు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. నా బంధువు కారణంగా వ్యాపారం విదేశాలకు చేరుకుంది. ఈ పనిని ప్రారంభించినప్పుడు ఆరు రోజుల తర్వాత నా తయారీ ప్యాకెట్‌ను కోరుకున్నవారికి పంపగలిగాను. పది రోజుల వరకు ఆహారం పాడవని విధంగా జాగ్రత్తలు తీసుకున్నాను. అక్కడి వారికి నా ఫుడ్ టేస్ట్ బాగా నచ్చింది. దీని తర్వాతే నా బన్స్ అండ్ డెలుచాస్‌ని విదేశీయులకూ అందివ్వగలను అనుకున్నాను. త్వరలో విదేశాలలోనూ నా వెంచర్‌ని ప్రారంభించాలనుకుంటున్నాను'' అని ఆనందంగా వివరిస్తుంది సీమా.

విడిచి వెళ్లినా.. చేయి వీడలేదు!

ట్రెండ్

39 ఏళ్లు కలిసి మెలిసి జీవించిన భార్యను ఏ భర్త మర్చిపోగలడు? కోవిడ్ వల్ల ఆమె 2021లో మరణిస్తే చివరి చూపుకు కూడా అతను నోచుకోలేదు. కాని ఆమెను ప్రత్యక్షంగా రోజూ చూడదలిచాడు. అందుకే రెండున్నర లక్షలు ఖర్చుపెట్టి ముమ్మూర్తులా ఆమెనే పోలిన సిలికాన్ విగ్రహాన్ని ఇంట్లో ప్రతిష్టించగలిగాడు. బంధువులు, అయినవాళ్లు వారించినా వినలేదు. 'భార్యను ప్రేమించేవాడికే భార్య లేని లోటు తెలుస్తుంది' అంటున్నాడు కోల్‌కతాకు చెందిన తపస్ శాండిల్య. భార్య మీద ప్రేమకు ఇది కొలమానం కాకపోవచ్చుగాని భార్యను ఏ మాత్రం ప్రేమిస్తున్నాం అని భర్తలు ఆలోచనలో పడుతున్నారు ఈ విగ్రహం చూసి.


భార్య ఇంద్రాణి సిలికాన్ విగ్రహంతో తపస్ శాండిల్య

పాత సినిమాల్లో చనిపోయిన భార్య ఫొటో దగ్గర నిలబడి గుమ్మడి వంటి భర్తో, ఎస్.వి.రంగారావు వంటి భర్తో తమ ఉద్వేగాలు చెప్పుకోవడం చూసేవాళ్లం. అలాగే అంజలి, కన్నాంబ వంటి భార్యలు తమ భర్తల ఫొటోల ముందు నిలబడి 'చూశారా... మీ కొడుకు ఎంతటి ప్రయోజకుడయ్యాడో' అంటూ దుఃఖానంద అశ్రువులు జారవిడిచేవారు. కాని ఇటీవలి కాలంలో ఈ ఫొటోల స్థానంలో ఏకంగా సిలికాన్ శిల్పాలు ఇళ్లల్లో తమ జీవన భాగస్వాముల గుర్తుగా చేరుతున్నాయి. తమిళనాడు, ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల్లో తల్లి కోసం తండ్రి శిల్పాన్ని చేయించిన పిల్లలు, తండ్రి కోసం తల్లి శిల్పాన్ని చేయించిన ఆత్మీయులు ఉన్నారు. ఇప్పుడు కోల్‌కటాకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగి తన భార్య మీద ప్రేమను శిల్ప ప్రతిష్ఠ ద్వారానే కొంతైనా చాటుకోగలను అంటున్నాడు.

చివరి చూపులకు నోచక

కోల్‌కటాకు చెందిన తపస్ శాండిల్య, అతని భార్య ఇంద్రాణి దాదాపు 40 ఏళ్ల వైవాహిక జీవితం గడిపారు. దురదృష్టవశాత్తు 2021 మేలో కోవిడ్ వల్ల ఇంద్రాణి మరణించింది. 'ఆ సమయంలో నేను ఐసొలేషన్‌లో ఉన్నాను. ఆస్పత్రిలో ఆమెను చూసుకోలేకపోయాను. అలాగే ఆమె అంతిమయాత్రకు కూడా లేను. నా బాధ వర్ణించరానిది' అంటాడు శాండిల్య. ఆమె చనిపోయాక ఆ హటాత్‌లోటు అతణ్ణి నిలువనీయలేదు. 'పదేళ్ల క్రితం మయాపూర్ (బెంగాల్)లోని ఇస్కాన్ టెంపుల్‌ను మేము దర్శించాం. అక్కడ స్వామి వేదాంత నిలువెత్తు విగ్రహం ఉంది. అది నిజం మనిషిలా ఉంది. అప్పుడు నా భార్య ఇలాంటిది నాది కూడా ఉంటే ఎంత బాగుంటుంది అని మాట వరసకు అంది. ఆమె మరణించాక నాకు ఆ మాట, ఆ విగ్రహం గుర్తుకు వచ్చాయి. అలాంటి విగ్రహం తయారు చేసి ఇంట్లో ఉంచితేనే ఆమె లేని లోటు తీరుతుందని భావించాను' అన్నాడు తపస్.



శిల్పి అన్వేషణలో

అలా అనుకున్నాడుగాని అందుకు తగ్గ శిల్పి ఎవరు అనేది అతనికి తెలియలేదు. చివరకు మ్యూజియమ్‌లకు వ్యాక్స్, సిలికాన్ విగ్రహాలు తయారు చేసిచ్చే అదే రాష్ట్రానికి చెందిన సుబిమల్ దాస్ అనే శిల్పిని కలిశాడు. రెండున్నర లక్షల ఖర్చు అంచనాకొచ్చింది. 'ఇది చౌరస్తాలో పెట్టే విగ్రహం లాంటిది కాదని నాకు అనిపించింది. భావోద్వేగాలతో ఒక భర్త చేయించుకుంటున్న భార్య విగ్రహం. అది వీలైనంత జీవకళతో ఉండాలని ముఖంలో ఎక్స్‌ప్రెషన్ ఉండాలని నిశ్చయించుకున్నాను. మహనీయులంటే వారిని చూసి చూసి మనకు ముద్ర పడిపోయి ఉంటారు. వారి శిల్పం సులువు. కాని జీవితంలో ఎప్పుడూ చూడని ఒక సగటు ఇల్లాలి విగ్రహం తయారు చేయడం సవాలే' అన్నాడు సుబిమల్ దాస్. అయితే ముందు క్లే మోడల్ తయారు చేశాడు పోలికల కోసం. తపస్ కూడా ఈ క్లే మోడల్ తయారయ్యేంత వరకు సుబిమల్ దాస్ తోడు ఉన్నాడు. అది సంతృప్తిగా ఉందని అనిపించాక ఫైబర్ మోడల్ దానికి సిలికాన్ కాస్టింగ్ పూర్తయ్యాయి. 'కేవలం జుట్టు ఇమడ్చడానికే 30 రోజులు పట్టింది' అంటాడు తపస్ శాండిల్య. 'నా భార్య నా కొడుకు పెళ్లిలో కట్టుకున్న వస్త్రాలు విగ్రహానికి తొడిగాను. హాల్లో సోఫాలో ఆమె కూచుని ఉంటే అచ్చు నా భార్య ఇంట్లో ఉన్నట్టే అనిపిస్తోంది' అని సంతృప్తిపడుతున్నాడు.

చనిపోయిన మనిషి రూపాన్ని అలా ఇంట్లో పెట్టడం మంచిది కాదని బంధువులు వారించినా తపస్ వినలేదు. గిట్టని వాళ్లు ప్రచారం కోసం ఇదంతా చేస్తున్నాడని విమర్శించారు కూడా.

ఆ సంగతి అలా ఉంచితే భార్య పట్ల బాధ్యతగా ఉండే భర్తలు ఆ బాధ్యతే ప్రేమ అనుకుంటూ ఉంటారు. తమని ప్రేమించడం భార్యల వంతు అన్నట్టుగా ఉంటుంది వీరి వైఖరి. అనుకోని ఎడబాటు వస్తే ఆమెను చూసుకోవాల్సినంత ప్రేమగా చూసుకోలేదు అని వగచే బదులు ఉన్నప్పుడే దాంపత్య బంధాన్ని ప్రేమ బంధంగా మలుచుకోవడంలో శ్రద్ధ చూపడం మేలు. ఏ భార్యాభర్తలైనా కలకాలం ప్రేమగా బతకడమేగా కావాల్సింది.


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 287

శనివారం 7-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చెస్ గ్రాండ్ మాస్టర్‌గా ప్రణేశ్

రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన 16 ఏళ్ల భారత కుర్రాడు - 13లో



బ్యాంక్‌కు వెళ్లాల్సిన పనిలేదు

ప్రత్యామ్నాయ మార్గాల్లో రీ-కేవైసీ సమర్పించవచ్చన్న రిజర్వ్ బ్యాంక్. -13లో



ఎంసీడీలో రగడ

ఎంసీడీ సమావేశంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ప్రతిపక్ష బీజేపీ కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది.

- వివరాలు 6లో▶



కేంద్రం తీరు ఆందోళనకరం

జడ్జిల నియామకాలపై కొలీజియం సిఫార్సుల ఆమోదంలో కేంద్రం తీరు ఆందోళన కరంగా ఉందని సుప్రీం వ్యాఖ్యానించింది.

- వివరాలు 6లో▶



గొడవ పడ్డ అంజలి, నిధి

డిసెంబర్ 31న రాత్రి ప్రమాదానికి ముందు అంజలి, ఆమె స్నేహితురాలు నిధి డబ్బు విషయమై ఘర్షణ పడినట్లు తేలింది.

- వివరాలు 6లో▶



ట్విటర్‌పై హ్యాకర్ల దాడి

సామాజిక మాధ్యమం ట్విటర్‌పై హ్యాకర్లు దాడి చేసి 20 కోట్ల మందికి పైగా వినియోగదారుల సమాచారాన్ని అపహరించారు.

- వివరాలు 6లో▶

ఆ 'ఎర'లపై చర్యలేవీ?

12 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఫిర్యాదు

'ఎమ్మెల్యేలకు ఎర' కేసు దాఖలైన మొయినాబాద్ పీఎస్‌లోనే..

అవినీతి నిరోధక చట్టంతో పాటు పలు ఐపీసీ సెక్షన్ల కింద చర్యలకు డిమాండ్

నిందితులుగా సీఎం కేసీఆర్, 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు

- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫిర్యాదుతో నమోదైన కేసుతో కలిపి విచారించాలని విజ్ఞప్తి
- ఆర్థిక, అధికార ప్రయోజనాల కోసమే ఫిరాయింపు: రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ ఫిరాయింపులు ప్రోత్సహించి అధికారాన్ని పదిలం చేసుకోవాలనుకున్నారు
- టీఆర్ఎస్ఎల్పీలో ఎమ్మెల్యేల విలీనం ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనే: భట్టి

సాక్షి, హైదరాబాద్/ మొయినాబాద్: గత (2018) అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గుర్తుపై గెలిచి టీఆర్ఎస్‌లోకి వెళ్లిన 12 మంది ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ మరింత ఫోకస్ పెట్టింది. ఎమ్మెల్యేలకు ఎర కేసు తెరపైకి వచ్చిన నేపథ్యంలో, దాన్ని ఆసరాగా చేసుకుని తమ పార్టీ నుంచి వెళ్లిన ఎమ్మెల్యేలపై కూడా చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో కార్యాచరణను ఉధృతం చేసింది. ఎమ్మెల్యేలకు ఎర ఎపిసోడ్‌లో భాగంగా ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ఫిర్యాదు చేసిన మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లోనే 12 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసింది. వారిపై చర్యలు తీసుకోవాలని కోరింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నేతలు సంపత్‌కుమార్, బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్లురవి, చల్లా నర్సింహారెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, టి.రామ్మోహన్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి,

మిగతా 2వ పేజీలో ▶



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేస్తున్న రేవంత్, భట్టి

→ కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరేందుకు ఎలాంటి లబ్ధి కలిగించారో, అలాంటి లబ్ధినే కలిగించడం ద్వారా వారిని బీజేపీలోకి చేర్చుకునేందుకు సిద్ధపడ్డారు. ఈ రెండు ఘటనల్లో ప్రాథమిక ఉద్దేశం ఒకటే. రాజకీయ పార్టీలు చేసే ఇలాంటి కుట్రల వల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలుగుతుంది. ఈ రెండు ఘటనల వెనుక ఏం జరిగిందో వెలికితీసే బాధ్యత దర్యాప్తు సంస్థలపై ఉంది.

\- పోలీసులకు చేసిన ఫిర్యాదులో కాంగ్రెస్

వివరాలిచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించండి

ఎమ్మెల్యేలకు ఎర కేసులో హైకోర్టుకు సీబీఐ విజ్ఞప్తి

9న సీబీఐ వాదనలు వింటామన్న ధర్మాసనం

ఎమ్మెల్యేల కొనుగోలు ఆరోపణల కేసు వివరాలు తమకు ఇవ్వాలంటూ రాష్ట్ర సర్కారుకు లేఖ రాశామని, వివరాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీబీఐ శుక్రవారం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. వివరాలు ఇస్తే దర్యాప్తు చేపడతామని తెలిపింది. అయితే ఇదే కేసుకు సంబంధించిన అప్పీల్‌పై విచారణ సాగుతోందని, సోమవారం సీబీఐ వాదనలు కూడా వింటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం స్పష్టం చేసింది. ఒక దశలో ధర్మాసనం జోక్యం చేసుకుని.. బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయాలకు కోర్టును వేదికగా వాడుకోరాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇరు వాదనలు విన్న అనంతరం.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ చేపడతామని తెలిపింది.

10లో



బిజినెస్, బిర్యానీ గురించి మాట్లాడుకున్నాం..

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో మంత్రి కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్.. 'ఇద్దరు హైదరాబాదీల భేటీతో రోజును ప్రారంభించడం సంతోషంగా ఉంది. బిజినెస్, బిర్యానీ గురించి మాట్లాడుకున్నాం' అని ట్వీట్ చేశారు. - 11లో

ఎవరి సొమ్ముతో ఎవరు కులుకుతున్నారు?

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ ఆగ్రహం

- కేంద్రానికి రాష్ట్రం ఇచ్చింది రూ.3.68 లక్షల కోట్లు
- రాష్ట్రానికి వచ్చింది రూ.1.68 లక్షల కోట్లు మాత్రమే
- నేను చెప్పింది తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- లేదంటే నువ్వు రాజీనామా చేస్తావా?

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/చండూరు: తెలంగాణ సొమ్మునే కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఖర్చు చేస్తోందని, ఎవరి సొమ్ముతో ఎవరు కులుకుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. కేంద్ర నిధులను మళ్లిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సిగ్గు, విషయ

మిగతా 11వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన ప్రసవాలు



'ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచడంలో కేసీఆర్ కిట్ సహా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు ఈ ఆసుపత్రుల్లో ప్రసవాలు 30% ఉంటే ఇప్పుడు 66 శాతానికి పెరిగాయి. డిసెంబర్‌లో ప్రభుత్వాస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో సంగారెడ్డి జిల్లా తొలిస్థానంలో ఉంది' అని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

- వివరాలు 3లో▶

ఇరిగేషన్ డీఈఈ బలవన్మరణం



ఆర్మూర్ ఇరిగేషన్ డీఈఈ జోరుపల్లి వెంకట రమణారావు నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం పోతంగల్ గ్రామంలో తల్లిదండ్రులను కలిసి బయటకు వెళ్లిన డీఈఈ శుక్రవారం గోదావరి నదిలో శవమై కనిపించారు. బదిలీ ప్రయత్నాలు ఫలించని నేపథ్యంలోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు.

- వివరాలు 5లో▶

సంక్రాంతికి 4,233 ప్రత్యేక బస్సులు



సంక్రాంతికి టీఎస్ఆర్టీసీ 4,233 ప్రత్యేక బస్సులను నడుపుతోందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. జేబీఎస్ నుంచి 1184, ఎల్బీనగర్ నుంచి 1133, అరాంఘర్ నుంచి 814, ఉప్పల్ నుంచి 683, కేపీహెచ్‌బీ/బీహెచ్ఈఎల్ నుంచి 419 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని తెలిపారు. పండగ రద్దీ దష్ట్యా నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని, స్పెషల్ చార్జీ ఉండదన్నారు. ఈ నెల 10 నుంచి 14 వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో పోలీస్, రవాణా శాఖ అధికారులు ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

- వివరాలు 3లో▶

స్వచ్ఛందంగా బంద్..

కామారెడ్డి మాస్టర్‌ప్లాన్ మార్చాల్సిందేనంటూ రైతుల ఆందోళన

మూతపడిన వ్యాపార, వాణిజ్య సంస్థలు

తెరుచుకోని స్కూళ్లు, కాలేజీలు, పెట్రోల్ బంకులు

- జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ముందస్తు అరెస్ట్
- పట్టణంలో ఆందోళనకు రైతుల ప్రయత్నం..
- మద్దతుగా వచ్చిన కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు.. ఎక్కడికక్కడే అరెస్టులు
- నిరసనలో పాల్గొన్న షబ్బీర్‌అలీ, కోదండరెడ్డి
- మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

సాక్షి, కామారెడ్డి: కొత్త మాస్టర్‌ప్లాన్‌తో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, దాన్ని వెంటనే మార్చాలని కామారెడ్డి రైతులు ఆందోళన, శుక్రవారం పిలుపునిచ్చిన పట్టణ బంద్ విజయవంతమైంది. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఇచ్చిన పిలుపు మేరకు కామారెడ్డి పట్టణంలో వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, ప్రైవేటు కాలేజీలు, స్కూళ్లు, పెట్రోల్ బంకులను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. అయితే బంద్ సందర్భంగా జిల్లా యంత్రాంగం భారీగా పోలీసు బలగాలను మోహరించడం.. పెద్ద సంఖ్యలో రైతులు ఆందోళనకు దిగడం, వారిని పోలీసులు అడ్డుకోవడం, ఈ సందర్భంగా జరిగిన

మిగతా 2వ పేజీలో ▶



బండి పర్యటన ఉద్రిక్తం!

- కామారెడ్డిలో కలెక్టరేట్ ముట్టడికి సంజయ్ ప్రయత్నం
- సంజయ్‌ను అరెస్ట్ చేసి కారులో తరలించిన పోలీసులు

2లో

కొత్తగా 300 ఏఈవో పోస్టులు!

- రాష్ట్రంలో కొత్తగా 300కుపైగా వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) పోస్టులు రానున్నాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రం సాగుభూమి పెరగడం, ఏఈవో క్లస్టర్ల పరిమాణం పెరగడంతో వాటిని హేతుబద్ధీకరించాలని.. అవసరమైన చోట కొత్త క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్త క్లస్టర్ల అవసరం, వాటికి ఏఈవోల నియామకంపై ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

- వివరాలు 11లో▶

147 కాంట్రాక్టు ప్రొఫెసర్ పోస్టులు

- రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల్లో 147 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు.. 69 ఏళ్ల వయసున్న వారు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. - 11లో

ఇదండీ సంగతి [?]



కాల్పుల విరమణ అర్జంటుగా పాటించాల్సింది మనం కాదాసార్.. వాళ్లు!!

ఆసుపత్రిలో కరెంట్ లేకపోతే ఎట్లా?

మెడికల్ ఆఫీసర్‌ను నిలదీసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గుడిమల్కాపూర్ ఉషోదయ కాలనీ పీహెచ్‌సీలో పరిస్థితిపై మండిపాటు



గోల్కొండ (హైదరాబాద్): 'ఆసుపత్రిలో ఇన్నాళ్లు కరెంటు లేకపోతే మీరు ఏం చేస్తున్నారు' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఓ ప్రాథమిక ఆరోగ్య (పీహెచ్‌సీ) కేంద్రం మెడికల్ ఆఫీసర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గుడిమల్కాపూర్ ఉషోదయ కాలనీలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దాదాపు మూడు నెలలుగా ఆసుపత్రిలో కరెంటు లేకపోవడంపై ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవితపై మండిపడ్డారు. బాధ్యతగల ప్రభుత్వ అధికారిగా ఉంటూ ఇన్నాళ్లూ ఆసుపత్రిలో కరెంటు లేకపోయినా పట్టించుకోకపోవడం తగదని అన్నారు. పేద ప్రజలు ఎక్కువగా వచ్చే ప్రాథమిక ఆరోగ్య

మిగతా 2వ పేజీలో ▶

దేవభూమికి బీటలు!



జోషిమఠ్. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు చిరపరిచితమైన పేరు. ఉత్తరాఖండ్‌లో అత్యంత పురాతనమైన పట్టణం పూర్తిగా కనుమరుగయ్యే రోజులు దగ్గరకొస్తున్నాయి. జోషిమఠ్‌లో వందలాది ఇళ్లు బీటలు వారాయి.


6లో

బీకాం.. భలే గిరాకీ!

కామర్స్ చేసిన వారికి పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు

సాఫ్ట్‌వేర్‌తో సమానంగా వేతనాలు ఆఫర్ చేస్తున్న కంపెనీలు

- 2023లో వారిదే హవా: ఇండియా స్కిల్ రిపోర్టు
- కోవిడ్ తర్వాత మారిన వాణిజ్య పంథానే కారణం
- అనలిస్టులకు భారీగా డిమాండ్
- ఐదేళ్లలో 30% పెరిగిన ఉపాధి
- తెలంగాణలో బీకాం అడ్మిషన్ల జోరు



సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు వార్షిక ప్యాకేజీ రూ.20 లక్షలు అంటే.. అబ్బో అంటారు. కానీ ఇప్పుడు బీకాం చేసిన విద్యార్థికే ఏడాదికి రూ.21 లక్షల ప్యాకేజీ ఇస్తున్నారంటే నమ్మగలమా? నమ్మాల్సిందే! అంతర్జాతీయ సంస్థలే కాదు, భారత్‌లోని కంపెనీలూ ఇప్పుడు అనలిస్టులకు ఇంతకన్నా ఎక్కువ ప్యాకేజీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. 2023లో 60 శాతం వరకు అవకాశాలు వారికే దక్కే అవకాశం ఉందని ఇండియా స్కిల్ రిపోర్టు- 2023 చెబుతోంది. భవిష్యత్తులోనూ కామర్స్ చేసిన వారికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు లభిస్తాయని స్పష్టం చేస్తోంది. వాస్తవానికి గత ఆరేళ్ల నుంచే డిమాండ్ పెరుగుతూ వస్తోందని పేర్కొంది. 2017లో 37.98 శాతం బీకాం విద్యార్థులు ఉద్యోగాలు పొందితే, 2023లో ఇది ఊహించని విధంగా ఏకంగా 60.62 శాతానికి చేరుకోబోతోందని వివరించింది. ఇక బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, సైబర్ క్రైం కోర్సుల విద్యార్థులకు ఎక్కువ అవకాశాలుంటాయని తెలిపింది.

అన్ని రంగాల్లో పెరిగిన అవకాశాలు..

కరోనా తర్వాత వాణిజ్య రంగంలో పెద్ద మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ-కామర్స్ అనూహ్యంగా అభివృద్ధి చెందింది. అంతర్జాతీయంగా బహుళజాతి

మిగతా 11వ పేజీలో ▶

క్లుప్తంగా...

అసదుద్దీన్‌కు రెండు ఓట్లు

- వేర్వేరు చిరునామాలతో నమోదు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సంఘం తాజాగా వెల్లడించిన ఓటరు జాబితాలో హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి రెండు వేర్వేరు చిరునామాలతో రెండు చోట్ల ఓట్లున్నట్టు వెల్లడైంది. సాధారణ పౌరులకు ఇలా ఉన్నట్టు అడపాదడపా వినడం సాధార ణమే అయి నా.. ఒక ఎంపీకి రెండు చోట్ల ఓటర్ల జాబితా లో పేరుండటం గ్రేటర్‌లో చర్చనీ యాంశమైం ది. అసుదుద్దీన్ ఒవైసీకి ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరు గుర్తింపు కార్డు నం బర్ (ఎపిక్ నంబర్) టీడీజెడ్1557521తో హైదర్‌గూడ ఉర్దూ హాల్ లేన్ చిరునామాతో మదీనా హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఒక ఓటుంది. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజక వర్గంలో ఎపిక్ నంబర్ కేజీవై0601229తో మైలార్‌దేవ్‌పల్లిలో సెయింట్ ఫియాజ్ స్కూల్ పోలింగ్‌స్టేషన్‌లో మరో ఓటుంది.

ఎన్నికల సంఘానికి టీపీసీసీ ఫిర్యాదు

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి రెండు చోట్ల ఓటు హక్కు ఉండటంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

కుదిరితే పొత్తు.. లేదంటే ఒంటరిగా..



ఇల్లెందు: రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్ని కల్లో కలిసి వచ్చే పార్టీ లు, వామపక్షాలతో పొత్తుకు ప్రయత్ని స్తామని, పొత్తు కుద రకుంటే ఒంటరిగానే బరిలోకి దిగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద రాజకీయాలతో తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, అలాంటి పార్టీలకు రాష్ట్రం లో తావులేదని పేర్కొన్నారు.

ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకునేది లేదు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఒక్క రైతుకు అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల హెచ్చరించారు. రోజూ 13 పేపర్లు చదివే చిన్న దొరకు రైతు ఆత్మహత్య వార్త కంటికి కనిపించలేదా అని శుక్రవారం ఆమె తన ట్విట్టర్‌లో ప్రశ్నించారు. నెల రోజుల నుంచి కామారెడ్డి పట్టణ రైతులు ఆందోళన చేస్తుంటే మున్సిపల్ మంత్రికి ఒక్క పేపర్లోనైనా వార్త కన్పించలేదా అని ఎద్దేవా చేశారు. రైతుల ప్రాణాలు పోతే తప్ప రాష్ట్ర ప్రభుత్వం స్పందించదా అని నిలదీశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు షర్మిల ఆరుగురు సభ్యులతో రాజకీయ కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి కొండా రాఘవరెడ్డి, అధికార ప్రతినిధులు గట్టు రామచంద్ర రావు, పిట్టరాంరెడ్డి, గడిపల్లి కవిత, ఏపూరి సోమన్నలతో పాటు వైఎస్సార్ విగ్రహాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ నీలం రమేశ్‌లను నియమిస్తున్నట్లు షర్మిల ఉత్వర్వులు జారీ చేశారు.

శ్రీచైతన్య హ్యాట్రిక్ రికార్డు



సాక్షి, హైదరాబాద్: ఇప్పటికే రెండు వరల్డ్ రికార్డులను సృష్టించి తనకు తానే సాటి అని నిరూపించుకున్న శ్రీచైతన్య స్కూల్ ఈనెల 5న మరో ప్రపంచ రికార్డుతో చరిత్ర తిరగరాసిం ది. 100 రోజుల శిక్షణతో 10 రాష్ట్రాల్లోని 73 బ్రాంచీల నుంచి 400 లింక్స్ ద్వారా 2వేలకు పైగా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ విద్యార్థులు పాల్గొని 1 నుంచి 100 వరకు మ్యాథ్ టేబుల్స్ 100 నిమిషాల్లోపు అప్పజెప్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భం గా శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ మీడియాతో మాట్లాడుతూ స్టూడెంట్స్, టీచర్స్ కృషితోనే ఇంతటి గొప్ప విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.

బండి పర్యటన ఉద్రిక్తం!

కామారెడ్డిలో కలెక్టరేట్ ముట్టడికి సంజయ్ ప్రయత్నం

- పోలీసులు, బీజేపీ శ్రేణులకు మధ్య తోపులాట
- సంజయ్‌ను అరెస్ట్ చేసి కారులో ఎక్కించిన పోలీసులు
- అడ్డుకుని కారు అద్దాలు ధ్వంసం చేసిన కార్యకర్తలు
- పలువురు అదుపులోకి.. హైదరాబాద్‌కు సంజయ్ తరలింపు
- అంతకుముందు రైతు రాములు కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ రాష్ట్ర చీఫ్
- అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

సాక్షి, కామారెడ్డి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సం జయ్ కామారెడ్డి పర్యటన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. శుక్రవారం రాత్రి సంజయ్ పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ముట్టడికి రాగా పోలీసులు అడ్డుకున్నారు. దీనితో తీవ్ర తోపులాట, వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి. తొలుత బండి సంజయ్ జిల్లాలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు పయ్యావుల రాములు కుటుంబాన్ని పరామర్శిం చారు. ప్రభుత్వ తీరును తప్పుపడుతూ.. కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై తేల్చుకునేందుకు కలెక్టరేట్‌కు వెళ తానని అక్కడే ప్రకటించారు. కాసేపటికే పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌కు బయ లుదేరారు. ఈ విషయం తెలిసిన పోలీసులు కామా రెడ్డి ప్రధాన రహదారిపై బారికేడ్లు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేసినా.. బీజేపీ శ్రేణులు బారికేడ్లను తోసివేసి, బండి సంజయ్ కాన్వాయ్‌ను ముందుకు తీసుకువెళ్లాయి.

కలెక్టరేట్ ముందు ఘర్షణ

కామారెడ్డి పట్టణంలో కలెక్టరేట్ ప్రధాన గేటుకు కొంత ముందు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి సంజయ్, బీజేపీ శ్రేణులను అడ్డుకున్నారు. కానీ వందల సంఖ్యలో చేరిన బీజేపీ కార్యకర్తలు బలం గా తోయడంతో బారికేడ్లు కింద పడిపోయాయి. బండి సంజయ్, ఇతర నేతలు, కార్యకర్తలు కలెక్ట రేట్‌లోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేశారు. ప్రధాన గేటును మూసి ఉండటంతో అది సాధ్యపడలేదు. కొందరు కార్యకర్తలు గేటు ఎక్కి లోపలికి దూకాలని చూడగా పోలీసులు అడ్డుకున్నారు. ఇలా దాదాపు గంట పాటు బీజేపీ శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. చివరికి పోలీసులు సంజ య్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో ఎక్కించారు. కానీ పార్టీ శ్రేణులు పోలీసు వాహనం ముందుకు కదలకుండా అడ్డుకున్నారు. కొందరు ఆ వాహనం అద్దాలన్నీ ధ్వంసం చేశారు. బానెట్‌పై, అన్ని వైపులా గట్టిగా బాదడంతో కారు దెబ్బతిన్న ది. అయినా పోలీసులు బీజేపీ శ్రేణులను పక్కకు తప్పించి వాహనాన్ని ముందుకు తీసుకువెళ్లారు. బండి సంజయ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనలో మరో వాహనం కూడా దెబ్బతిన్నట్టు చెప్తున్నారు. కానీ అంతా చీకటిగా ఉండటంతో స్పష్టత రాలేదు. ఇక పోలీసులపై, వాహనంపై దాడి చేసిన వారిలో కొందరిని పోలీసులు గుర్తించి అదు పులోకి తీసుకున్నారు.

కేసీఆర్ సర్కారుకు పోయేకాలం: తరుణ్ ఛుగ్

బండి సంజయ్ అరెస్టును బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ ఓ ప్రకట నలో ఖండించారు. ''అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో రైతు సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న ఎంపీ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్టు చేయడం కేసీఆర్ నియంతృత్వ పాలనకు నిద ర్శనం. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా కేసీఆర్ సర్కారుకు పోయేకాలం దాపురించిం ది'' అని వ్యాఖ్యానించారు.



సంజయ్‌ను తరలిస్తున్న పోలీసు వాహనంపై కార్యకర్తలు దాడి చేయడంతో పగిలిన అద్దాలు

పెద్దోళ్లకు మేలు చేసే మాస్టర్ 'ప్లాన్' ఇది!

అధికార పార్టీకి చెందిన బడా నాయకులకు మేలు చేసేందుకే.. అధికారులు, నాయకులు కుమ్మక్కై కామారెడ్డి పట్టణ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్న, కొని పెట్టుకున్న భూముల ధరలు పెరగడం కోసం పక్కన ఉన్న పేద రైతుల భూముల నుంచి వంద ఫీట్ల రోడ్లు వేయడానికి ప్లాన్ చేశారని ఆరోపించారు. పరిశ్ర మలకు అవసరమైన బీడు భూములను వది లేసి.. రెండు పంటలు పండే భూములను ఇం డస్ట్రియల్ జోన్ కింద చూపడం మూర్ఖత్వమని మండిపడ్డారు. రాములుది ఆత్మహత్య కాదని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇక్కడి కలెక్టర్, ప్రజా ప్రతినిధులు కలిసి చేసిన హత్య అని వ్యాఖ్యానించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు రియ ల్టర్ల అవతారం ఎత్తి ప్రజల భూములను కొల్లగొ డుతున్నారని ఆరోపించారు. కామారెడ్డిలో రైతు లు పోరాటం చేస్తుంటే.. కలెక్టర్ వారిని పట్టించు కోకపోగా, అవమానించేలా మాట్లాడుతున్నారని సంజయ్ ఆరోపించారు. కలెక్టర్ ఉద్యోగం చేయడం చేతకాకపోతే బీఆర్ఎస్ జెండా కప్పుకో వాలని వ్యాఖ్యానించారు. మాస్టర్ ప్లాన్ మార్చేవ రకు రైతుల వెంట ఉండి ఉద్యమం కొనసాగిస్తా మన్నారు. రైతు రాములు కుటుంబానికి తమ రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. బండి సంజ య్ వెంట మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఉన్నారు.

స్వచ్ఛందంగా బంద్..

▶ మొదటి పేజీ తరువాయి

తోపులాట, అరెస్టులతో రోజంతా ఉద్రిక్త పరిస్థితి కనిపించింది.

ఉదయం నుంచే అరెస్టులు, ఆందోళన

కామారెడ్డి మున్సిపాలిటీలోకి చుట్టుపక్కల గ్రామా లను విలీనం చేస్తూ రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్‌పై ఆయా గ్రామాల రైతులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. విలువైన పంట భూములను నష్టపోయే పరిస్థితి ఏర్పడిందంటూ ఆందోళనబాట పట్టారు. ఈ ఆందోళనలకు కాంగ్రెస్, బీజేపీతో పాటు ఇతర విపక్షాలు మద్దతు ప్రకటించాయి. మాస్టర్‌ప్లాన్‌తో భూమి నష్టపోతాననే ఆందోళనతో ఇటీవల ఒక రైతు ఆత్మహత్య చేసుకోవడంతో.. రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గురు వారమే జిల్లా కేంద్రంలో రైతులు, వారి కుటుంబ సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు, రైతు లకు మధ్య తోపులాట, అరెస్టులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన రైతులు శుక్రవారం బంద్‌కు పిలుపు నిచ్చారు. దీనితో పోలీసులు అప్రమత్తమై.. ముంద స్తుగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి ఇంటికి తెల్లవారు జామునే చేరుకున్న పోలీసులు.. ఆయనను కొంత సేపు గృహ నిర్బంధం చేశారు. తర్వాత రాజంపేట ఠాణాకు తరలించారు.

ఉదయమే పట్టణంలోకి చేరుకుని..

శుక్రవారం ఉదయమే దేవునిపల్లి, లింగాపూర్, అడ్లూర్, ఇల్చిపూర్, అడ్లూర్ ఎల్లారెడ్డి, టేక్రియాల్ తదితర గ్రామాలకు చెందిన రైతులు గ్రూపులుగా కామారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారులపైకి చేరుకుని నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అక్కడ క్కడా తెరిచి ఉంచిన దుకాణాల వద్ద ఆందోళన చేశారు. మరోవైపు పోలీసులు నిరసనలు చేపట్టిన రైతులు, వారికి మద్దతుగా వచ్చిన రాజకీయ పార్టీల నేతలను ఎప్పటికప్పుడు అదుపులోకి తీసు కుని.. వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు.

ఆఫీసును ముట్టడించిన మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పోలీసుల కళ్లు గప్పి తన అనుచరులతో మున్సిపల్ కార్యాలయా నికి చేరుకున్నారు. అక్కడ ఆయనను గమనించిన పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. మాజీ ఎమ్మెల్యే చొక్కా చిరిగిపోయింది. అయినా రవీంద ర్‌రెడ్డి కార్యాలయంలోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేయగా అధికారులు తలుపులు మూసేశారు. దీనితో రవీందర్‌రెడ్డి, ఆయన అనుచరులు అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అరెస్ట్ చేశారు.

ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నేతల ఆందోళన

రైతుల ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరా బాద్ నుంచి వచ్చిన మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌లు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కామారెడ్డి లోని ఇందిరాచౌక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రధాన రహదారిపై రైతులకు మద్దతుగా ధర్నాకు దిగారు.



కామారెడ్డిలో నిర్మానుష్యంగా మారిన రోడ్లు

బీఆర్ఎస్‌కు అధికారమిస్తే | అక్కడా సంక్షేమ పథకాలు

కర్ణాటక, మహారాష్ట్ర భక్తులకు మంత్రి హరీశ్ పిలుపు

జహీరాబాద్: కర్ణాటక, మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు మద్దతు పలికి అధికారంలోకి తీసుకొస్తే తెలం గాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అక్కడ కూడా అమలు చేస్తామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండాలో నిర్వహిస్తున్న మోతీమాత జాతరలో శుక్రవారం సాయంత్రం పాల్గొని అమ్మవారిని దర్శిం చుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడారు. మోతీమాత జాతరకు పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారని, తెలంగాణలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి ఇక్కడి వారిని అడిగి తెలుసుకోవాలని కోరారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న రైతుబం ధు, రైతుబీమా, పింఛన్లతో పాటు పలు పథకాలను ఆయా రాష్ట్రాల్లో కూడా అమలు పరుస్తామన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హరీశ్ వెల్లడించారు. కేసీఆర్ గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెం చారని, దీంతో ఇటీవల జరిగిన మెడిసిన్ విద్యార్థుల అడ్మిషన్లలో అదనంగా 240 మందికి లబ్ధిచేకూరిం దని వివరించారు. మినీ మేడారంగా పిలిచ మోతీమాత ఆలయాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగా నో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జహీరా బాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, కలెక్టర్ శరత్, డీసీఎం ఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.



మోతీమాతను దర్శించుకున్న హరీశ్‌రావును సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

రాజ్యాంగబద్ధంగానే పార్టీ మారాం

బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి: రోహిత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధంగా పార్టీ మారిన తమపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా ఉందని తాం దూరు ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి వ్యాఖ్యానిం చారు. శుక్రవారం రోహిత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 నిబం ధనల మేరకే తాము టీఆర్ఎస్‌లో పార్టీ శాసనసభా పక్షాన్ని విలీనం చేశామన్నారు. పార్టీ మార్పు అం శంపై కాంగ్రెస్ తమపై గతంలోనే కేసులు వేసిందని గుర్తు చేసిన రోహిత్‌రెడ్డి.. కాంగ్రెస్ నాయకులు మొదట వారి అంతర్గత తగాదాలు తేల్చుకోవాలని సూచించారు. తమపై టీపీసీసీ నేతలు ఫిర్యాదు చేసిన విధానం బీజేపీకి వత్తాసు పలికేదిగా ఉం దన్నారు. బ్లాక్ మెయిల్‌కు బ్రాండ్ అంబాసిడర్ గా రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ, ఆయన కాంగ్రెస్‌లో చేరిక సమయంలో రాజీనామా లేఖను స్పీకర్‌కు ఇవ్వకుండా చంద్రబాబుకు ఇచ్చారన్నారు.

99... 18... 126

- కొలిక్కి వస్తున్న రేవంత్ పాదయాత్ర షెడ్యూల్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజ్ గిరి ఎంపీ రేవం త్‌రెడ్డి పాదయాత్ర షెడ్యూల్ క్రమంగా కొలిక్కి వస్తోంది. ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న రేవంత్ పాదయాత్ర రాష్ట్రంలోని 99 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా సాగనుందని తెలుస్తోంది. రోజుకు 18 కిలోమీటర్ల చొప్పున 126 రోజుల్లో ఈ యాత్ర పూర్తయ్యేలా ప్రాథమిక షెడ్యూల్ రూపొందించారు. అంటే జనవరి 26 నుంచి మే మొదటివారం వరకు ఈ యాత్ర జరిగే అవకాశముంది. ఇందుకుగాను క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ముందు కాంగ్రెస్ ముఖ్య నేతలు సీఎల్పీ కార్యాలయంలో భేటీ అయ్యారు.

కేటీఆర్.. మాట్లాడే పద్ధతి, భాషను మార్చుకో: చింతల

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్, పరిశ్రమల శాఖల మంత్రి కె.తారకరామారావు (కేటీఆర్) తన భాషను మార్చుకుని పద్ధతిగా మాట్లాడటం నేర్చుకోవాలని బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హితవు పలికారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా కుసంస్కారంతో మాట్లాడటం మానుకోవాలని సూచించారు. తెలంగాణ నిధులను కేంద్రప్రభుత్వం వేరే రాష్ట్రాల్లో వినియోగిస్తోందంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై హుజూర్‌నగర్ సభలో కేటీఆర్ అనుచితమైన వ్యాఖ్యలు చేయడాన్ని చింతల శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తమపై అర్థం లేని విమర్శలు చేస్తున్న కేటీఆర్ హైదరాబాద్ ఆదాయాన్ని గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు తీసుకెళ్లడంపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి ఎవరేం చేశారో, చేస్తున్నారో తేల్చుకునేందుకు బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. వేదికను కూడా కేటీఆర్ నిర్ణయించి చెబితే..అక్కడికే వచ్చి ప్రజలకు వాస్తవాలు చెబుతామని సవాల్ విసిరారు.

కేసీఆర్ సర్కారు పతనానికి నాంది

- రైతుల ఉద్యమంపై బీజేపీ నేత ఎంపీ డా.కె.లక్ష్మణ్
- ఏప్రిల్ లో కేసీఆర్ ప్రభుత్వంపై అమిత్ షా ఛార్జ్ షీట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం లో ప్రస్తుతం కొనసాగు తున్న రైతుల ఉద్యమం కేసీఆర్ సర్కార్ పతనానికి నాంది పలుకుతుందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం దళారీ పాత్ర పోషిస్తోందని, మాస్టర్ ప్లాన్, మెట్రో ప్రాజెక్ట్, ఫార్మా సిటీలకు భూసేకరణ పేరుతో భుదందాకు పాల్పడుతోందని ఆరోపించారు. పేదల భూముల ను ఎంత లాక్కున్నారు. వాటిని ఏ ప్రాజెక్ట్ కోసం వినియోగించారన్న దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం డా.లక్ష్మణ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తమ నినాదం ఆప్ కి బార్ కిసాన్ సర్కార్ బదులు ఆప్ కి బార్ దళారీ సర్కార్ అని పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రైతు చనిపోతే మంత్రి కేటీఆర్ ఎగతాళిగా, వ్యంగ్యంగా మాట్లాడతారా.. రైతులం టే అంత చిన్నచూపా అని నిలదీశారు.

సంక్రాంతి తర్వాత రైతాంగ సమస్యలపై...

సంక్రాంతి తర్వాత పల్లె పల్లెకు బీజేపీ పేరుతో రైతు సమస్యలపై ఉద్యమిస్తామని లక్ష్మణ్ చెప్పారు. ప్రజా సమస్యలపై మేధావుల సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. 'కేసీఆర్ హఠావో తెలంగాణ బచావో' నినాదంతో 90 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే ధ్యేయంగా 'మిషన్ 90'తో ముందుకెళ్తామన్నారు. జిల్లా స్థాయిలో భారీ సభలు, 10 వేల గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ లో కేసీఆర్ ప్రభుత్వంపై కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా ఛార్జ్ షీట్ విడుదల చేస్తారని వివరిం చారు. రాబోయే మూడు నెలల్లో ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటాన్ని ఉధృతం చేస్తుందన్నారు.

ఆ 'ఎర'లపై చర్యలేవీ?

▶ మొదటి పేజీ తరువాయి

చరణ్‌కౌశిక్ యాదవ్, నర్సారెడ్డి భూపతిరెడ్డి, మెట్టు సాయికుమార్ తదితరులు శుక్రవారం ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు. ఇందులో బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు, 12 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులను నిందితులుగా పేర్కొన్నారు. ఆర్థిక లబ్ధి చేకూర్చడం తో పాటు పదవులు ఇవ్వడం ద్వారా తమ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలను ప్రలోభపర్చు కున్నారని, అవినీతి నిరోధక చట్టం–1988లోని 7, 8, 13, 14 సెక్షన్లతో పాటు ఐపీసీ సెక్షన్లు 120–బీ, 171–బీ రెడ్‌విత్ 171ఏ, 34 సెక్షన్ల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. రోహిత్‌రెడ్డి ఫిర్యాదుతో నమోదు చేసిన కేసుతో తమ ఫిర్యాదును కూడా కలిపి విచారించాలని కోరారు.

ఫిర్యాదులో ఏముందంటే..

'2014 నుంచి 2018 మధ్య కాలంలో నలుగురు ఎం పీలు, 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీలు వివిధ రాజకీయ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లారు. 2018లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మా పార్టీకి చెందిన 12 మంది ఎమ్మెల్యేలను ప్రలోభపరుచుకునే ప్రయత్నాలు చేసింది. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచే టీఆర్ఎస్‌తో పెద్దలతో టచ్‌లో ఉన్న మా పార్టీకి చెందిన 12 మంది, తమకు వివిధ రూపాల్లో లబ్ధి చేకూరగానే టీఆర్ఎస్‌లో చేరారు. అయితే ఈ 12 మందిలో ముగ్గురిని చేర్చుకునేందుకు బీజేపీ ఎర వేసిందనే ఆరోపణలపై రోహిత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు అయ్యింది. రోహిత్‌రెడ్డి కేసులో విచారణ పక్షపాత ధోరణిలో జరుగుతున్నందున ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎఫ్ఐఆర్ నం: 455కు సం బంధించిన రికార్డులను సీబీఐకి అప్పగించే సమయంలో మా ఫిర్యాదును కూడా సదరు దర్యాప్తు సంస్థకు బదిలీ చేయండి..' అని కాంగ్రెస్ నేతలు ఆ ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు అనం తరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో రేవంత్, భట్టి మీడియాతో మాట్లాడారు.

ఈడీ, సీబీఐ డైరెక్టర్‌కూ ఫిర్యాదు చేస్తాం: రేవంత్

కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచి ఆర్థిక, అధికార ప్రయోజనాల కోసం పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలపై ఫిర్యాదు అనం తరం భట్టితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి తన అధికారాన్ని పదిలం చేసుకోవాలనుకున్నారని, అందుకే వివిధ పార్టీల్లో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీ లను టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని మండిపడ్డారు. సీఎల్పీ నేతగా దళిత నాయకుడు భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీలో గెలిచిన 12 మంది ఎమ్మెల్యేలను వివిధ సందర్భాల్లో టీఆర్ఎస్‌లో చేర్చుకుని ఆర్థిక, అధికార ప్రయోజనాలను కల్పిం చారని, కాంట్రాక్టులు ఇచ్చారని ఆరోపించారు. ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయబద్ధంగా వ్యవహరించలేదని విమర్శించారు.

పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

2014 నుంచి ఇప్పటివరకు జరిగిన ఫిరాయిం పులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని రేవం త్‌రెడ్డి డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదులోని ఆధారాలను కూడా పరిశీలించాలన్నారు. విచారణ వ్యవస్థలు సరిగా స్పందించకపోతే కోర్టును ఆశ్రయి స్తామని చెప్పారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు మళ్లీ చట్టసభల్లో అడుగు పెట్టకుండా అవసరమైతే పోరాటం చేయడానికీ వెనకాడబోమన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం: భట్టి

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. 12 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో ఒకేసారి చేరలేదని.. విడతల వారీగా చేరిన ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించడం ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. ఫిరాయింపులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకునేంత వరకు కాం గ్రెస్ పార్టీ పోరాటం చేస్తూనే ఉంటుందని అన్నారు. ఇదిలావుండగా.. కాంగ్రెస్ నేతల ఫిర్యాదు స్వీకరిం చి పరిశీలించామని, కోర్టు అనుమతి, న్యాయసలహా తీసుకుని కేసు నమోదుపై ముం దుకెళ్తామని ఎస్పై లింగ్యానాయక్ తెలిపారు.

12 మంది ఎమ్మెల్యేలకు జరిగిన లబ్ధి గురించి కాంగ్రెస్ ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలివే

హరిప్రియ బానోతు: నగదు లబ్ధి
పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి: 08–09–2019 నుం చి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు
కందాల ఉపేందర్‌రెడ్డి: నగదు లబ్ధితో పాటు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు బిల్లుల మంజూరు
దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి: 08–02–2020 నుంచి మూసీరివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి
రేగ కాంతారావు: అసెంబ్లీ విప్ హోదా
ఆత్రం సక్కు: నగదు లబ్ధి
చిరుమర్తి లింగయ్య: నగదు లబ్ధి
వనమా వెంకటేశ్వరరావు: నగదు లబ్ధి, భూఅంశాల సెటిల్‌మెంట్
బీరం హర్షవర్ధన్‌రెడ్డి: నగదు లబ్ధి (భూసేకరణ మొత్తం)
జాజుల సురేందర్: నగదు లబ్ధి
గండ్ర వెంకటరమణారెడ్డి : నగదు లబ్ధి, భార్య జ్యోతికి భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ పదవి
రోహిత్ రెడ్డి: నగదు లబ్ధి

మోదీ ఫెయిల్యూర్ ప్రైమ్ మినిస్టర్

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక ఫెయిల్యూర్ ప్రైమ్ మినిస్టర్ అని.. ఆయన దేశానికి చేసిందేమీ లేదని రహదారులు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. మోదీ హయాంలో ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొం డపల్లి, ఖమ్మంరూరల్ మండలాలతో పాటు సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో రూ.68.5 కోట్లతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు ఆయన రవాణా శాఖ మం త్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండలం రామన్నపేట, తల్లాడ, కల్లూరు మండలం చెన్నూ రుల్లో జరిగిన సభల్లో ప్రశాంత్‌రెడ్డి ప్రసంగించారు. రూ.2వేల పెన్షన్, కల్యాణలక్ష్మి వంటి పథకాలతో కేసీఆర్ పేదల ఇళ్లకు డబ్బు పంపుతున్నారని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రధాని మోదీ మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచి పేదల ఇళ్లనుంచి రూ.3 వేల నుంచి రూ.4 వేలు తీసుకెళ్తున్నారని విమర్శించారు. మోదీ.. పాలేరు నియోజకవర్గానికి తన ఏజెంట్లను పం పుతున్నారన్నారు. జాతీయస్థాయిలో తెలంగాణ మోడల్‌ను తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా మారిందని పువ్వాడ తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి వేముల, పక్కన మంత్రి అజయ్, ఎంపీ నామా తదితరులు

ఆసుపత్రిలో కరెంట్ లేకపోతే ఎట్లా?

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రంలో సౌకర్యాలు ఇలా ఉంటే ఎట్లా? అని మం డిపడ్డాడు. రాష్ట్రాలకు కేంద్రం నుంచి ఆసుపత్రుల కోసం ప్రత్యేక నిధులు వస్తాయని, కరెంటు పునరుద్ధరణ గురించి ఉన్నతాధికారులను ఎందుకు అడగలేకపోయారని ప్రశ్నించారు. స్థానిక ప్రజాప్రతినిధి సలహాలు, సూచనలు తీసుకోవడం లో ఎందుకు నిర్లక్ష్యం వహించారని ఆయన డాక్టర్ కవితను నిలదీశారు. అనంతరం కార్వాన్ క్లస్టర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనురాధతో ఫోన్లో మాట్లాడి ఉషోదయకాలనీలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కరెంటు లేకపోవడంపై నిలదీశారు. పీహెచ్‌సీలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన మీరు ఎందుకు నిర్లక్ష్యం వహి చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారుల పనితీరు ఇలా ఉంటే ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు ఎలా అందిస్తారని ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. వెంటనే ఉషోదయకాలనీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కరెంటు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి ఆదేశించారు. కాగా, మూడు నెలలకిందట ఈ పీహెచ్‌సీలో షార్ట్ సర్క్యూట్‌తో కరెంటువైర్లు కాలిపోయాయని, దాం తో అప్పటి నుంచి కరెంటు లేకుండా పోయిందని తెలుస్తోంది. గత కొంతకాలం నుంచి ఈ ఆరోగ్య కేంద్రం పనితీరుపై స్థానికులు అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పుడు కేంద్రమంత్రి ఈ ఆసుపత్రిని సందర్శించడంతో పీహెచ్‌సీ పనితీరు మారుతుం దని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బొమ్మ దొరికిందోచ్..!

- రైలు ప్రయాణంలో పోగొట్టుకున్న చిన్నారి
- ఆచూకీ కనుగొని తిరిగి అందజేసిన రైల్వే అధికారులు



సాక్షి, హైదరాబాద్: సాధారణంగా ప్రయాణంలో పోగొట్టుకున్న వస్తువులు తిరిగి దొరకడం అరుదు. అలాంటి ఓ వస్తువును రైల్వే అధికారులు స్వయంగా ఇంటికే వచ్చి బాధితులకు అప్పగిస్తే..! పైగా, అది ఓ చిన్నారికి ఎంతో ఇష్టమైన బొమ్మ అయితే...! ఆ బొమ్మను తిరిగి పొందిన ఆ చిన్నారి ఆనందానికి అవధులు ఉంటాయా..? ఉండవనే చెప్పవచ్చు. సికింద్రాబాద్ నుంచి అగర్తలాకు (07030) వెళ్లే రైలులో ఈ నెల 4న ప్రయాణం చేస్తున్న భూసిన్ పట్నాయక్ అనే ప్రయాణికుడి ఎదురు సీట్లో ఉన్న ఓ చిన్నారి తనకు ఎంతో ఇష్టమైన బొమ్మను పోగొట్టుకొంది. దాని కోసం దిగాలుగా ఏడుస్తున్న ఆ చిన్నారికి ఎలాగైనా దానిని అందించాలనే ఉద్దేశంతో భూసిన్ రైల్వే మదద్ యాప్ ద్వారా 139 నంబర్‌కు ఫోన్ చేసి విషయాన్ని చేరవేశారు. దీంతో రైల్వే అధికారులు ఆ చిన్నారి వివరాలను సికింద్రాబాద్ రైల్వే కౌంటర్ ద్వారా తెలుసుకున్నారు. ఈ క్రమంలో రైల్వే శాఖ సిబ్బంది ఆ బొమ్మ ఆచూకీ కోసం ఆరా తీసి, న్యూ జల్పాయ్‌గురి స్టేషన్ దగ్గర్లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఉత్తర దినాజ్‌పూర్ జిల్లా అలియాబరి స్టేషన్‌కు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ చిన్నారి తల్లిదండ్రులు మోహిత్, నస్రీన్ బేగంలను కలిసి ఆ బొమ్మను అప్పగించారు. ఈ సందర్భంగా రైల్వేమంత్రికి, అధికారులు, సిబ్బందికి ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

• బీఆర్‌ఎస్

పండుగ తర్వాత..

సంక్రాంతి తర్వాత ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించనున్న అధినేత కేసీఆర్

- వరుసగా జిల్లాల సమీక్షలు, సమావేశాలు.. ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లేలా ప్రణాళిక
- వ్యూహాల అమలు, పర్యవేక్షణ బాధ్యతలు కేటీఆర్‌కు..
- జిల్లాల్లో మంత్రులు, రాష్ట్రవ్యాప్త పర్యటనలకు కేటీఆర్, హరీశ్
- పర్యటనల నివేదికలు పార్టీ అధినేతకు..
- బడ్జెట్ సమావేశాల తర్వాత 'ముందస్తు'పై స్పష్టత
- పనితీరు ఆధారంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభకు ఈ ఏడాది చివరిలోగా ఎన్నికలు జరగాల్సి ఉండటంతో.. ఎన్నికల సన్నద్ధతను సీఎం కేసీఆర్ సంక్రాంతి తరువాత ప్రారంభించనున్నారు. అన్ని జిల్లాల్లో పార్టీ స్థితిగతులపై పూర్తి అవగాహనతో ఉన్న ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సంక్రాంతి తరువాత జిల్లాల వారీగా ముఖ్యనేతలతో వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. వరుసగా మూడోసారి అధికారం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్న కేసీఆర్ ఈ ఎన్నికలను సవాల్‌గా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు కూడా అధికారిక కార్యక్రమాల పేరిట జిల్లాల పర్యటనలు చేయనున్నారు. తద్వారా పార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. బీఆర్‌ఎస్ కార్యకలాపాలను జాతీయస్థాయిలో విస్తరించేందుకు కసరత్తు చేస్తున్న కేసీఆర్.. తెలంగాణ శాసనసభ ఎన్నికల వ్యూహాన్ని కూడా ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాల వారీగా పార్టీ స్థితిగతులపై ఒక అంచనాకు వచ్చిన ఆయన సంక్రాంతి తర్వాత జిల్లాల వారీగా ముఖ్యనేతలతో సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. కేసీఆర్ రూపొందించిన వ్యూహాల అమలు, పర్యవేక్షణ బాధ్యతలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అప్పగించనున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలతో ప్రజల్లోకి..

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పేరిట ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తుండగా రాబోయే రోజుల్లో మరింత ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గాలకే పరిమితమై ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు నిర్దేశిత వ్యవధిలోగా పూర్తయ్యేలా చూసుకోవాలని సూచించారు. మరోవైపు మంత్రులు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని ఆదేశించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్త పర్యటనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్ స్థితిగతులను పరిశీలించి కేసీఆర్‌కు నివేదిస్తున్నట్లు తెలిసింది. అంతర్గత సమస్యలు ఉన్న చోట కేటీఆర్ దిద్దుబాటు చర్యలు ప్రారంభించినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

పనితీరు ఆధారంగానే టికెట్లు

సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్లు కేటాయిస్తామని కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించినా పనితీరు ప్రాతిపదికగానే పోటీ అవకాశం దక్కుతుందని అంతర్గతంగా సంకేతాలు అందుతున్నాయి. బహుళ నాయకత్వ సమస్య ఉన్న నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు అందుతున్న నివేదికల ఆధారంగా దిద్దుబాటు చర్యలు చేపట్టే బాధ్యతను కేటీఆర్‌కు అప్పగించారు. సంక్రాంతి తర్వాత జరిగే పార్టీ జిల్లాల సమీక్ష సమావేశాల్లో అంతర్గత విభేదాల సర్దుబాటుకు పెద్దపీట వేసే అవకాశమున్నట్లు తెలిసింది.

ఫిబ్రవరి చివరి వారంలో రాష్ట్ర బడ్జెట్

ఈనెల 31 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు జరగనుండగా రాష్ట్ర శాసనసభ సమావేశాలను వచ్చే నెల చివరి వారంలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్‌ను జాతీయస్థాయిలో విస్తరించేందుకు కసరత్తు చేస్తున్న కేసీఆర్ 2024 ఏప్రిల్‌లో జరిగే లోక్‌సభ ఎన్నికల ద్వారా అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. శాసనసభ కాలపరిమితి వచ్చే డిసెంబర్‌లో ముగియనుండగా.. అక్టోబర్ లేదా నవంబర్‌లో ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే అవకాశముంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు వీలైనంత త్వరగా జరిగితే వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు బీఆర్‌ఎస్‌ను జాతీయస్థాయిలో సన్నద్ధం చేసేందుకు తగిన సమయం దొరుకుతుందని కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జూన్‌లోగా శాసనసభకు ముందస్తు ఎన్నికలు జరిగేందుకు ఉన్న అవకాశాలపై కేసీఆర్ మదింపు చేస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర బడ్జెట్ ముగిసిన తర్వాత శాసనసభకు ముందస్తు ఎన్నికలకు వెళ్లే అంశంపై స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం.

• కాంగ్రెస్

ప్రతి గడపకూ

బ్లాక్ నుంచి బూత్ వరకు!

- గడప గడపకూ రాహుల్ సందేశం... జోడోయాత్ర స్టిక్కర్ కూడా..
- బ్లాక్‌స్థాయి సమావేశాలతో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ ప్రారంభం
- ప్రతి జిల్లా కేంద్రంలో 'కార్యకర్తల మేళా'
- రాష్ట్రస్థాయిలో 'కార్యకర్తల మహాసంగమం'...
- ప్రియాంకాగాంధీ నేతృత్వంలో మహిళల ర్యాలీ... మహిళా మేనిఫెస్టో విడుదల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు కొనసాగింపుగా ఈ నెల 26వ తేదీ నుంచి అన్ని రాష్ట్రాల్లో నిర్వహించనున్న 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలకు ఏఐసీసీ పకడ్బందీ ప్రణాళిక రూపొందించింది. ప్రతిపోలింగ్ బూత్ నుంచి గ్రామం, మండలం, బ్లాక్, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ యాత్రల నిర్వహణకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను గత నెలలోనే రూపొందించింది. ఈ మేరకు ఏఐసీసీ జారీ చేసిన సర్క్యులర్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లకు పంపింది. రాష్ట్రంలోని ప్రతి గడపకూ ఈ యాత్ర వెళ్లాల్సి ఉంటుంది. గ్రామం నుంచి రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసుకున్న వ్యవస్థల ద్వారా రెండు నెలలపాటు హాత్ సే హాత్‌జోడో యాత్రలను నిర్విరామంగా కొనసాగించాల్సి ఉంటుంది.

బ్లాక్ సమావేశాలతో మొదలు

ఈ నెల 26వ తేదీ నుంచి యాత్రలు ప్రారంభించాల్సి ఉండగా, బ్లాక్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించడం ద్వారా హాథ్ సే హాథ్‌జోడో అభియాన్ మొదలవుతుందని ఏఐసీసీ సర్క్యులర్‌లో పేర్కొంది. ఈ యాత్రలు బ్లాక్ కాంగ్రెస్ కమిటీ (బీసీసీ)ల ఆధ్వర్యంలో నిర్వహించాలని, ప్రతి బ్లాక్‌లోని ఒకరిద్దరు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించాలని వెల్లడించింది. ఈ యాత్రల సందర్భంగా దేశంలోని ప్రతిగ్రామం, ప్రతి పోలింగ్ బూత్ స్థాయికి వెళ్లాలని సూచించింది. యాత్రల ప్రారంభ సమయానికి గ్రామ, మండలస్థాయి కమిటీల ఏర్పాటును పూర్తిచేయాలని, రాష్ట్ర ముఖ్య నాయకులను జిల్లా పరిశీలకులుగా, జిల్లానేతలను బ్లాక్ పరిశీలకులుగా, పార్టీ అనుబంధ సంఘాల నేతలను సమన్వయకర్తలుగా నియమించుకుని పనిచేయాలని, ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి ఈ యాత్రలు విజయవంతమయ్యేలా కృషి చేయాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్ర ముఖ్యాంశాలివే..

- హాథ్ సే హాథ్ జోడో యాత్రలు జనవరి 26 నుంచి రెండు నెలలపాటు జరుగుతాయి. ప్రతి బ్లాక్‌లో నెలరోజులు కార్యక్రమం జరుగుతుంది. ఈ నెల రోజుల్లో ఆ బ్లాక్‌లోని ప్రతి గ్రామం, పోలింగ్ బూత్ వరకు యాత్ర వెళ్లాలి.
- ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ ద్వారా పాదయాత్రలు ప్రారంభమవుతాయి. ప్రతి గ్రామంలో ఒక సమావేశం నిర్వహించాలి.
- యాత్ర ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రతి గడపకూ పంపిణీ చేయాలి. ప్రతి గడపపై భారత్ జోడో యాత్ర స్టిక్కర్ అంటించాలి. ప్రతి గ్రామంలో భారత్ జోడో యాత్రలో జరిగిన ఉద్వేగభరిత సన్నివేశాలను వీడియో ద్వారా ప్రదర్శించాలి. ప్రతి బ్లాక్‌లో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించాలి. ప్రతి గడపకూ మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూపొందించిన చార్జిషీట్‌ను కూడా పంపిణీ చేయాలి.
- బ్లాక్ స్థాయిలో యాత్రలు పూర్తయిన తర్వాత ప్రతి జిల్లాకేంద్రంలో 'కార్యకర్తల మేళా' పేరుతో జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలి. సమావేశానికి పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు హాజరు కావాలి.
- జిల్లా సమావేశాల అనంతరం రాష్ట్ర స్థాయిలో 'కార్యకర్తల మహాసంగమం' నిర్వహించాలి. ఈ సందర్భంగా మహార్యాలీ ఏర్పాటు చేయాలి. ర్యాలీకి ఏఐసీసీ అధ్యక్షుడు లేదా మాజీ అధ్యక్షులతోపాటు జాతీయస్థాయి ముఖ్యనేతలు హాజరవుతారు.
- భారత్ జోడో మేళా పేరుతో యువతను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రస్థాయిలో కార్యక్రమం నిర్వహించాలి.
- ప్రతి రాష్ట్ర రాజధానిలో మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించాలి. ర్యాలీకి ఏఐసీసీ నేత ప్రియాంకాగాంధీ హాజరవుతారు. ఈ సందర్భంగా మహిళల మేనిఫెస్టోను విడుదల చేయాలి.
- ఈ కార్యక్రమాలన్నింటికీ ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలి.

రేపు బీసీ యువజనుల పోరుయాత్ర ముగింపు సభ

సాక్షి, హైదరాబాద్: విద్య పేరుతో కార్పొరేట్ సంస్థలు చేస్తున్న దోపిడీని అరికట్టాలన్న ప్రధాన లక్ష్యంతో తలపెట్టిన బీసీ యువజనుల పోరుయాత్ర ఈనెల 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ముగియనుంది. ఈ సందర్భంగా యాత్ర ముగింపు సభను ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి బీసీ సంఘ ప్రతినిధులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆరుగురికి గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: సచివాలయంలో పనిచేస్తున్న ఆరుగురు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు పదోన్నతి కల్పిస్తూ తాత్కాలిక ప్రాతిపదికన గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టుల్లో వీరిని నియమించనున్నారు. గ్రేడ్-2 మునిసిపల్ కమిషనర్లుగా తాత్కాలిక పదోన్నతి పొందిన సహాయ సెక్షన్ అధికారులు.. ఉత్తర్వులు అందిన 15 రోజుల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు ఎం.ఆర్.రాజశేఖర్, ఎం.ఉమా మహేశ్వర్ రావు, పి.చక్రపాణి, ఎ.రాజు, కె.ఆదిశేషు, జి.శ్రీనివాస్‌లకు ఈ పదోన్నతి లభించింది.

• బీజేపీ

..పటిష్టానికి

నేడు బీజేపీ అసెంబ్లీ సమ్మేళనాలు

- తొలిసారిగా 119 సీట్లలో ఒకేసారి నిర్వహణ
- వర్చువల్‌గా ప్రసంగించనున్న జేపీ నడ్డా..
- క్షేత్రస్థాయి నుంచి పార్టీ యంత్రాంగం డిజిటలైజేషన్, సరళ్ యాప్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: వచ్చే శాసనసభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా 'అసెంబ్లీ సమ్మేళనాల' నిర్వహణకు బీజేపీ సిద్ధమైంది. శనివారం పార్టీ ఆధ్వర్యంలో తొలిసారిగా 119 నియోజకవర్గ కేంద్రాల్లో ఒకేసారి నిర్వహిస్తున్న ఈ సమ్మేళనాలను ఉద్దేశించి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. ఫోర్ జీ సిగ్నల్స్ సమస్య, లైవ్ స్ట్రీమింగ్‌కు అవకాశం లేని చోట్ల (ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలు వంటి చోట్ల) నడ్డా రికార్డెడ్ ప్రసంగాన్ని ప్రదర్శించనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడంతోపాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేలా 'డిజిటలైజేషన్'కు నాంది పలకనున్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బూత్‌స్థాయి కమిటీల (గరిష్టంగా 22 మందితో)ఏర్పాటుతోపాటు ఎన్నికల అవసరాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'సరళ్' (సంఘటన్ రిపోర్టింగ్ అండ్ అనాలిసిస్) మొబైల్‌యాప్‌ను నడ్డా ఆవిష్కరించనున్నారు. అలాగే, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై ఎలా సమాయత్తం కావాలనే దానిపై నడ్డా దిశానిర్దేశం చేస్తారు. బూత్ కమిటీ సభ్యులు, మండల, ఇతర కమిటీలు, కిందిస్థాయి కార్యకర్తలకు ఈ యాప్‌పై అవగాహన కల్పిస్తారు.

నేటి కార్యక్రమం షెడ్యూల్

ఉదయం 10-11 గంటల దాకా... ప్రతినిధుల రిజిస్ట్రేషన్

11:00-12.15 గంటల వరకు... కార్యక్రమం ప్రారంభం, సరళ్ యాప్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

మధ్యాహ్నం 12:15-1:00 దాకా... మిస్డ్‌కాల్ (మొబైల్‌నం. 6359119119)తో నమోదు, క్యూఆర్ కోడ్‌తో సరళ్‌యాప్ డౌన్‌లోడ్ చేసే విధానం

1:00-1.15 దాకా... కేసీఆర్ సర్కార్ వైఫల్యాలపై నేతల ప్రసంగాలు

1.15-2:00 దాకా ... యాప్ ఆవిష్కరణ, జేపీ నడ్డా ప్రసంగం

గుజరాత్, ఎంపీ, బెంగాల్‌లలో మంచి ఫలితాలు: గుజరాత్ ఎన్నికల్లో సరళ్ యాప్‌ను బూత్ కమిటీలు మొదటిసారిగా ఉపయోగించి మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో దానిని తెలంగాణలోనూ పూర్తిస్థాయిలో ఉపయోగించాలని జాతీయనాయకత్వం నిర్ణయించింది. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ స్థానికసంస్థల ఎన్నికల్లోనూ ఈ యాప్ పార్టీ కార్యకర్తలకు బాసటగా నిలిచిందని పార్టీనేతలు చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియను ఉపయోగించుకోవాలని రాష్ట్రపార్టీని నాయకత్వం ఆదేశించింది. దీంతోపాటు అధినాయకత్వం నుంచి వచ్చే ఆదేశాలు నేరుగా క్షేత్రస్థాయికి చేరవేయడంతోపాటు వాటిని తుచ తప్పకుండా అమలు చేసేందుకు సరళ్ యాప్ పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందని అంచనావేస్తున్నారు.

అన్ని విషయాల్లో చేదోడువాదోడుగా...


కిందిస్థాయి నుంచి సంస్థాగతంగా పార్టీ పటిష్టానికి, కార్యక్రమాల నిర్వహణకు, రాజకీయ లక్ష్యాల సాధనకు ఇది ఉపయోగపడుతుందని నాయకత్వం బలంగా నమ్ముతోంది. అంతేకాకుండా మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో పేదలకు అందుతున్న ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించేందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు. దీంతోపాటు 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడంపై, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను ఎండగట్టేందుకు డిజిటలైజేషన్ ప్రక్రియ ఉపయోగపడుతుందని నమ్ముతున్నారు.

కృష్ణా బోర్డు సమావేశం వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈనెల 11న జరగాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశాన్ని వాయిదా వేసినట్లు బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే శుక్రవారం ఏపీ, తెలంగాణలకు లేఖ రాశారు. సమావేశం కొత్త తేదీని ఖరారు చేసి తెలియజేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు

- ఆ మేరకు పెంచేలా చర్యలు
- ప్రభుత్వ ఆసుపత్రుల ప్రసవాల్లో సంగారెడ్డి టాప్
- అక్కడ అత్యధికంగా 86 శాతం డెలివరీలు
- జగిత్యాల, కరీంనగర్, సూర్యాపేటల్లో ప్రైవేటు డెలివరీలు ఎక్కువ
- నల్లగొండ, రంగారెడ్డిలో ప్రైవేటులో ఎక్కువగా సి-సెక్షన్లు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచడంలో కేసీఆర్ కిట్, అమ్మ ఒడి సహా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు కేవలం 30 శాతం ఉంటే ఇప్పుడు 66 శాతానికి పెరిగాయి. డిసెంబర్ నెలలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన ప్రసవాల్లో సంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఆ జిల్లాలో అత్యధికంగా 86 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగాయి. సబ్ సెంటర్ల వారీగా చూస్తే జగిత్యాల, కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లో అత్యధికంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. వీటిపై డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు క్షేత్రస్థాయి పర్యటన చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీచేసింది. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువగా సి- సెక్షన్లు జరుగుతున్నాయి. అనవసర సి సెక్షన్లు తగ్గించేందుకు అధికారులు కృషి చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మూడు నెలల ఓపీ పరిశీలిస్తే, రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఓపీ నమోదు చేస్తున్న నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, కొమురంభీం, జనగాం జిల్లాల్లో పరిస్థితులు మారాలన్నారు. కేసీఆర్ కిట్ లో భాగంగా ప్రతి గర్భిణికి నాలుగు ఏఎన్సీ చెకప్స్ క్రమం తప్పకుండా చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో టిఫా స్కానింగ్ సౌకర్యం తీసుకు వచ్చామని, సేవలు గర్భిణులకు అందేలా చూడాలన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎం, మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో, డీఎంహెచ్‌వోలతో నెలవారీ సమీక్ష నిర్వహించారు.

18 నుంచి కంటి వెలుగు...

ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్న కంటి వెలుగు రెండో దఫా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆశ, ఏఎన్ఎంలను హరీశ్ రావు ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమీక్షలో కుటుంబ, ఆరోగ్య సంక్షేమ కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్ రెడ్డి, ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్రాంతికి 4,233 ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, హైదరాబాద్: సంక్రాంతికి టీఎస్ఆర్టీసీ 4,233 ప్రత్యేక బస్సులను నడుపుతోందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. జేబీఎస్ నుంచి 1184, ఎల్బీనగర్ నుంచి 1133, అరాంఘర్ నుంచి 814, ఉప్పల్ నుంచి 683, కేపీహెచ్‌బీ/బీహెచ్ఈఎల్ నుంచి 419 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని తెలిపారు. పండగ రద్దీ దృష్ట్యా నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని, స్పెషల్ చార్జీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 10 నుంచి 14 వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో పోలీస్, రవాణా శాఖ అధికారులు ఆర్టీసీకి సహకరించాలని కోరారు. సొంత వాహనాల్లో ఇతర ప్రయాణికులను తరలించే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. బస్ భవన్‌లో పోలీసు, రవాణా శాఖ అధికారులతో శుక్రవారం సజ్జనార్ సమన్వయ సమావేశం నిర్వహించారు. సంక్రాంతి ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి టీఎస్ఆర్టీసీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. నిజామాబాద్, కరీంనగర్, మెదక్ వెళ్లే బస్సులు జేబీఎస్ నుంచి, ఖమ్మం, నల్లగొండ, విజయవాడ వైపు వెళ్లే బస్సులు ఎల్బీనగర్ నుంచి, మహబూబ్‌నగర్, కర్నూలు వైపు వెళ్లే బస్సులు అరాంఘర్ నుంచి, వరంగల్, హనుమకొండ, తొర్రూర్ వైపు వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి, సత్తుపల్లి, భద్రాచలం, విజయవాడ వైపు వెళ్లే బస్సులు కేపీహెచ్‌బీ/బీహెచ్ఈఎల్ నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు.

585 బస్సులకు ముందస్తు రిజర్వేషన్

ఈ సంక్రాంతికి 585 బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించామని సజ్జనార్ తెలిపారు. www.tsrtconline.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. పండగకు సొంతూళ్లకు వెళ్లే జనం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించటం ద్వారా భద్రంగా గమ్యం చేరేందుకు వీలుంటుందన్నారు. రోడ్లపై రద్దీ అధికంగా ఉండే సమయం అయినందున, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాదన్నారు. ఈ విషయాన్ని అధికారులు, సిబ్బంది ప్రజలకు తెలపాలని కోరారు. సమావేశానికి హాజరైన హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీలు ప్రకాశ్‌రెడ్డి, కరుణాకర్, టి.శ్రీనివాస రావు, డి.శ్రీనివాస్‌లతో పాటు రవాణా శాఖ రంగారెడ్డి డీటీసీ ప్రవీణ్ రావు, ఆర్టీవోలు శ్రీనివాస్‌రెడ్డి, రామచందర్‌లను ఆయన సన్మానించారు.

రజోగుణము వల్ల ఇంద్రియ నిగ్రహము లేకుండుట; తమోగుణము వల్ల బుద్ధిమాంద్యము కలుగుచున్నవి. సత్త్వగుణము వృద్ధిలో నుండగా ఉత్తమ జ్ఞానులు పొందెడు నిర్మలమైన లోకములను పొందుచున్నాడు.

– హైందవ ధర్మం

సాక్షి

శనివారం, జనవరి, 7

‘సర్వోన్నత’ వ్యాఖ్యలు

సంక్లిష్ట సమస్యలెదురైనప్పుడు యాంత్రికంగా వ్యవహరించటంకాక మనసుపెట్టి ఆలోచించి నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం కూడా ఉన్నప్పుడే ఏ వ్యవస్థయినా అందరిచేతా ప్రశంసలందుకుంటుంది. ఇతర వ్యవస్థల మాటెలావున్నా నిత్యం ప్రభుత్వాల నిర్ణయాల్లో, పౌరుల వ్యవహార శైలిలో తప్పొప్పులనెంచే పనిలో నిమగ్నమైవుండే న్యాయవ్యవస్థకు ఈ గుణం మరింత అవసరం. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ నగరంలో రైల్వే శాఖ అధీనంలోనిదని చెబుతున్న 29 ఎకరాల భూమిలో ఆక్రమణదారులను వెంటనే తొలగించాలంటూ గత డిసెంబర్‌లో అక్కడి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తాజాగా సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలను ఈ కోణంలో చూడాలి. సమస్య అన్నిచోట్లా ఉంటున్నదే. పేద, ధనిక తేడా లేకుండా అందరూ చేస్తున్నదే. పట్టణ, నగర ప్రాంతాల్లోని విలువైన భూములు అన్యాక్రాంతం కావడం దశాబ్దాలుగా కనబడుతున్నదే. పల్లెల్లో జరుగుబాటు నానాటికీ కష్టమై ఏదో ఒక పని దొరక్కపోతుందా అన్న ఆశతో నిత్యం వేలాదిమంది సమీపంలోని పట్టణాలకూ, నగరాలకూ లేదా సుదూరతీరాల్లోని నగరాలకూ వలసపోతుంటారు. ఇలా వెళ్తున్నవారు ఆయా ప్రాంతాల్లో తలదాచుకుందుకు అనివార్యంగా కొద్దిపాటి జాగా వెతుక్కోక తప్పదు. సరిగ్గా ఇక్కడే స్థానిక పెత్తందార్లు, మాఫియా ముఠాల వ్యక్తులు రంగప్రవేశం చేస్తారు. తమను ఆశ్రయించిన దిక్కూ మొక్కూలేని జనం నుంచి ఎంతో కొంత లాక్కొని వృథాగా పడుండే సర్కారీ భూముల్లో లేదా స్థానిక సంస్థల భూముల్లో గుడిసెలు వేసుకొనేందుకు ‘అనుమతిస్తారు’. నగరాల్లోని ఏ మురికివాడల చరిత్ర చూసినా ఇంతే. సంపన్న వర్గాలది వేరే కథ. నగరంలో చాలా ముఖ్యమైన ప్రాంతంగా పేరుబడినచోట ఉండే మురికివాడపైనో లేదా అంతవరకూ ఎవరి దృష్టీ పడని సర్కారీ భూమిపైనో కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి వాటి ఆధారంగా ఆక్రమణలకు పూనుకుంటారు. వాటిని చట్టబద్ధం చేసుకునేందుకు ప్రయత్నిస్తారు. అందుకోసం రాజకీయ పార్టీల్లో చేరి కాలక్రమంలో బడా నేతలుగా ఎదుగుతారు. బాధాకరమైన విషయమేమంటే ఆక్రమణదారులందరినీ వ్యవస్థలు ఒకేలా చూడవు. సమ న్యాయం పాటించవు. ఇతర వ్యవస్థల మాట అటుంచి న్యాయస్థానాలు సైతం ఇటీవల ఇలాంటి ధోరణినే ప్రదర్శిస్తుండటం ఆందోళనకరమైన పరిణామం. నిరుపేదలను వెళ్లగొట్టడంలో అత్యుత్సాహం చూపే వ్యవస్థలే ఆక్రమణదారులైన బడా నేతల విషయంలో ఎక్కడలేని ఉదారతనూ ఒలక బోస్తున్నాయి.

ఉత్తరాఖండ్ హైకోర్టు నిరుడు డిసెంబర్‌లో ఇచ్చిన తీర్పు పూర్వాపరాలు పరిశీలిస్తే న్యాయస్థానాల తీరుతెన్నులెలా ఉంటున్నాయో అర్థమవుతుంది. వివాదంలో ఉన్న 29 ఎకరాల భూమి 2 కిలోమీటర్ల నిడివిన ఉంది. ఈ కాలనీకి గఫూర్ బస్తీ అని పేరు. అందులో ‘ఆక్రమణదారుల’ ఆవాసాలు మాత్రమే కాదు... నాలుగు ప్రభుత్వ పాఠశాలలు, మంచినీటి ట్యాంకులు, మసీదులు, ఆలయాలు, దుకాణాలు ఉన్నాయి. ఈ బస్తీలోని 4,500కుపైగా ఆవాసాల్లో మొత్తంగా 50,000 మంది వరకూ నివసిస్తున్నారు. వీరందరినీ ‘తక్షణం’ ఖాళీ చేయించాలనీ, ఇందుకోసం పారా మిలిటరీ దళాలను కూడా వినియోగించవచ్చనీ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ స్థలానికి సమీపంలోని నదిలో అక్రమంగా ఇసుక తవ్వుకుపోతున్నారని 2013లో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పరిధిని హైకోర్టు తనకు తానుగా విస్తృతపరిచి, ఈ ఆక్రమణల సంగతి కూడా తేలుస్తామని ప్రకటించింది. ఆక్రమణలను క్రమబద్ధీకరించి తీరాలని ఎవరూ డిమాండ్ చేయరు. నిజానికి ఇదే ఉత్తరాఖండ్‌లో పర్యావరణానికి ముప్పు కలిగించేలా బడా పారిశ్రామికవేత్తలు అడవులకూ, నదులకూ ప్రమాదం తెచ్చిపెడుతున్నారు. వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలకు సమీపంలో కాంక్రీట్ నిర్మాణాలు, విశాలమైన రహదారులు వెలుస్తున్నాయి. ఆఖరికి ఉత్తరాఖండ్ సర్కారు అక్కడున్న ఏకైక శివాలిక్ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని సైతం 2020లో డీనోటిఫై చేసింది. డెహ్రాడూన్, హరిద్వార్, హల్ద్వానీ, తనక్‌పూర్, రాంనగర్ డివిజన్లను ఒరుసుకుని ఉన్న ఈ కేంద్రాన్ని డీనోటిఫై చేసిన తీరును కేంద్ర పర్యావరణ శాఖ కూడా తప్పుబట్టింది. ఇక చట్టవిరుద్ధంగా భారీ యంత్రాల సాయంతో సాగే ఇసుక తవ్వకాలవల్ల వంతెనలు కూలిన సందర్భాలు కూడా లేకపోలేదు. 2013లో అలా వంతెన కూలిన ఉదంతం తర్వాతే ఈ పిల్ దాఖలైంది. హిమానీ నదాలు పారే రాష్ట్రంలో ఇతరేతర పర్యావరణ ఉల్లంఘనలను పట్టించుకోని వ్యవస్థలు నిరుపేదల కాలనీపై విరుచుకు పడాలనుకోవటం ఎలాంటి న్యాయం? గఫూర్ కాలనీవాసుల్లో అత్యధికులు ముస్లింలు గనుకే వారిని వెళ్లగొట్టాలని బీజేపీ సర్కారు కుట్రలు పన్నుతున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో హైకోర్టు ధర్మాసనం కాస్తయినా సున్నితంగా ఆలోచించొద్దా?

హల్ద్వానీలో తలెత్తిన వివాదం 1907 నాటి ప్రభుత్వ రికార్డుల చుట్టూ తిరుగుతోంది. తమ పూర్వీకులు అయిదు దశాబ్దాలక్రితం ప్రభుత్వ వేలంలో సొంతం చేసుకున్నారని కొందరు దాఖలాలు చూపారు. మరికొందరు వేరేవారినుంచి కొన్నట్టు పత్రాలు దాఖలాలు చేశారు. ఇవన్నీ నిజం కాదని న్యాయస్థానాలు భావించినా ఖాళీ చేయించేముందు వారికి ప్రత్యామ్నాయం చూపాలన్న కనీస స్పృహ ఉండాలి. ఆ ప్రత్యామ్నాయం ఆచరణాత్మకంగా ఉండాలి. అన్నీ వదిలి వ్యవస్థలు బుల్‌డోజర్ న్యాయానికే మొగ్గితే పౌరులు ఎవరికి మొరపెట్టుకోవాలి? ఈ పరిస్థితుల్లో సర్వోన్నత న్యాయస్థానం చేసిన సూచనలు విలువైనవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలన్నీ పట్టించుకోవాల్సినవి.

మహిళలు రోడ్డెక్కాలంటే... భయం!

విశ్లేషణ



కల్పనా విశ్వనాథ్

జనవరి 1 తొలి క్షణాల్లోనే దేశ రాజధానిలో ఒక యువతిని కారుతో ఢీకొట్టి కిలోమీటర్ల దూరం లాక్కుపోయిన ఘటన 2023 సంవత్సరానికి భయానకమైన ప్రారంభాన్ని ఇచ్చింది. రహదారి భద్రత భారతదేశంలో అతిపెద్ద సమస్య. రోడ్డుపై సంభవిస్తున్న మరణాల్లో దాదాపు 90 శాతం అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకరమైన డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు డేటా ప్రకారం, రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 20 అగ్రశ్రేణి దేశాల్లో ఇండియా తొలి స్థానంలో ఉంది. వీటికి అదనంగా చీకటిపడ్డాక బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు లైంగిక దాడి భయం మహిళలను వెంటాడుతుంటుంది. మహిళల కదలికలను హింస, భయం అడ్డుకుంటున్నాయి. వీటికి పేలవమైన ప్రజా రవాణా సేవలు తోడవుతున్నాయి.

జనవరి 1న ఐదుగురు పురుషులు ఉన్న కారు ఒక యువతి బైక్‌ని ఢీకొట్టి పలు కిలోమీటర్ల దూరం ఆమెను లాక్కునిపోయిన ఘోరమైన ఉదంతం, 2023 సంవత్సరానికి భయానకమైన ప్రారంభాన్ని ఇచ్చింది. ఈ ఘటనలో ప్రమాదకరమైన అనేక అంశాలు దాగి ఉన్నాయి. మొదటగా, వారు ఒక అమ్మాయిని తమ కారుతో 4 కిలోమీటర్ల దూరం లాక్కెళ్లి పోతున్నామనే స్పృహ కూడా లేనంత పూటుగా తాగి ఉన్నట్లు వార్తలొచ్చాయి. లేదా వారు స్పృహలో ఉండి ఉండవచ్చు కూడా. రెండు: ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న యువతిని కారుతో ఢీకొట్టిన డ్రైవర్ ఆమెకు సహాయం చేయాలని కూడా భావించలేదు. బదులుగా, అతడు చాలా వేగంగా కారు తోలాడు. ఒక వార్త ప్రకారం, కారులో ఉన్న వారు ఆ తర్వాత కారు ఆపి యువతి శరీరాన్ని కారు కిందనుంచి తొలగించి పారిపోయారు. ఈ విషయంలో వారు ఎలాంటి విచక్షణ, స్పందన లేకుండా వ్యవహరించారు. ఒక చావుకు కారణమయ్యామనే ఆలోచన కూడా వారికి లేదు. ఒక వ్యక్తిని కాపాడటం కంటే తమను తాము కాపాడుకోవడం గురించే వారు ఆందోళన చెందారు. అందుకే రోడ్డుమీదే ఆమెను చనిపోయేలా చేసి వెళ్లిపోయారు.

దారినపోతున్న వారు పోలీసులకు ఆమె గురించి సమాచారం ఇచ్చారు. వీధిలోని సీసీటీవీ కెమెరా ద్వారా కారును గుర్తించారు. పైగా, ఆ మహిళ రోడ్డుమీద వివస్త్రగా పడి ఉన్నందున, ఆమెపై లైంగిక దాడి జరిగి ఉంటుందేమో అనే కోణంలో కూడా విచారణ జరుగుతోంది.

ఆ యువతికి 20 సంవత్సరాలుంటాయి. తన పని ముగించుకుని ఆమె ఇంటికి వెళుతోంది. ఆమెకు ఎదురైన భయానకమైన మరణాన్ని, తద్వారా ఆమె తల్లి, ఇతర కుటుంబ సభ్యుల దుఃస్థితిని తల్చుకోవాలంటే కూడా హృదయం బద్దలవుతోంది. రహదారి భద్రత భారతదేశంలో అతిపెద్ద సమస్య. దుర్బలమైనవారు మరింత ప్రమాదాన్ని ఎదుర్కొంటారు. రోడ్డు పక్కన కూర్చుని లేదా నిద్రపోతున్నవారిని వేగంగా పోతున్న కార్లు ఢీకొని ప్రమాదాలకు గురిచేస్తున్న అనేక ఉదంతాలు ఉన్నాయి. కేవలం 2021లోనే



1.5 లక్షల మంది ఈ రోడ్డు ప్రమాదాల కారణంగా చనిపోయారు. కొన్నేళ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. నేషనల్ క్రైమ్స్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం, వీటిల్లో 1.9 శాతం మద్యం, మత్తు పదార్థాల ప్రభావంలో జరిగినవి. రోడ్డుపై సంభవిస్తున్న మరణాల్లో దాదాపు 90 శాతం అతివేగం, ఓవర్ టేకింగ్, ప్రమాదకరమైన డ్రైవింగ్ వల్లే జరుగుతున్నాయి. 2019 నుంచి ప్రపంచ బ్యాంకు డేటాను పరిశీలిస్తే, అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 20 అగ్రశ్రేణి దేశాల్లో ఇండియా తొలి స్థానంలో ఉంది.

చీకటిపడ్డాక బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణిస్తున్నప్పుడు లైంగిక దాడికి సంబంధించిన భయం కూడా మహిళలను వెంటాడుతుంటుంది. ఈ ఉదంతంలో లైంగిక దాడి రుజువు కాకున్నప్పటికీ, అలాంటి దాడి జరిగే అవకాశం ఉందన్న వాస్తవం ఈ దేశంలోని ప్రతి మహిళకూ అదనపు ఆందోళనను కలిగిస్తుంటుంది. జాతీయ మహిళా కమిషన్ ప్రత్యేకించి పేర్కొన్నట్లుగా, ఈ కోణాన్ని కూడా ఈ ఉదంతంలో పరిశీలించడం చాలా ముఖ్యం.

నగరాలు మహిళలకు అందిస్తున్న అవకాశాలు, వాటిని వారు దక్కించుకుంటున్న సామర్థ్యాలపై హింస గణనీయమైన ప్రభావం చూపుతోంది. ఐక్యరాజ్యసమితి, ‘ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ విమెన్’ పరిశోధన ప్రకారం నగరాల్లో మహిళలు అనేక రూపాల హింసకు, లైంగిక వేధింపులకు గురవుతున్నారు. పెద్దగా అరిచి భయపెట్టడం, దేహ భాగాలను గట్టిగా నొక్కడం, వెంబడించడంతోపాటు, లైంగిక దాడి వంటి తీవ్ర నేరాలు కూడా జరుగుతున్నాయి. ప్రతిరోజూ జరుగుతున్న ఈ హింస, వేధింపులు నగరంలోని బహిరంగ ప్రదేశాల్లో మహిళల అనుభవాలను నిర్దేశిస్తున్నాయి. నగరాల్లో మహిళల కదలికలను హింస, భయం అడ్డుకుంటున్నాయి. వీటికి పేలవమైన ప్రజా రవాణా సేవలు తోడవుతున్నాయి. పనిచేయడం, తిరిగి రావడం విషయంలో కీలక వేళల్లో రవాణా ప్రణాళికలు సాధారణంగా పురుషుల ప్రయాణ నమూనాలపైనే దృష్టి పెడుతున్నాయి. మరోవైపు మహిళల ప్రయాణ నమూనాలు వారి సంరక్షక పాత్రల దృష్ట్యా పురుషులతో పోలిస్తే తరచుగా విభిన్నంగా ఉంటున్నాయని మహిళల కదలికలపై ప్రపంచ బ్యాంక్ నివేదిక చెబుతోంది.

మహిళల ప్రయాణాల్లో 84 శాతం వరకు ప్రజా రవాణా ద్వారానే జరుగుతున్నాయని ఇదే నివేదిక తెలుపుతోంది. పనికి నడిచిపోవడాన్నే మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో మహిళల వాటా 45.4 శాతంగా ఉండగా, పురుషుల శాతం 27.4గా మాత్రమే ఉంటోంది. పైగా చాలామంది మహిళలు బస్సు ద్వారా ప్రయాణిస్తున్నారు. తాము ప్రయాణిస్తున్నప్పుడు మహిళలు స్థోమతను చూసుకుంటారని ఈ నివేదిక చెబుతోంది. ఖర్చు ఎక్కువయ్యే వేగ ప్రయాణాల కంటే ఖర్చు తక్కువగా ఉండే నిదాన ప్రయాణ సాధనాలనే వీరు ఎంపిక చేసుకుంటున్నారు. రోడ్డు ప్రమాద బాధితుల్లో అధిక శాతం పురుషులేనని నివేదిక చెబుతోంది. అంటే మహిళలతో పోలిస్తే పురుషులు చాలా ఎక్కువగా బయట కెళ్లడానికి ఇష్ట పడుతుంటారనీ, సొంత బైక్‌ని కలిగి ఉంటారనీ, రాత్రిపూట ప్రయాణిస్తుంటారనీ ఇది ఎత్తి చూపు తోంది. మహిళల కదలికలపై ఆంక్షలు అనేవి పితృస్వామిక ఆచారాలు, సంరక్షక భారం నుంచి ఏర్పడుతున్నాయి. పైగా శ్రామిక శక్తిలో మహిళల స్వల్ప పాత్రపై ఇవి ప్రభావం చూపుతున్నాయి.

ప్రపంచంలోకెల్లా రోడ్డు ప్రమాదాల్లో అధిక మరణాలకు సంబంధించి భారతదేశం అత్యధిక రేటును కలిగి ఉంటోంది. బహిరంగ స్థలాల్లో మహిళలపై హింసకు సంబంధించిన అత్యధిక రేటు కూడా భారత్ సొంతమై ఉంది. మన వీధులు, రహదారులు అటు ప్రమాదాలు, ఇటు నేరాల నుంచి తప్పనిసరిగా సురక్షితంగా ఉండాలి. శరవేగంగా వెళ్లే కార్ల కంటే పాదచారుల సురక్షిత కదలికలకు వీలిచ్చేలా వీధులను రూపొందించాలి. ఇదే మన నగరాలను గణనీయంగా మారుస్తుంది. కార్లు అతివేగంగా దూసుకెళ్లేలా, మరిన్ని ఫ్లై ఓవర్లకు, ఓవర్ బ్రిడ్జిలకు, పెద్దగా వెలుతురు లేని రహదారులకు దారులు తీస్తున్న మన ప్రస్తుత రహదారి ప్రణాళికలు పాదచారులు సులభంగా గాయాలకు, హింసకు లోనయ్యేలా రూపొందుతున్నాయి. రద్దీగానూ, చక్కటి వెలుతురుతోనూ ఉంటూ మంచి పేవ్‌మెంట్లు, వీధుల్లో విక్రేతలు, షాపులు, నిఘా కెమెరాలతో కూడిన కెఫేలు తాము సురక్షితంగా ఉన్నామని మహిళలు భావించడానికి ఎంతో అనుకూలంగా ఉంటాయని దేశవ్యాప్తంగా ‘సేఫ్టీపిన్’ సంస్థ ద్వారా జరిగిన భద్రతాపరమైన మదింపులు స్పష్టం చేస్తున్నాయి. అదేవిధంగా, సైక్లింగ్ కోసం మౌలిక వసతుల కల్పన, ప్రజారవాణాను అందుబాటులోనూ, చౌకగానూ ఉంచడం వల్ల వీధుల్లో ట్రాఫిక్ తగ్గుతుంది. ఈ చర్యలు మన వీధులను సురక్షితంగానూ, అందుబాటులో ఉండేలా, ఎక్కువమందికి అనుకూలంగా మలుస్తాయి.

వ్యాసకర్త లింగ, నగరీకరణ నిపుణురాలు; ‘సేఫ్టీపిన్’ సీఈఓ

(‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఇంకేం అయివుండొచ్చు?



ఇజ్రాయిల్‌లో ఒక 34 ఏళ్ల పురుషుడు తన ఐదో బూస్టర్ డోసు తీసుకున్న గంటలోనే కుప్పకూలి చనిపోయాడు (ఇంకా అప్పటికి అతడు అది వేసిన క్లినిక్‌లోనే ఉన్నాడు). ఆరోగ్య అధికారుల స్పందన: “దీనికీ టీకాకూ సంబంధం ఉందో లేదో తెలియదు.”

– ఎలి డేవిడ్, పరిశోధకుడు

వేరే మార్గాలున్నాయి



మీకు ఒక సినిమా నచ్చితే చూడండి. నచ్చకపోయినా లేదా ఆ సినిమా నిర్మాతలతో ఒప్పుదల లేకపోయినా చూడొద్దు. వాళ్లకు తగిలే చోట మీ స్పందన తెలియజేయండి. అది బాక్సాఫీస్ దగ్గర. అంతేగానీ హింస, పద్ధతిగా లేని ప్రవర్తన, బల ప్రదర్శన ఏ ఉద్దేశమూ నెరవేర్చవు.

– ఆనంద్ నరసింహన్, జర్నలిస్ట్

మర్యాద నేర్పాలి



భారతీయుల ప్రవర్తన ఘోరంగా ఉంటోంది. బహిరంగ వర్తన, సభ్యత గురించి పాఠశాల కోర్సులుండాలి. మన దురదృష్టం ఏమిటంటే, అతిదారుణమైన ప్రవర్తనకు ఉదాహరణగా నిలిచే రాజకీయ నాయకులు ఉన్నారు. నలుగురిలో ఎలా నడుచుకోవాలి, మర్యాద, ఇతరులను పట్టించుకోవడం లాంటి అంశాలను చిన్నప్పటినుంచే నేర్పాలి. (‘ఎయిర్ ఇండియా’ ఉదంతం నేపథ్యంలో)

– సాగరికా ఘోష్, జర్నలిస్ట్

ఆక్రమణలను అంగీకరించొద్దు



ఏ రూపంలోని అక్రమ ఆక్రమణల విషయంలోనైనా ప్రభుత్వం ఉక్కుపాదంతో వ్యవహరించాలి. అక్రమాలను ప్రోత్సహించడం అనేది రాజ్యానికి హితం కాదు.

– అభిషేక్ సింఘ్వీ, కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి

ఇలా కూడా ఉంటాం



“మిమ్మల్ని చూస్తే మీరు రాజస్థాన్ వాళ్లలా అనిపించడం లేదు.” “ఏం చేయను? నా ఒంటెకు ఒంట్లో బాగోక, నేను కారులో రావాల్సి వచ్చింది. అందుకని నా ముఖంమీద ఇసుక పడిన జాడలు లేవు.”

– ప్రాచీ భరద్వాజ్, న్యాయవాది

చరిత్ర రచనకు సోపానం

భారతదేశంలో రాష్ట్ర స్థాయిలో హిస్టరీ కాంగ్రెస్ లేని రోజుల్లోనే ‘ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్’ను స్థాపించడంలో ప్రధాన భూమిక పోషించినవారు మల్లిరెడ్డి పట్టాభి రామరెడ్డి. జనవరి 7, 8 తేదీల్లో కడప యోగి వేమన యూనివర్సిటీలో ఆ హిస్టరీ కాంగ్రెస్ తన 45వ వార్షిక సమావేశాన్ని నిర్వహించుకుంటోంది. ఈ సందర్భంగా పట్టాభి రామరెడ్డి గురించీ, ఏపీ హిస్టరీ కాంగ్రెస్ గురించీ సంక్షిప్తంగానైనా మాట్లాడుకోవలసి ఉంది.

పట్టాభి రామరెడ్డి గొప్ప మేధావి. అసాధారణ అధ్యాపకుడు. చరిత్ర పరిశోధకునిగా ఆయన తన తరువాతి తరాలకు మార్గం చూపించారు. ఆయన తొలిసారిగా బీఏ, ఎంఏ కోర్సులలోనూ, ఏపీపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షలలోనూ ఆంధ్రుల చరిత్రను సిలబస్‌లో చేర్చేలా కృషి చేశారు. తెలుగు వారి చరిత్రను లోతుగా అధ్యయనం సాగించడానికి నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతి కాలేజీలో 1976 మే నెల ఒకటి, రెండు తేదీలలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ తొలి స్థాపనా సమావేశాలను నిర్వహించారు.



మల్లిరెడ్డి పట్టాభిరామరెడ్డి

ఆయన కోరుకున్న విధంగానే ఏపీ హిస్టరీ కాంగ్రెస్... ఆదిమ యుగాల నుంచి ఇప్పటివరకూ ఉన్న తెలుగు నేల చరిత్ర, సంస్కృతులను అధ్యయనం చేసి విలువైన సంపుటాలను ప్రచురించింది. ఇవ్వాళ దేశంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ అంటే ఓ గౌరవం ఉంది. ఒక స్థాయి ఉంది.

పట్టాభి రామరెడ్డి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఎమ్మెన్ రాయ్ ప్రభావానికి లోనై సోషలిస్టు పార్టీ రాజకీయాల్లో పాల్గొన్నారు. తాను చదువుకున్న మద్రాస్ పచ్చయప్పాస్ కళాశాలలోనే అధ్యాపకుడిగా కొంతకాలం పని చేశారు. కావలి ‘జవహర్ భారతి’లో అధ్యాపకుడిగాచేరి అనేక హోదాల్లో పనిచేశారు. అలాగే శ్రీ వెంకటేశ్వరా యూనివర్సిటీలోనూ పనిచేశారు.

ఆయన నెల్లూరు చరిత్రపైనా, మొత్తంగా తెలుగువారి చరిత్రపైనా ఎన్నో గ్రంథాలు రాశారు. ఇంతటి ప్రతిభాశాలి 2004 మార్చి 30న తుదిశ్వాస విడిచారు. ఆయన కలల పంట ఏపీ హిస్టరీ కాంగ్రెస్ మాత్రం తెలుగువారి సేవలో తరిస్తోంది.

– ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
రిటైర్డ్ చరిత్ర ఆచార్యులు, ఎస్వీ యూనివర్సిటీ

బంగారు బాల్యంలో నేర ప్రవృత్తి

అభిప్రాయం



తడకమళ్ళ మురళీధర్

18 ఏళ్ల వయస్సు నిండని నేరం ఆరోపింపబడ్డ ప్రతి బాలుడు, బాలిక 2015 నాటి ‘బాల నేరస్థుల పరిరక్షణ చట్టం’ ప్రకారం జువెనైల్ జస్టిస్ బోర్డు (జేజే బోర్డు) ముందు విచారణ ఎదుర్కోవలసి ఉంటుంది. నేరం చేసిన తేదీ నాటి వయస్సు ప్రామాణికం అవుతుంది. అధికారిక జనన ధ్రువీకరణ పత్రం అందుబాటులో లేనట్లయితే మెడికల్ బోర్డుచే ధ్రువీకరింపబడ్డ వయస్సు ఆధారంగా కోర్టు విచారణ పరిధి నిర్ణయమవుతుంది. అరెస్టు చేసిన రోజు నుండి తుది తీర్పు దాకా జేజే బోర్డు విచారిస్తుంది. ఈ బోర్డులో మొదటి శ్రేణి జ్యుడీషియల్ న్యాయాధికారి, రాష్ట్ర ప్రభుత్వం చేత నియమింపబడే ఇరువురు సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉంటారు. ఇరువురిలో ఒకరు మహిళ, మరొకరు చైల్డ్ సైకాలజిస్ట్ ఉంటారు.

బెయిలుపై విడుదలయ్యేంత వరకు లేదా తుది తీర్పు దాకా నిందితులను ప్రభుత్వ సంక్షేమ అధికారుల పర్యవేక్షణలోని అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచుతారు. నేరం రుజువయితే నిందితులకు కారాగార శిక్ష బదులుగా జేజే బోర్డు సభ్యులు మందలించి విడుదల చేయటం లేదా మూడు సంవత్సరాలు మించకుండా సంస్కరణ గృహానికి పంపించటం లేదా విడుదల చేసి కొన్నాళ్ల పాటు మంచి ప్రవర్తనకై జిల్లా ప్రొబేషనరీ అధికారి పర్యవేక్షణలో ఉంచటం లేదా సామాజిక సేవ చేసే ఉత్తర్వులు లేదా జరిమానా చెల్లింపుకు ఆదేశాలివ్వటం జరుగుతుంది. ఇందుకై జిల్లా ప్రొబేషనరీ అధికారి ఇచ్చే సామాజిక దర్యాప్తు నివేదికను పరిగణనలోకి తీసుకుంటారు. ఇరువురు సభ్యుల తీర్పులో ఏకాభిప్రాయం రానట్లయితే జ్యుడీషియల్ అధికారి తీర్పు చలామణి అవుతుంది. నేరం రుజువు కాలేదని జేజే బోర్డు తీర్పిస్తే దానిపై అప్పీలు లేదు. 16 ఏళ్లు పైబడిన నిందితుల కేసుల్లో లేదా అతి హేయమైన నేరం చేసిన కేసుల్లో మాత్రమే అప్పీలు ఉంటుంది.



విచారణ ప్రక్రియ మధ్యలో నిందితులు 18 ఏళ్ల వయస్సు దాటినా, జేజే బోర్డు మాత్రమే కేసు కొనసాగిస్తుంది. నేరం రుజువై ప్రభుత్వ సంస్కరణ గృహానికి పంపబడిన వారిని మంచి పౌరులుగా పరివర్తన తేవటానికి వృత్తి విద్య, కౌన్సెలింగ్ లాంటివి చేపడతారు. హత్య, మానభంగం, లైంగిక అత్యాచారం లాంటి అతి హేయమైన నేరం గురించి 16–18 ఏళ్ల వయసున్న నిందితుడు మానసికంగా, భౌతికంగా తను చేస్తున్న నేరం పరిణామాల గురించి అర్థం చేసుకునే పరిపక్వత ఉండీ నేరం చేసినాడని జేజే బోర్డు ప్రాథమిక అంచనాకు వస్తే ఆ కేసును బాలల కోర్టుకు నిందితుడిని పెద్ద వాడిగా భావించి ఇతర కేసుల్లాగే విచారణ జరిపే నిమిత్తం బదిలీ చేసే విచక్షణాధికారం ఉంది.

ఇదిలా ఉండగా 16–18 ఏళ్ల వయసున్న నిందితులు చేసిన అతి హేయమైన నేరంపై జేజే బోర్డు ఒక నిర్ధాయిక ప్రాథమిక అంచనాకు రావడానికి మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా ‘బరున్ చంద్ర ఠాకూర్ వర్సెస్ మాస్టర్ భోలు’ అనే కేసు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం 2022 జూలై 13న ఉత్తర్వులు జారీ చేసింది. వాటికి అనుగుణంగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ ముసాయిదా మార్గదర్శకాలు తయారు చేసి, తగిన సలహాలు, సూచనలు 2023 జనవరి 20 లోగా ఇవ్వాల్సిందిగా బహిరంగంగా ప్రజలను, నిపుణులను కోరింది.

ఒకసారి మార్గదర్శకాలకు తుది రూపు వస్తే, అన్ని జేజే బోర్డులు నిందితులు చేసిన అతి హేయమైన నేరంపై ఏకరూప ప్రాథమిక అంచనా తీర్పు వెలువరించే అవకాశముంది. తద్వారా హత్య, లైంగిక దాడి లాంటి అతి హేయమైన కేసులకు పాల్పడిన 16 ఏళ్లు నిండిన నిందితులను బాలల కోర్టులో విచారణ జరిపే అవకాశముంది. అయినా కూడా 18 సంవత్సరాల వయస్సులోపు వారికి మరణ శిక్ష లేదా యావజ్జీవ కారాగార శిక్ష విధించరాదని చట్టం చెప్తోంది.

కొద్ది మాసాల క్రితం జూబ్లీ హిల్స్‌లోని అమ్నీసియా పబ్ వద్ద ఇన్నోవా వాహనంలో బాలికపై సామూహిక అత్యాచార ఆరోపణ కేసులో 16 ఏళ్లు నిండిన నలుగురు బాలురను మామూలు నిందితుల మాదిరే విచారణ జరపాలని జేజే బోర్డు పోక్సో కోర్టుకు పంపించటం మనందరికీ విదితమే.

జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ 2021 వార్షిక నివేదిక ప్రకారం మన దేశంలో బాలబాలికల మీద 2019లో 32,269 కేసులు, 2020లో 29,768 కేసులు, 2021లో 31,170 కేసులు నమోదైనాయి. దీన్ని బట్టి బాలబాలికల్లో హింసాత్మక, నేర ప్రవృత్తి స్థాయి మనకు అవగతమవుతుంది. దీనికి తల్లిదండ్రుల నిరాదరణ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు కొన్ని కారణాలు. వీటిని పరిహరించడం ద్వారానే రేపటి పౌరులను నేర ప్రపంచంలోకి వెళ్లకుండా ఆపగలం.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి | 98485 45970

రవి అస్తమించని ప్రవాస భారతీయం

సందర్భం



కోరాడ శ్రీనివాసరావు

ప్రపంచ నలుమూలలా భారతీయులు నివసిస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ లెక్కల ప్రకారం 210 దేశాలలో భారతీయ మూలాలున్న వారు, ఎన్నారైలు కలిపి 3.2 కోట్లకు పైగానే ఉన్నారు. ప్రవాస భారతీయ జనాభా కంటే తక్కువ జనాభా కలిగిన దేశాలు 150 పైనే ఉన్నాయి.

నేడు అనేక దేశాల్లో రాజకీయంగా కూడా భారతీయులు కీలక పదవుల్లో ఉన్నారు. అమెరికా ఉపాధ్యక్ష పదవిని కమలా హారిస్ అలంకరించిన సంగతి తెలిసిందే. అలాగే హైదరాబాద్‌లో జన్మించిన తెలుగింటి బిడ్డ అరుణ మిల్లర్ (కాట్రగడ్డ అరుణ) మేరీలాండ్ రాష్ట్రానికి గత నవంబర్‌లో లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం వివిధ దేశాల్లో భారతీయ మూలాలున్న వ్యక్తులు వివిధ దేశాలకు అధినేతలుగా వ్యవహరిస్తున్నారు. రిషి సునాక్ (బ్రిటన్ ప్రధాని), ఆంటోనియ కోస్టా (పోర్చుగల్ ప్రధాని), మహ్మద్ ఇర్ఫాన్ అలీ (గయానా ప్రెసిడెంట్), పృథ్వీరాజ్ రూపన్ (మారిషస్ అధ్యక్షులు), చంద్రిక పెర్సద్ శాన్ టోఖీ (సురినామ్ ప్రెసిడెంట్) లతోపాటు 200 మందికి పైగా భారతీయులు 15 దేశాల్లో వివిధ హోదాల్లో ప్రజాసేవలో ఉన్నారు. వీరంతా అమెరికా, యూకే, కెనడా, గయానా, సురినామ్, ఫిజీ, ట్రినిడాడ్ అండ్ టుబాగో, సింగపూర్, మారిషస్, పోర్చుగల్, దక్షిణాఫ్రికా, మలేసియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో పనిచేస్తున్నారు. వీరు కాకుండా వివిధ దేశాల్లో, కేంద్ర, రాష్ట్ర చట్టసభల్లో సభ్యులుగా ఉన్నవారు చాలామందే ఉన్నారు. గతంలో సింగపూర్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎస్.ఆర్.నాథన్ (1999–2011), దేవన్ నాయర్ (1981–1985)లు, ఫిజీ ప్రధానిగా పనిచేసిన మహేంద్ర చౌదరి, మలేసియా ప్రధానిగా పని చేసిన మహతీర్ బిన్ మహ్మద్ వంటి వారు భారతీయ మూలాలున్నవారే.



ప్రపంచంలోని అగ్రస్థానాల్లో ఉన్న గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ళ, ఈ మధ్య వరకు ట్విట్టర్ సీఈఓగా కొనసాగిన పరాగ్ అగర్వాల్, పెప్సికోలా ఒకప్పటి సీఈఓ ఇంద్రనూయి వంటి వారెందరో భారతీయ మూలలున్నవారే. నేడు ప్రపంచంలో వివిధ దేశాల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ప్రవాస భారతీయులు బ్రిటిష్ రాజ్ కాలంలో, తదనంతరం విదేశాలకు వెళ్ళినవారే. ముఖ్యంగా వ్యవసాయం పనుల కోసం వెళ్ళిన భారతీయులు అక్కడ స్థిరపడ్డారు. మారిషస్, గయానా, ట్రినిడాడ్ అండ్ టుబాగో, కెనడా, దక్షిణాఫ్రికా మలేసియా, ఫిజీ వంటి కామన్వెల్త్ దేశాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నవారు వీరే!

స్వాతంత్ర్యానంతరం ప్రపంచ కలల దేశమైన అమెరికాకు భారతీయ వలసలు ప్రారంభమై, నేడు సుమారు 45 లక్షల మంది ఆ గడ్డపై తమవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. 10 దేశాల్లో భారతీయుల జనాభా 10 లక్షలు దాటితే మరో 22 దేశాల్లో లక్షకు పైగా వున్నారు. డర్బన్ నగరాన్ని మినీ ఇండియాగా అభివర్ణిస్తారంటే ఆ నగరంలో భారతీయుల హవాని అర్థం చేసుకోవచ్చు. ప్రతీ ఏడు 25 లక్షల భారతీయులు విదేశాలకు వలస వెళ్తున్నారు భారతీయ వలసల్లో ఇదే పంథా కొనసాగితే ఈ శతాబ్దం అంతానికి భారతీయ పరిమళాలు ధరణి అంతా మరింత వ్యాపించి రవి అస్తమించని ‘భారతీయం’ సాక్షాత్కరిస్తుంది.

వ్యాసకర్త ప్రభుత్వాధికారి, ఏపీ | 94410 08574

(జనవరి 8–10 ప్రవాసీ దివస్ ఉత్సవాల సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం, తిథి: బ.పాడ్యమి తె.5.24 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి విదియ, నక్షత్రం: పునర్వసు రా.2.07 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: ప.12.50 నుండి 2.36 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.35 నుండి 8.04 వరకు, అమృతఘడియలు: రా.11.25 నుండి 1.11 వరకు: రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు: సూర్యోదయం 6.36: సూర్యాస్తమయం 5.36.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఎస్పీడీసీఎల్ సీఎండీకి టీవీఏజేఏసీ చైర్మన్ వప్పు వెంకటేశ్వర్లు, కన్వీనర్ ధారావత్ సికిందర్ లేఖ రాశారు. ఆర్టిజన్లకు విద్యార్హత బట్టి జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్, జూనియర్ లైన్‌మన్‌గా కన్వర్షన్ ఇవ్వాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మన్‌ను నియమించాలని, ఆర్టిజన్ కార్మికులందరికీ వైద్యం కల్పించాలని కోరారు.

ఇరిగేషన్ డీఈఈ బలవన్మరణం

- గోదావరి నదిలో దూకి ఆత్మహత్య
- బదిలీ కావడం లేదని మనస్తాపానికి గురైనట్లు అనుమానం
- నిజామాబాద్ జిల్లాలో ఘటన


గోదావరి ఒడ్డుపై లభ్యమైన డీఈఈ బైక్

నవీపేట: ఆర్మూర్ ఇరిగేషన్ డీఈఈ జోరుపల్లి వెంకట రమణారావు (47) నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం మండలంలోని పోతంగల్ గ్రామంలో తల్లిదండ్రులను కలిసి బయటకు వెళ్లిన డీఈఈ శుక్రవారం గోదావరి నదిలో శవమై కనిపించారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. నిజామాబాద్‌లోని మారుతి నగర్‌లో వెంకట రమణారావు.. భార్య చందన, కూతురు మనస్వినిలతో కలిసి నివాసముంటున్నారు. ఆర్నెల్ల కిందట కూతురు చదువు కోసం నివాసాన్ని హైదరాబాద్‌కు మార్చారు. మనస్విని ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. రెండ్రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన రమణారావు తల్లిదండ్రులు చంద్రకళ, గంగాధర్‌రావు, తమ్ముడు మధుకర్‌రావుతో కాసేపు మాట్లాడి నిజామాబాద్ వెళ్తానని చెప్పి తన మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. అదే రోజు రాత్రి యంచ శివారులోని గోదావరి నది బ్రిడ్జి దగ్గరకు వెళ్లారు. అక్కడే వాహనాన్ని నిలిపి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన అన్నయ్యకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోందని, ఆయన ఆచూకీ కనిపించడం లేదని మధుకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నదిలో మృతదేహం దొరికిందంటూ యంచ గ్రామానికి చెందిన గజ ఈతగాళ్లు శుక్రవారం పోలీసులకు సమాచారమందించారు. ఆ మృతదేహాన్ని రమణారావుగా గుర్తించారు.

11 నెలల నుంచి సెలవులో...

నిజామాబాద్ డివిజన్‌లో డీఈఈగా పని చేసిన రమణారావు రెండేళ్ల కిందట ఆర్మూర్ డీఈఈగా బదిలీపై వెళ్లారు. దీనికంటే ముందే ఆయన కామారెడ్డి జిల్లాకు వెళ్లాలని తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిసింది. ఆర్మూర్‌లో ఓ కీలక ప్రజాప్రతినిధి బలవంతంగా సంతకాలు పెట్టించినట్లు రమణారావు గతంలోనే పలువురి వద్ద వాపోయినట్లు తెలిసింది. ఆయన 11 నెలల నుంచి సెలవులో ఉన్నారు. హైదరాబాద్‌కు మకాం మార్చడంతో కామారెడ్డికి కాకుండా హైదరాబాద్‌కు బదిలీ కోసం ప్రయత్నం చేసినట్లు తెలిసింది. తాను చదువుకున్న రోజుల్లో రూమ్‌మేట్ అయిన మంత్రి హరీశ్‌రావును కూడా ఈ విషయమై కలిసినట్లు తెలిసింది. రమణారావు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సమీప బంధువు. ఆమె భర్త అనిల్‌కు బాబాయ్ వరుస అవుతారు. రమణారావు అంత్యక్రియల్లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కవిత భర్త అనిల్, మామ రాంకిషన్‌రావు పాల్గొన్నారు. బదిలీ ప్రయత్నాలు ఫలించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు అనుమానం వ్యక్తం చేశారు.

దేశీమిర్చి అ'ధర'హో..

- కొత్త పంటకు ప్రారంభంలోనే రికార్డు స్థాయి ధర
- వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో క్వింటాలుకు రూ.80,100

సాక్షి, వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో దేశీమిర్చికి ఆరంభంలోనే రికార్డు స్థాయి ధర పలికింది. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం రావిచెట్టు తండాకు చెందిన తేజావత్ రాములు శుక్రవారం తెచ్చిన క్వింటాలు దేశీ మిర్చికి రూ.80,100 ధర పలికింది. గత సీజన్ ఆరంభంలో ఈ రకం మిర్చికి రూ.30 వేల నుంచి మొదలై రూ.90 వేలకుపైగా ధర పలికింది. అయితే ఈసారి సీజన్ ప్రారంభంలోనే రూ.80,100 ధర పలకడం రికార్డు అని మార్కెట్ కార్యదర్శి రాహుల్ తెలిపారు. 4 బస్తాలు తెచ్చిన తేజావత్ రాములుకు ఈ ధర వచ్చిందన్నారు. ఇప్పుడు కోల్డ్ స్టోరేజీలలో దేశీమిర్చి నిల్వలు లేవని, కొత్త పంట నేరుగా మార్కెట్‌కు వచ్చిందని చెప్పారు. గతంలో ప్రారంభంలో క్వింటాలుకు రూ.30 వేలు పలికితేనే చాలామంది తర్వాత రేటు పెరుగు తుందన్న ఉద్దేశంతో కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసి కొద్ది నెలలు కాగానే అత్యధిక రేటు రూ.90వేల వరకు అమ్ముకున్నారని గుర్తు చేశారు.

కలుషిత ఆహారంతో | 29 మంది చిన్నారులకు అస్వస్థత

- సిరిసిల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంఘటన

సిరిసిల్లటౌన్: కలుషిత ఆహారంతో 29 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. వీరిలో ఏడుగురు విద్యార్థులు వాంతులు, డీహైడ్రేషన్ బారిన పడ్డారు. బడిలో కొత్తగా నిర్మిస్తున్న సంపులో నింపిన నీటితో మధ్యాహ్న భోజనం వండి పిల్లలకు పెట్టారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం చేసిన విద్యార్థుల్లో 2 గంటలకు ఫుడ్‌పాయిజన్ లక్షణాలు కనిపించాయి. అస్వస్థతకు గురైన విద్యార్థులు ఒకటో తరగతిలో ఐరా, వర్షిణి, రిషిత, రెండో తరగతిలో వర్షిణి, శ్రీజ, లక్కీ, వేదిక, వినతి, వరుణ్, శ్రీలక్ష్మి, మూడో తరగతిలో చెఫాన్, వర్షిణి, రిషి, నాలుగో తరగతిలో సంజన, ధీరజ్, రిషివర్ధన్, నిశాంత్, శివ, చరణ్, గౌతమ్, అభిలాష్, ఐదో తరగతిలో రాంచరణ్, శ్రీజ, రిక్షిత్, లాస్య, శామన్‌లిల్లి, రిషివర్ధన్, దివ్య, రిషిత్, ఇందు ఉన్నారు. 29 మంది చిన్నారులను 108 వాహనంలో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో చికిత్స అందించారు. చికిత్స అనంతరం 25 మందిని డిశ్చార్జి చేయగా.. తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురికి ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. సంఘటనపై జిల్లా విద్యాధికారి రాధాకిషన్ విచారణకు ఆదేశాలిచ్చారు. మంత్రి కేటీఆర్ పిల్లల పరిస్థితిని తెలుసుకుని తదుపరి చర్యలకు డీఈవోకు ఆదేశాలు జారీచేశారు.


విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న సిరిసిల్ల ఆస్పత్రి వైద్యులు

గుండెపోటుతో కూడా బస్సును అదుపు చేసి

- 45మంది ప్రయాణికులు క్షేమం
- ఆస్పత్రికి తరలిస్తుండగా డ్రైవర్ మృతి



పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు. (ఇన్‌సెట్‌లో) బస్‌డ్రైవర్ దేవ ఇరక్కమ్

వెంకటాపురం(కె): టూరిస్ట్ బస్సుడ్రైవర్‌కు గుండెపోటు వచ్చినా.. బస్సుకు బ్రేక్ వేయడంతో తక్కువ వేగంతో పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రయాణికులకు ఏమీ కాలేదు కానీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలం అంకన్నగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం ఉత్తర బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 45మంది శక్తి మాలలు ధరించి తీర్థ యాత్రల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం భద్రాచలం పర్ణశాల నుంచి యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి బయలుదేరారు. బస్‌డ్రైవర్ దేవ ఇరక్కమ్ (49) పర్ణశాల వద్ద నుంచే తనకు గుండె వద్ద నొప్పి వస్తోందని ఇబ్బందిగా ఉందని తెలిపాడు. దీంతో వేరే డ్రైవర్‌ను పిలిపించాలని ప్రయాణికులు సూచించారు. మరో డ్రైవర్ రావడానికి రెండు రోజులు పడుతుందని, అప్పటివరకు తానే బస్సు నడుపుతానని చెప్పి యాదాద్రికి బయలుదేరాడు. అంకన్నగూడెం గ్రామ శివారులోకి రాగానే డ్రైవర్‌కు గుండెనొప్పి తీవ్రమై ఒక్కసారిగా కుప్పకూలాడు. బస్సు నెమ్మదిగా ఉండడం, డ్రైవర్ నొప్పితో ఉన్నా బ్రేక్ వేయడంతో బస్సు పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి ఆగింది. అపస్మారకస్థితిలో ఉన్న డ్రైవర్‌ను వెంటనే 108లో వెంకటాపురం వైద్యశాలకు తరలిస్తుండగా చనిపోయాడు. బస్సులోని 45మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. డ్రైవర్ నొప్పి ఉన్నా సమయస్ఫూర్తితో బ్రేక్ వేశాడని, లేదంటే పెనుప్రమాదం జరిగేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేరుగా సమస్యలకు పరిష్కారం

- వినియోగదారులను కలుసుకోవడంతో సత్ఫలితాలు
- టీఎస్ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వినియోగదారులను నేరుగా కలిసి సమస్యలను తెలుసుకునేందుకు తాము శ్రీకారం చుట్టిన కార్యక్రమం సత్ఫలితాలిస్తోందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ) చైర్మన్ టి.శ్రీరంగారావు తెలిపారు. ఈఆర్సీ చొరవతో ఈ ఏడాది డిస్కంలు సకాలంలో టారీఫ్, ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలు సమర్పించాయన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఈఆర్సీల ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సమస్యలపై చర్చించారు. విద్యుదాఘాతం నుంచి మనుషులను రక్షించేందుకు తప్పనిసరి చర్యలు తీసుకున్నామని తమిళనాడు ఈఆర్సీ చైర్మన్ ఎం.చంద్రశేఖరన్ తెలిపారు. విద్యుత్ నష్టాలను నివారించడానికి వ్యవసాయ కనెక్షన్లను కెపాసిటర్లను తప్పనిసరి చేశామని చెప్పారు. రాయ్‌ఘర్ - త్రిసూర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌కు జాతీయ హోదా కల్పించాలని కేరళ ఈఆర్సీ చైర్మన్ టి.కె జోస్ చేసిన విజ్ఞప్తికి ఏకగ్రీవంగా మద్దతు లభించింది.


మానవహారం నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

హైకోర్టు తీర్పు మేరకు ఉద్యోగాలివ్వండి

- ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చాలి
- మోకాళ్లపై యాదాద్రి ఆలయ మెట్లు ఎక్కి 2008 డీఎస్సీ అభ్యర్థుల నిరసన

యాదగిరిగుట్ట: 2008లో డీఎస్సీకి హాజరై ఉద్యోగాల కోసం 13 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని డీఎస్సీ 2008 బీఈడీ మెరిట్ క్యాండిడేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన అభ్యర్థులకు ఉద్యోగా లు ఇచ్చి న్యాయం చేస్తామని సీఎం కేసీఆర్ గతంలో వరంగల్‌లో జరిగిన సభలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హైకోర్టు తమకు అనుకూలంగా తీర్పు వెలువరించినా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ప్ర భుత్వం తమను ఆదుకోవాలని కోరుతూ 2008 డీఎస్సీ అభ్య ర్థులు యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం ప్రదర్శన, మానవ హారం నిర్వహించారు. అనంతరం మోకా ళ్లపై యాదాద్రీశుడి ఆలయ మెట్లు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం హైకోర్టు తీర్పు ను అనుసరించి డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులకు శాశ్వత ఉద్యోగాలు ఇచ్చేలా ప్రతి పాదనలు సిద్ధం చేసిందన్నా రు. ఇప్పటికైనా కేసీఆర్ స్పందించాలని విజ్ఞప్తి చేశారు.


మోకాళ్లపై యాదాద్రి మెట్లు ఎక్కుతూ..

'మహా' రైతుల పరిహారానికి ఓకే!

- సిరొంచ పరిధిలోని 12గ్రామాల రైతులకు ఊరట
- 36 రోజుల రిలే దీక్షకు కదలిన మహారాష్ట్ర ప్రభుత్వం
- రైతులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ (లక్ష్మీ)బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో నష్టపోతున్న రైతులకు పరిహారం ఇచ్చేందుకు ఎట్టకేలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఓకే చెప్పింది. మేడిగడ్డ బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా పరిధిలోని 12 గ్రామాల పంట భూములు నీట మునిగి నాలుగేళ్లుగా నష్టపోతున్నామని రైతులు 36 రోజులుగా రిలే దీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు నాగ్‌పూర్‌లో జరుగుతున్న క్రమంలో అక్కడ మూడు రోజులు అసెంబ్లీ ఎదుట దీక్ష చేపట్టగా...స్పందించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమస్యలు పరిష్కరిస్తామని డిసెంబర్ 22న హామీ ఇచ్చారు. ఆ నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సంజయ్ మీనా రైతులతో సిరొంచ తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సాగులో ఉన్న భూములకు ఎకరానికి రూ.11.40లక్షలు, బీడు భూములకు ఎకరానికి రూ.10లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

'డబుల్' ఇల్లు ఇవ్వడంలేదని...

- కత్తితో పొడుచుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- నచ్చజెప్పిన ఎస్‌ఐ, రెవెన్యూ అధికారులు
- కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌లో ఘటన

కొండపాక(గజ్వేల్): డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల్లో భూమిని కోల్పోయానని, అయినా ఇల్లు ఇవ్వలేదని ఆరోపిస్తూ తీవ్ర మనస్తాపం చెందిన ఓ వ్యక్తి కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌లో చోటుచేసుకుంది. మేదినీపూర్‌కు ప్రభుత్వం ఐదేళ్ల క్రితం 50 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. అయితే ప్రభుత్వస్థలం అందుబాటులో లేకపోవడంతో సర్పంచ్ విరుపాక్ష లావణ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి స్థానికుడైన నంగి కనకయ్య దంపతులకు చెందిన కొంతస్థలాన్ని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎంపిక చేశారు. ఆ సమయంలో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక కనకయ్యకు ఒక డబుల్ బెడ్‌రూం ఇంటిని అందిస్తామని తీర్మానించారు. కాగా, 2022 జూన్ 27న మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా 48 ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తనకు ఇల్లు కేటాయించలేదని ఆగ్రహించిన కనకయ్య మిగిలిన రెండు ఇళ్లలో ఓ ఇంటిని ఆక్రమించుకొని 6 నెలలుగా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రెవెన్యూ అధికారులు కనకయ్య ఉంటున్న ఇంటికి వెళ్లి ఖాళీ చేయాలని సూచించారు. డబుల్ బెడ్రూంల నిర్మాణంలో 14 గుంటల భూమిని కోల్పోయానని, అయినా తనకు ఇల్లు ఇవ్వలేదని, ఇప్పుడు ఉంటున్న ఇంట్లో నుంచి వెళ్లమంటారా అంటూ మనస్తాపం చెంది కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కలవారు అప్రమత్తమై అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పుష్పరాజ్ ఘటనాస్థలానికి చేరుకొని కనకయ్యకు నచ్చజెప్పారు. ఈ విషయమై తహసీల్దార్ ఆశాజ్యోతిని వివరణ కోరగా సమాధానం దాటవేశారు.


కనకయ్యకు నచ్చజెబుతున్న ఎస్‌ఐ పుష్పరాజ్

సమాఖ్య భవనంలో ఉంటున్నాం...

డబుల్ బెడ్రూం నిర్మాణాల్లో ఇంటి స్థలంతోపాటు 12 గుంటల భూమిని కోల్పోయాం. లబ్ధిదారుల జాబితాలో పేరు రావడంతో అధికారులు పట్టా సర్టిఫికెట్ అందజేశారు. కానీ, ఇప్పటివరకు ఇంటిని అప్పగించలేదు. దీంతో మహిళా సమాఖ్య భవనంలో ప్రస్తుతం నివాసం ఉంటున్నాం. అధికారులు స్పందించి త్వరగా ఇంటిని కేటాయించాలి.

– మరో బాధితురాలు నంగి ఐలవ్వ

కూతుళ్లతో సుప్రీంకోర్టుకు సీజేఐ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ శుక్రవారం కోర్టు హాలులో లాయర్లందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. దివ్యాంగులైన తన ఇద్దరు పెంపుడు కూతుళ్లను ఆయన న్యాయస్థానానికి తీసుకువచ్చారు. విజిటర్స్ గ్యాలరీ గుండా వారిద్దరినీ ఫస్ట్‌కోర్ట్‌కు తీసుకు వచ్చారు. తను కూర్చునే చాంబర్‌ను చూపించారు. ఇతర జడ్జీలు కూర్చుని ఉండే చోటును, లాయర్లు వాదించే సమయంలో ఎక్కడి ఉండేదీ వారికి చెబుతూ.. కోర్టు పని విధానాన్ని వివరించారు. కూతుళ్లను వారి కోరిక మేరకు సీజేఐ తీసుకువచ్చారని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి. వచ్చిన అతిథులను చూసి న్యాయవాదులంతా ఆశ్చర్యానికి గురయ్యారని పేర్కొన్నాయి.

క్లుప్తంగా...

ట్విటర్‌పై హ్యాకర్ల దాడి

లండన్: సామాజిక మాధ్యమం ట్విటర్‌పై హ్యాకర్లు దాడి చేసి 20 కోట్ల మందికి పైగా వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని అపహరించారు. వినియోగదారుల ఈ-మెయిల్ ఇతర వివరాలను ఆన్‌లైన్ హ్యాకింగ్ ఫోరమ్‌లో అమ్మకానికి పెట్టారు. ఇజ్రాయెల్‌కు చెందిన సైబర్ భద్రత పర్యవేక్షణ సంస్థ హడ్సన్ రాక్ హ్యాకింగ్ విషయాన్ని బయటపెట్టింది.

గొడవ పడ్డ అంజలి, నిధి

న్యూఢిల్లీ: ఢిల్లీలో అంజలీ సింగ్ అనే యువతిని కారు ఢీకొట్టి, 12 కిలోమీటర్లు లాక్కెళ్లిన ఘటనలో మరికొన్ని విషయాలు వెలుగుచూశాయి. డిసెంబర్ 31వ తేదీ రాత్రి అంజలి స్కూటీపై ఆమె స్నేహితురాలు నిధి కూడా ఉన్నట్లు తేలింది. అయితే, అంతకుముందు వారిద్దరూ డబ్బు విషయమై ఘర్షణకు కూడా దిగినట్లు అంజలి స్నేహితుడొకరు వెల్లడించాడు. ఈ కేసులో నిందితులను కాపాడేందుకు యత్నిస్తున్నట్లు అనుమానాలున్న అశుతోష్‌ను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మరో అనుమానితుడు అంకుశ్ ఖన్నా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఇలా ఉండగా, మృతురాలు అంజలీ సింగ్ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందజేయనున్నట్లు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పారు.

'స్పీకర్ ఎన్నిక'లో మూడో రోజూ విఫలమైన మెక్‌కార్తీ

వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)లోని ప్రతినిధుల సభ నూతన స్పీకర్ ఎన్నికపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి కెవిన్ మెక్‌కార్తీని మూడోరోజు సైతం అదృష్టం పలకరించలేదు. స్పీకర్‌గా ఎన్నిక కావడానికి అవసరమైన మెజార్టీ ఓట్లు దక్కలేదు. 11వ రౌండ్ ఓటింగ్‌లోనూ సరిపడా ఓట్లు రాలేదు. స్థానిక కాలమానం ప్రకారం తదుపరి ఓటింగ్ శుక్రవారానికి వాయిదా పడింది. సొంత పార్టీలోనే ప్రత్యర్థులు ఉండడం మెక్‌కార్తీకి ప్రతికూలంగా మారింది. కొత్త స్పీకర్ ఎన్నిక పూర్తికాకపోవడంతో నూతన ప్రతినిధుల సభ ఇంకా పూర్తిస్థాయిలో కొలువుదీరనట్లే లెక్క.

మోదీ హయాంలో రెండు రకాల భారత్‌లు

పానిపట్: "నరేంద్ర మోదీ ఏలుబడిలో రెండు రకాల భారత్‌లు కనిపిస్తున్నాయి. ఒకటి కోట్లాది కార్మికులు, రైతులు, నిరుద్యోగులది. రెండోది దేశంలోని సగం సంపదను గుప్పెట్లో ఉంచుకున్న 100 మంది ధనికులది" అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ చెబుతున్న హిందుస్తాన్ నిజ స్వరూపం ఇదేనని ఎద్దేవా చేశారు. శుక్రవారం జోడో యాత్ర సందర్భంగా హరియాణాలోని పానిపట్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. దేశంలోని చిన్న, మధ్య తరహా వ్యాపారాలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం వస్తుసేవల పన్ను(జీఎస్టీ), నోట్ల రద్దు విధానాలను ఆయుధంగా వాడుకుందని ఆరోపించారు.

ముంబై ఎయిర్‌పోర్ట్‌లో రూ.47 కోట్ల డ్రగ్స్ పట్టివేత

ముంబై: ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఇద్దరు వ్యక్తుల నుంచి అధికారులు రూ.47 కోట్ల విలువైన కొకైన్, హెరాయిన్ స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయం కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో ఒక వ్యక్తి వద్ద రూ.31.29 కోట్ల ఖరీదు చేసే 4.47 కిలోల హెరాయిన్, మరొకరి వద్ద రూ.15.96 కోట్లుండే 1.596 కిలోల కొకైన్ దొరికింది. వీరిలో ఒకడు కెన్యా ఎయిర్ వేస్ విమానంలో దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్ నుంచి కెన్యాలోని నైరోబీ మీదుగా వచ్చాడు. అతడు 12 డాక్యుమెంట్ ఫోల్డర్లలో హెరాయిన్ దాచాడు. మరో వ్యక్తి ఇథియోపియన్ ఎయిర్ లైన్స్ విమానంలో వచ్చాడు. అతడి లగేజీలోని దుస్తుల గుండీల్లోనూ, హ్యాండ్‌బ్యాగుల్లో రహస్యంగా కొకైన్ దాచి ఉందని అధికారులు తెలిపారు.

కాల్పుల విరమణకు తూట్లు

కీవ్: ఆర్థోడాక్స్ క్రిస్మస్ సందర్భంగా 36 గంటల కాల్పుల విరమణ అంటూ రష్యా ప్రకటించిన కొద్దిగంటల్లోనే తూర్పు ఉక్రెయిన్ ప్రాంతం పేలుళ్లతో దద్దరిల్లింది. ఖెర్సన్‌లోని ప్రధాన నగరం డొనెట్స్క్‌లోని ఫైర్ స్టేషన్‌పై రష్యా క్షిపణి దాడిలో ఒకరు చనిపోగా నలుగురు గాయపడ్డారు. క్రమటోర్స్క్ నగరంపై రష్యా సైన్యం జరిపిన కాల్పుల్లో డజను వరకు భవనాలు దెబ్బతిన్నాయి. బఖ్‌ముత్ నగరంలో రెండు దేశాల ఆర్మీ మధ్య శతఘ్ని కాల్పులు కొనసాగుతున్నాయి. తూర్పు ప్రాంతంలో ముందుకు సాగుతున్న తమ బలగాలను నిలువరించే ఎత్తుగడలో భాగంగానే ఏకపక్షంగా పుతిన్ కాల్పుల విరమణ ప్రకటించారని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. తాము కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ పట్టించుకోకుండా ఆక్రమిత ప్రాంతాలపైనా, తమ ఆర్మీపైనా ఉక్రెయిన్ దాడులు కొనసాగిస్తోందని రష్యా ఆరోపించింది.

80 శాతం గ్లేసియర్లు... ఏళ్లలో మాయం!



వాషింగ్టన్: భూ గోళానికి పెను ముప్పు అనుకున్న దానికంటే ముందుగానే ముంచుకొస్తుందా? హిమానీ నదాలపై తాజా అధ్యయనం ఫలితాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. ఈ శతాబ్దాంతానికి భూమిపై ఉన్న ప్రతి ఐదు హిమానీ నదాల్లో నాలుగు, అంటే ఏకంగా 80 శాతం నామరూపాల్లేకుండా పోతాయని సదరు అధ్యయనం తేల్చింది! గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలు బాగా ఫలించినా 2100 కల్లా కనీసం 25 నుంచి 41 శాతం హిమానీ సంపద హరించుకు పోతుందని అంచనా వేసింది. "సగటు ఉష్ణోగ్రతలు రెండు డిగ్రీలు పెరిగే పక్షంలో మధ్య యూరప్, పశ్చిమ కెనడా, అమెరికాల్లోని చిన్నపాటి హిమానీ నదాలు తీవ్ర ప్రభావానికి లోనవుతాయి. 3 డిగ్రీలు పెరిగితే మొత్తానికే మటుమాయమవుతాయి" అని అధ్యయనానికి సారథ్యం వహించిన అమెరికాలోని కార్నెగీ మెలన్ వర్సిటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డేవిడ్ రౌన్స్ చెప్పారు. "కర్బన ఉద్గారాలకు ఇప్పటికిప్పుడు పూర్తిగా అడ్డుకట్ట వేయగలిగినా పెద్దగా లాభముండదు. ఇప్పటిదాకా వెలువడ్డ ఉద్గారాలు తదితరాలు హిమానీ నదాలపై చూపే దుష్ప్రభావాన్ని అడ్డుకోలేం. ఇది నిజంగా ఆందోళనకరమైన విషయం" అన్నారు.



ఘర్షణ పడుతున్న ఆప్, బీజేపీ కౌన్సిలర్లు

ఎంసీడీలో రగడ

ఆప్, బీజేపీ కౌన్సిలర్ల మధ్య తీవ్ర ఘర్షణ

- తొలుత నామినేటెడ్ సభ్యుల ప్రమాణం
- ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ
- మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగకుండానే సభ వాయిదా

న్యూఢిల్లీ: మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ(ఎంసీడీ) సమావేశంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్), ప్రతిపక్ష బీజేపీ కౌన్సిలర్ల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోకుండానే సభ వాయిదా పడింది. ఎన్నికైన కౌన్సిలర్లతో కాకుండా, నామినేట్ అయిన సభ్యులతో తొలుత ప్రమాణ స్వీకారం చేయించడంతో సభలో రగడ జరిగింది. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను దక్కించుకోవడానికి బీజేపీ అడ్డదార్లు తొక్కే అవకాశం ఉందని 'ఆప్' సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మేయర్ ఎన్నిక ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రిసైడింగ్ అధికారిగా బీజేపీ కౌన్సిలర్ సత్యా శర్మ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నలుగురు నామినేటెడ్ సభ్యులతో ప్రమాణం చేయించారు. దీనిపై ఆప్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సత్యాశర్మ సభను గంటపాటు వాయిదా వేశారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక మిగిలిన నామినేటెడ్ సభ్యుల ప్రమాణ స్వీకారం చేస్తుండగా ఆప్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి, నినాదాలు ప్రారంభించారు. ఎన్నికైన కౌన్సిలర్లతో మొదట ప్రమాణం చేయించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష బీజేపీ కౌన్సిలర్లు సైతం నినాదాలు ప్రారంభించారు. ఆప్ కౌన్సిలర్లు, ఎమ్మెల్యేలతో ఘర్షణకు దిగారు. దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ అధికారి సత్యాశర్మ ప్రకటించారు.

ఆమ్ ఆద్మీ పార్టీకే సంఖ్యా బలం

మేయర్ ఎన్నిక కోసం ఉద్దేశించిన ఎలక్టోరల్ కాలేజీలో 250 మంది ఎన్నికైన కౌన్సిలర్లు మాత్రమే కాకుండా ఢిల్లీకి చెందిన ఏడుగురు లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు, 14 మంది నామినేటెడ్ ఎమ్మెల్యేలు కూడా ఉంటారు. అంటే ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం సభ్యుల సంఖ్య 274. నంబర్ గేమ్ ఆమ్ ఆద్మీ పార్టీకే అనుకూలంగా ఉంది. ఆ పార్టీకి 150 ఓట్లు ఉన్నాయి.

కేంద్రం తీరు ఆందోళనకరం

కొలీజియం సిఫార్సుల పెండింగ్‌పై సుప్రీం • రెండోసారి సిఫార్సులనూ తిప్పి పంపుతోంది

- బదిలీ సిఫార్సులూ పెండింగ్‌లోనే
- వీటితో తప్పుడు సంకేతాలన్న కోర్టు
- టైం లైన్‌కు కట్టుబడ్డామన్న కేంద్రం



న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకంపై కేంద్రం, న్యాయవ్యవస్థ మధ్య కొనసాగుతున్న వివాదంపై సుప్రీంకోర్టులో శుక్రవారం వాడీవేడి వాదనలు జరిగాయి. కొలీజియం సిఫార్సుల ఆమోదంలో సుప్రీంకోర్టు విధించిన టైం లైన్‌ను కేంద్రం పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తులు ఎస్.కె.కౌల్, ఆర్.ఎల్.ఓకా ధర్మాసనం విచారణ జరిపింది. కొలీజియం రెండోసారి సిఫార్సు చేసిన పేర్లను కూడా కేంద్రం తిప్పి పంపుతోందని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ప్రస్తావించగా ఇది ఆందోళనకరమని పేర్కొంది. "ఇటీవల ఇలా పలు సిఫార్సులను రెండోసారీ తిప్పి పంపారు. పెండింగ్‌లో ఉన్న 22 పేర్లను కూడా వెనక్కు పంపారు. ఇంకా చాలా పేర్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ సిఫార్సులపై కేంద్రానికి సొంత అభిప్రాయాలేవైనా ఉంటే ఉండొచ్చు. కానీ ఎటూ తేల్చకుండా అట్టిపెట్టుకోజాలదు. తప్పుగానో, ఒప్పుగానో ఈ అంశాన్ని తేల్చాల్సిందే. కేంద్రం కావాలంటే కొలీజియం సిఫార్సులపై తన అభిప్రాయాలను మాకు పంపొచ్చు. వాటిని మేం పరిశీలిస్తాం. ఆ మీదట వాటిని పక్కన పెట్టడమో, తిరిగి సిఫార్సు చేయడమో చేస్తాం. కానీ ఒక పేరును కొలీజియం రెండోసారి కేంద్రానికి సిఫార్సు చేసిందంటే ప్రస్తుత నిబంధనల మేరకు సదరు నియామకాన్ని ఆపడానికి వీల్లేదు" అని గుర్తు చేసింది. కొలీజియం సిఫార్సులను సుదీర్ఘ కాలం పెండింగులో పెడుతుండటం వల్ల ప్రతిభావంతులైన పలువురు తమకు జడ్జి పదవే వద్దంటూ తప్పుకుంటున్నారంటూ ఆవేదన వెలిబుచ్చింది. కొలీజియం రెండోసారి సిఫార్సు చేసిన పేర్లను మూడు నాలుగు వారాల్లోపు కేంద్రం ఆమోదించాలని సుప్రీంకోర్టు 2021 ఏప్రిల్ 20న పొందుపరిచిన టైం లైన్‌లో స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తుల బదిలీ సిఫార్సులను కూడా కేంద్రం దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం చాలా తప్పుడు సంకేతాలు పంపుతోందంటూ ధర్మాసనం ఆగ్రహం వెలిబుచ్చింది. "కొంతకాలం క్రితం 10 మంది హైకోర్టు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. ఈ బదిలీల విషయంలో కేంద్రం పాత్ర చాలా పరిమితం. అయినా మా సిఫార్సుల్లో రెండింటిని గత సెప్టెంబర్లో, మిగతా వాటిని నవంబర్ చివర్లో ఆమోదించింది! ఇది చాలా తప్పుడు సంకేతాలు పంపుతోంది. న్యాయ వ్యవస్థ, కేంద్రం కాకుండా ఎవరో మూడో శక్తి జోక్యం చేసుకుంటోందన్న అభిప్రాయం కలిగిస్తోంది" అని జస్టిస్ కౌల్ అన్నారు. "ప్రతి వ్యవస్థలోనూ మంచీ చెడూ రెండూ ఉంటాయి. ఒక న్యాయమూర్తి బదిలీకి సిఫార్సు చేసేముందు కొలీజియం నిర్దిష్ట ప్రక్రియను తూచా తప్పకుండా అనుసరిస్తుంది. అవసరమైన వారినుంచి అభిప్రాయాలు తీసుకుంటుంది. ఆ తర్వాతే సిఫార్సు చేస్తుంది" అని చెప్పారు. కొన్నిసార్లు కేంద్రం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ కొలీజియమే తాను సిఫార్సు చేసిన పలు పేర్లను వెనక్కు తీసుకుందని గుర్తు చేశారు.

ముగ్గురిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా, ఐదుగురిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా కొలీజియం చేసిన సిఫార్సుల విషయం ఏమైందని ధర్మాసనం ప్రశ్నించింది. వాటిని కేంద్రం పరిశీలిస్తోందని, స్పందించేందుకు సమయం కావాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి బదులిచ్చారు. "దీనిపై నిర్ణయానికి సమయమెందుకు? వారిప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు. సీనియర్ న్యాయమూర్తులు" అని ధర్మాసనం గుర్తు చేసింది. "పలు హైకోర్టుల్లో సీజే పదవులు ఖాళీగా ఉన్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా మేం చేసిన సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే గానీ వీటిపై మేం నిర్ణయం తీసుకోలేం" అంటూ విచారం వ్యక్తం చేసింది. కొలీజియం సిఫార్సుల పరిశీలనలో సుప్రీంకోర్టు విధించిన టైం లైన్‌కు కట్టుబడేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు ఏజీ పేర్కొన్నారు. హైకోర్టుల కొలీజియం చేసిన 104 సిఫార్సుల్లో 44 పేర్ల పరిశీలన రెండు మూడు రోజుల్లో పూర్తవుతుందన్నారు. విచారణను ధర్మాసనం ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

పిటిషన్లన్నీ సుప్రీంకోర్టుకు..

స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో దాఖలై, పెండింగ్‌లో ఉన్న అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కలిపేసి, విచారణ నిమిత్తం తమకే బదిలీ చేసుకుంది. ఈ పిటిషన్లపై స్పందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్ని పిటిషన్లకు కలిపి ఫిబ్రవరి 15లోగా ఉమ్మడి వివరణ ఇవ్వాలని సూచించింది. మార్చి 13న తదుపరి విచారణ చేపడతామని వెల్లడించింది.



అమెరికాలోని హవాయి రాష్ట్రంలో దాదాపు నెల రోజులుగా నిద్రాణంగా ఉన్న కిలౌయియా అగ్ని పర్వతం లావా మరోసారి పెల్లుబుకుతోంది. ప్రపంచంలోని చురుకైన అగ్ని పర్వతాల్లో ఇది ఒకటి.



చైనాలోని షాంఘైలో ఉన్న ప్రధాన ఆస్పత్రి బెడ్‌లు నిండిపోవడంతో కోవిడ్ బాధితులకు హాల్‌లోనే చికిత్సలు అందిస్తున్న దృశ్యం

డ్రగ్స్ తీసుకున్నా: హ్యారీ

అమ్మ ఆత్మతో మాట్లాడేందుకు ప్రయత్నించా
కెమిల్లాను పెళ్లాడొద్దని నాన్నను బతిమాలాం



లండన్: బ్రిటన్ రాచ కుటుంబంపై రాజు చార్లెస్-2 చిన్న కుమారుడు ప్రిన్స్ హ్యారీ సంచలన ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. అన్న ప్రిన్స్ విలియంతో తన బంధం ఎప్పుడూ సమస్యాత్మకంగానే సాగిందంటూ త్వరలో విడుదలవనున్న తన ఆత్మకథలో బయట పెట్టారాయన. "2021లో ఒకసారి మేమిద్దరం మా నాన్న సమక్షంలోనే తలపడ్డాం. మీరిలా కొట్టుకుని నా చివరి రోజులను దుర్భరంగా మార్చకండంటూ ఆయన మమ్మల్ని విడదీశాడు" అని వివరించారు. "రాచ కుటుంబీకుల పెళ్లిళ్లు జరిగే వెస్ట్‌మినిస్టర్ అబేలోని సెయింట్ పాల్స్ కెథడ్రెల్‌లో మెగన్, నేను ఒక్కటయ్యేందుకు కూడా విలియం ఒప్పుకోలేదు" అన్నారు. రాచరికపు జీవితపు ఒత్తిడిని తట్టుకోలేక ఒక దశలో డ్రగ్స్‌కు అలవాటు పడ్డట్టు చెప్పారు! "17 ఏళ్ల వయసులో తొలిసారిగా కొకైన్ వాడా. అంత థ్రిల్లింగ్‌గా ఏమీ అన్పించలేదు. తర్వాత ఎలన్ కాలేజీలో చదువుతున్న సమయంలో బాత్రూంలో గంజా తాగాను. కాలిఫోర్నియాకు వెళ్లినప్పుడు మ్యాజిక్ మష్రూమ్స్ వంటివి టేస్ట్ చేశా. 17 ఏళ్లప్పుడే వయసులో నాకంటే పెద్దావిడతో తొలి లైంగికానుభవం రుచి చూశా" అని వివరించారు. "12 ఏళ్ల వయసులో నా తల్లి డయానాను ప్రమాదంలో కోల్పోవడం బాధించింది. నిద్ర పోతున్న నన్ను లేపి నాన్న ఆ వార్త చెప్పారు. కానీ కనీసం నన్ను దగ్గరికి కూడా తీసుకుని ఓదార్చలేదు. మరణించిన నా తల్లితో ఎలాగైనా మాట్లాడేందుకు 'శక్తులున్న' ఒక మహిళను ఆశ్రయించా" అని చెప్పుకొచ్చారు. కెమిల్లాను పెళ్లి చేసుకోవాలని తండ్రి భావించినప్పుడు వద్దని తాను, విలియం బతిమాలామన్నారు. హ్యారీ బయట పెట్టిన ఈ అంశాలపై వ్యాఖ్యానించేందుకు రాజ కుటుంబం తిరస్కరించింది.

ఆ ప్రబుద్ధుడి ఉద్యోగం ఊడింది

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా విమానంలో మహిళపై మూత్రవిసర్జన చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముంబైవాసి శంకర్ మిశ్రాపై అతడు పనిచేస్తున్న కంపెనీ యాజమాన్యం వేటు వేసింది. ఉద్యోగంలోనుంచి తొలగించింది. శంకర్ మిశ్రా వెల్స్ ఫార్గో అనే బహుళజాతి సంస్థలో ఇండియా చాప్టర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. తమ సంస్థలో పనిచేసే సిబ్బంది వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ హుందాగా ప్రవర్తించాలని తాము కోరుకుంటున్నామని వెల్స్ ఫార్గో ఒక ప్రకటనలో వెల్లడించింది. శంకర్ మిశ్రా చేసిన పని తమకు తలవంపులు తెచ్చిందని పేర్కొంది.

కేసు పెట్టొద్దని వేడుకున్నాడు

విమానంలో ప్రయాణికురాలిపై మూత్రవిసర్జన ఘటనలో మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనకు తీవ్ర అవమానం జరిగిందని, నిందితుడి ముఖం చూడాలంటే అసహ్యం వేసిందని బాధితురాలు వెల్లడించారు. కేసు పెట్టొద్దని వేడుకున్నాడని, క్షమాపణ కోరాడని చెప్పారు.

దేవభూమికి బీటలు!

ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్‌లో వందలాది ఇళ్లకు పగుళ్లు

జోషిమఠ్. చార్‌ధామ్ యాత్రకు వెళ్లే భక్తులకు చిరపరిచితమైన పేరు. ఉత్తరాఖండ్‌లో అత్యంత పురాతనమైన పట్టణం పూర్తిగా కనుమరుగయ్యే రోజులు దగ్గరకొస్తున్నాయి. జోషిమఠ్‌లో వందలాది ఇళ్లు బీటలు వారాయి. కొన్ని చోట్ల భూమిలోంచి నీళ్లు ఉబుకుబుకి పైకి వస్తున్నాయి. ఈ పట్టణం నిట్టనిలువుగా భూమిలోకి కుంగిపోవడమే దీనికి కారణం. ఏదో ఒక రోజు జోషిమఠ్ మునిగిపోవడం ఖాయమని దశాబ్దాల క్రితమే హెచ్చరికలు జారీ అయ్యాయి.

ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో ప్రజలు గత కొద్ది రోజులుగా ప్రాణాలరచేతుల్లో పెట్టుకొని బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు. దాదాపుగా 600 ఇళ్లు బీటలు వారాయి. నేలకింద నుంచి ఇళ్లల్లోకి నీరు వచ్చేస్తోంది. భూమి కింద నుంచి శబ్దాలు వస్తూ ఉండడంతో స్థానికులు వణికిపోతున్నారు. చార్‌ధామ్ యాత్రికుల కోసం హెలాంగ్ నుంచి మార్వారి వరకు రోడ్డుని వెడల్పు చేసే ప్రాజెక్టు పనులు ముమ్మరంగా చేస్తూ ఉండడంతో ప్రస్తుతం ఈ ముప్పు ముంచుకొచ్చింది. దీంతో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి రంగంలోకి దిగారు. రహదారి నిర్మాణాలన్నీ తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించారు. జోషీమఠ్ పరిస్థితిపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. అక్కడి 600 కుటుంబాలను తక్షణం ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. శనివారం అక్కడ పర్యటించనున్నారు. దాంతో విపత్తు సహాయక బృందాలు ప్రజల్ని తరలిస్తున్నాయి.

ఎందుకీ ముప్పు ?

జోషీమఠ్ పట్టణం కొండల్లో ఏటవాలుగా ఉన్నట్టు ఒకవైపు ఒరిగి ఉంటుంది. అత్యంత పురాతనమైన కొండచరియలపై ఇళ్లు నిర్మించడంతో పునాదులు బలంగా లేవు. అడపా దడపా భూ ప్రకంపనలు పలకరిస్తూనే ఉంటాయి. రైని ప్రాంతంలోని అలకనంద నదికి వరదలు వచ్చినప్పుడల్లా జోషీమఠ్‌లో మట్టిని బలహీనపరుస్తోంది. ఈ ప్రాంతంలో భారీ నిర్మాణాలు చేపట్టవద్దని ఎందరో నిపుణులు హెచ్చరించినా మన ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. అభివృద్ధి కార్యక్రమాల కోసం కొండల్ని పేల్చేయడం, ఇష్టారాజ్యంగా తవ్వకాలు, చెట్లు నరికేయడం వంటి చర్యలు జోషీమఠ్ పట్టణాన్ని ప్రమాదంలో పడేశాయి. ఎన్‌టీపీసీకి చెందిన తపోవన్ విష్ణుగఢ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అతి పెద్ద ముప్పుగా పరిణమించింది. గత ఏడాది ఈ ప్రాజెక్టు దగ్గర ఆకస్మిక వరదలు సంభవించి 200 మంది మరణించిన విషయం తెలిసిందే. ఏడాది పొడవునా చార్‌ధామ్ యాత్ర చేయడానికి వీలుగా హెలాంగ్ నుంచి మార్వారి వరకు 20కి.మీ. మేర చేపట్టిన రహదారి వెడల్పు చేసే ప్రాజెక్టు ముప్పుని మరింత పెంచింది. ప్రస్తుతం ఈ నిర్మాణాలన్నీ తాత్కాలికంగా ప్రభుత్వం నిలిపివేసింది. సమస్యకి శాశ్వతమైన పరిష్కారాలు కనుగొనే వరకు చిన్నపాటి తవ్వకాలు కూడా చేయవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది జోషీమఠ్‌కి ముప్పుని తొలిసారి గుర్తించారు. చమోలిలో ప్రమాదకరంగా కొండచరియలు విరిగిపడినప్పుడు జోషీమఠ్‌లో ఇళ్లు బీటలు వారాయి. అప్పట్నుంచి ఏదో ఒక రూపంలో ప్రమాదాలు వస్తూనే ఉన్నాయి. దీనికి గల కారణాలపై బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాస్త్రవేత్తల బృందం ఈ పట్టణం ఉన్న ప్రాంతంలో సహజసిద్ధంగా వచ్చే ముప్పుతో పాటు మానవ తప్పిదాలు కారణమని తేల్చింది.



జోషీ మఠ్‌లో పగుళ్లిచ్చిన ఇల్లు, రోడ్డు


50 ఏళ్ల క్రితమే ప్రమాదం గుర్తించిన నిపుణులు

జోషీమఠ్ పూర్తిగా మునిగిపోతుందని 50 ఏళ్ల క్రితమే నిపుణులు అంచనా వేశారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో తరచూ వరదలు రావడానికి గల కారణాలు అన్వేషించడానికి ఏర్పాటు చేసిన మిశ్రా కమిటీ 1976లో ఇచ్చిన నివేదికలో జోషీమఠ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఈ విషయాన్ని ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న వృద్ధులు కథలుగా చెబుతున్నారు. జోషిమఠ్ కనుమరుగైపోతుందా అన్న ఆందోళనలో స్థానికులు దినమొక గండంగా బతుకుతున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఏమిటీ జోషీమఠ్ ?

హిమాలయాల్లోని ప్రకృతి అందాలకు నెలవు ఈ పట్టణం. చమోలి జిల్లాలో బద్రీనాథ్, హేమ్‌కుండ్ సాహిబ్ మధ్య 6 వేల అడుగుల ఎత్తులో జోషీ మఠ్ ఉంది. కేదార్‌నాథ్, బద్రీనాథ్ యాత్రికులకు స్వాగతం చెబుతున్నట్టుగా ఈ పట్టణం ఉంటుంది. జగద్గురు ఆదిశంకరాచార్యుడు ఎనిమిదో శతాబ్దంలో జోషీమఠ్‌లోనే జ్ఞానోదయం పొందారని ప్రతీతి. ఇప్పటికే అత్యధిక భూకంపం ముప్పు ఉన్న కేటగిరి జోన్-5లో ఈ ప్రాంతం ఉంది.



కుప్పకూలిన జోషిమఠ్ ఆలయం

జోషీమఠ్: హిమాలయాల్లో ఉన్న ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో ఓ ఆలయం శుక్రవారం సాయంత్రం కుప్పకూలింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని స్థానికులు చెప్పారు. ఆలయ గోడలు పగుళ్లు వారుతుండటంతో 15 రోజుల క్రితమే మూసివేసినట్లు చెప్పారు. సింగ్‌ధర్ వార్డులోని చాలా ఇళ్లు బీటలు వారుతుండటంతో 50 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అదేవిధంగా, అక్కడికి సమీపంలోనే ఉన్న జల విద్యుత్ కేంద్రంలో పనిచేసే 60 కుటుంబాలను కూడా మరో చోటికి తరలించారు. మర్వారీలోని జలాశయం బీటలు వారి నీరు ధారాళంగా మూడు రోజులుగా దిగువకు వస్తుండటంతో చాలా ఇళ్లు దెబ్బతిన్నాయి. చార్‌ధామ్‌లో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు, జల విద్యుత్ ప్రాజెక్టు పనులను, ఔలి రోప్ వే సేవలను నిలిపివేశారు. ఆ ప్రాంతంలో ఏడాది కాలంగా భూమి కుంగిపోతోంది. పక్షం రోజులుగా భూమి కుంగుబాటు మరీ ఎక్కువైంది.

సాక్షి
కరీంనగర్
శనివారం । 7 । జనవరి । 2023



రాజన్న సన్నిధిలో శివదీక్షలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో శుక్రవారం మండల శివదీక్షలు ప్రారంభమయ్యాయి. అర్చకుడు శంకరయ్య, గురుస్వాముల ఆధ్వర్యంలో 300 మంది దీక్ష చేపట్టారు.



డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్: డీటీఎఫ్ జిల్లాశాఖ క్యాలెండర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. రఘుశంకర్‌రెడ్డి, ఏనురెడ్డి, ఉమారాణి, తిరుపతి, తదితరులు ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
28.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ సాధారణంగా ఉంటుంది. చలితీవ్రత కొనసాగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

26 నాటికి కేబుల్‌బ్రిడ్జి సిద్ధం చేయాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్వీ.కర్ణన్

కరీంనగర్:ఈనెల 26 నాటికి కేబుల్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి కేబుల్ బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు పనులను పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, ఎక్కువమంది కూలీలతో రేయింబవళ్లు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ చందర్‌సింగ్, ఈఈ సాంబశివరావు, డీఈ రవీందర్, ఏఈ రాజశేఖర్ ఉన్నారు.

వలంటీర్లకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ మల్లేశ్

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): 26వ జాతీయ యువజన ఉత్సవాలకు శాతవాహన విశ్వవిద్యాలయ పరిధి నుంచి నలుగురు విద్యార్థులు వలంటీర్లుగా ఎంపికయ్యారు. ఈ యువజనోత్సవాలు ఈనెల 12 నుంచి 16వరకు కర్ణాటకలో జరుగుతాయి. దేశవ్యాప్తంగా సుమారుగా వెయ్యి మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి ఏ.మాధవి, ఎన్.సాయిలిఖిత, మహమ్మద్ హమ్మదుద్దీన్, జి.నరేశ్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.శకుంతల వెళ్తున్నారు.వీరిని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ మల్లేశ్ శుక్రవారం అభినందించారు.రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, జాతీయసేవా పథకం సమన్వయకర్త డాక్టర్ శ్రీవాణి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు ఉన్నారు.

సంక్రాంతికి 410 ప్రత్యేక బస్సులు

కరీంనగర్:సంక్రాంతి పండుగకు ప్రయాణికుల రద్దీదృష్ట్యా ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్ రీజియన్ నుంచి 410 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ వెల్లడించారు. శుక్రవారం ఆర్‌ఎం కార్యాలయంలో మాట్లాడుతూ రీజియన్ పరిధి లోని 11డిపోల నుంచి జేబీఎస్‌కు, జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 410 ప్రత్యేక బస్సులు నడపనున్నామని వెల్లడించారు. ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడిందని తెలిపారు.

క్వింటాల్ పత్తి ధర రూ.8,400

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర శుక్రవారం రూ.8,400 పలికింది. మార్కెట్‌కు 57వాహనాల్లో 576 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,400, మోడల్ ధర రూ.8,300, కనిష్ట ధర రూ.7,500గా పలికింది. గన్నీ సంచుల్లో 12మంది రైతులు 20క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.8,000, మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.6,000కు ఖరీదువ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా శని,ఆదివారాల్లో మార్కెట్ యార్డుకు సాధారణ సెలవులు ఉంటాయని, సోమవారం మార్కెట్‌లో క్రయ,విక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి గుగులోతురెడ్డి నాయక్ వివరించారు.

బాలికలకు మంచి అవకాశాలు



తిమ్మాపూర్(మానకొండూర్):బాలికల సాధికారత క్లబ్‌ల కార్యక్రమంలో భాగంగా తిమ్మాపూర్ కేజీబీవీలో సమ్మక్క–సారక్క బాలికా సాధికారత క్లబ్ 4వ సమావేశం శుక్రవారం నిర్వహించారు. చైల్డ్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ పాల్గొని బాలికలకు సంబంధించిన చట్టాలను వివరించారు. ఆపద ఉంటే 1098, 100, 181 నంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ దీప, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి

కరీంనగర్: హైదరాబాద్‌లో ఈనెల 8న రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగే రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వర్ణ రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో కవ్వంపల్లి అజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సదస్సుకు కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం..?

- ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు ఆధారంగా పోలీసుల నిర్ణయం
- పక్కపక్కనే అక్కాతమ్ముళ్ల సమాధులు
- పిల్లలను ఖననం చేసి దాదాపు రెండు నెలలు
- గంగాధర మిస్టరీ మరణాల్లో కొత్తకోణం

మమత శరీరంలో విషముంటే.. శవపరీక్షలు అనివార్యం



అమూల్య, అద్వైత్ సమాధులు



శ్రీకాంత్, మమత (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: సంచలనం సృష్టించిన కరీంనగర్ జిల్లాలోని గంగాధర మిస్టరీ కేసు మరో మలుపు తిరగనుంది. పోలీసులు అనుమానిస్తున్నట్లు ఇంటి పెద్ద వేముల శ్రీకాంత్ తన భార్యాపిల్లలపై విషప్రయోగం చేశాడని నిర్ధారణ అయితే.. పిల్లల మృతదేహాలకూ పోస్టుమార్టం తప్పేలా లేదు. డిసెంబరు 30న అర్ధరాత్రి వేముల శ్రీకాంత్ సోడియం హైడ్రాక్సైడ్ తీసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఇదే విషయాన్ని చికిత్స సమయంలో వైద్యులకు చెప్పాడు. ఈ పరిణామంతో పోలీసుల దర్యాప్తు అకస్మాత్తుగా శ్రీకాంత్ వైపు తిరిగింది. శ్రీకాంత్ బయోటెక్నాలజీలో పీజీ చేయడం.. ఫుడ్ సైన్స్ లెక్చరర్ కావడం.. రోజూ ప్రయోగాల కోసం ల్యాబ్‌లో రసాయనాలు వినియోగించడం.. వెరసీ అతనికి కెమికల్స్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల తరహాలోనే తానూ రక్తపువాంతులు, విరోచనాలు చేసుకుని మరణించడంతో వారి శరీరంలోనూ సోడియం హైడ్రాక్సైడ్ చేరిందా..? అనే సందేహాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఫోరెన్సిక్ అధికారులు మమత శరీరంలో ఆర్సెనిక్ ఆనవాళ్లు ఉన్నాయని ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయాన్ని నిర్ధారించుకునేందుకు వారు మరింత లోతుగా రసాయన విశ్లేషణ జరుపుతున్నారు. త్వరలోనే ఈ విషయంపై ఎఫ్‌ఎస్‌ఎల్ తుది నివేదిక పంపితే.. మమత మరణానికి స్పష్టమైన కారణం తెలియనుంది.

45 రోజుల్లో నలుగురు

ఈ ఘటనల్లో తొలుత శ్రీకాంత్ కొడుకు అద్వైత్ (20నెలలు)వాంతులు, విరోచనాలతో అనారోగ్యానికి గురై నవంబరు 16న కన్నుమూశాడు. అవే లక్షణాలతో కూతురు అమూల్య (6) డిసెంబర్ ఒకటిన ప్రాణాలు విడిచింది. ఈ రెండు మరణాలకు వైద్యులు కారణాలు చెప్పలేకపోయారు. అంతుచిక్కని వ్యాధి, కలుషిత తాగునీరు కారణమనుకుని సమీపంలోని బావిలోని తాగునీటిని, బాధితుల బంధువుల రక్తాన్ని పరీక్షించారు. అయినా వారికి ఏమీ చిక్కలేదు. దీంతో మిస్టరీ మరణాలు చేతబడి, మంత్రాల కారణంగా జరుగుతున్నాయన్న ప్రచారం కూడా జరిగింది. శ్రీకాంత్ భార్య మమత (26) కూడా అనారోగ్యానికి గురై డిసెంబరు 18న మరణించింది. డిసెంబరు 30న శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. 45 రోజుల వ్యవధిలో మొత్తం కుటుంబం అనుమానాస్పద స్థితిలో తుడిచిపెట్టుకుపోయింది.

మమత శరీరంలో ఆర్సెనిక్..! మరి పిల్లల్లో..?

పోలీసుల వినతి మేరకు మమత పోస్టుమార్టం సమయంలో వైద్యులు విస్రా (శరీరంలోని కీలక అంతర్భాగాలు)ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మమత శరీర భాగాల్లో ఆర్సెనిక్ ఆనవాళ్లను గుర్తించారు. దీన్ని పోలీసులు ఇంకా ధ్రువీకరించాల్సి ఉంది. ఒకవేళ ఇదే నిజమైతే.. ఆమె శరీరంలోకి ఎలా చేరింది..? పిల్లల మరణాలకు కారణం ఆర్సెనికా..? లేదా సోడియం హైడ్రాక్సైడా..? అనే విషయాన్ని పోలీసులు ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. పిల్లలిద్దరూ అనారోగ్య లక్షణాలతో మరణించారని వారికి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఇపుడు వారి మరణంపై అనేక సందేహాలు వెలుగులోకి రావడంతో వారి శవాలకు పోస్టుమార్టం తప్పనిసరి కానుంది. అందుకే పిల్లల శరీర భాగాల నుంచి విస్రా (అంతర్భాగాల నుంచి నమూనాలు)ను తీసుకోవాల్సి ఉంటుంది.

రెండు నెలల అనంతరం..

నవంబరు 16న 20 నెలల అద్వైత్ అనుమానాస్పదంగా మరణించాడు. అతడిని గంగాధర శివారులోని వంతెన సమీపంలో ఖననం చేశారు. డిసెంబరు ఒకటిన అమూల్య (6) కూడా కన్నుమూసింది. దీంతో తమ్ముడి సమాధి పక్కనే అక్కనూ ఖననం చేశారు. వీరిలో అద్వైత్ మరణించి 50 రోజులు, అమూల్య చనిపోయి 35 రోజులు దాటింది. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టు రావడానికి వారం పట్టవచ్చని పోలీసులు అంటున్నారు. ఒకవేళ మమత శరీరంలో విష ఆనవాళ్లు ఉంటే పిల్లల మరణాలకు కారణం తెలుసుకోవాల్సి ఉంటుంది. అదే నిజమైతే.. పిల్లలు మరణించిన దాదాపు రెండు నెలల అనంతరం పోస్టుమార్టం చేయాల్సి వస్తుందని పలువురు సీనియర్ పోలీసు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

గంగాధర రెవెన్యూ అవినీతిపై నివేదిక

- కలెక్టర్‌కు సమర్పించిన అడిషనల్ కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గంగాధర రెవెన్యూ అధికారుల అవినీతిపై విచారణ పూర్తయింది. మండలంలో వ్యవసాయ భూముల విషయంలో తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు వసూళ్ల పర్వాన్ని 'సరసమైన ధరలకే విరాసత్' అన్న శీర్షికన 'సాక్షి' గురువారం వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఫోన్ పే ద్వారా రూ.1.50 లక్షల లంచాన్ని ఆర్‌ఐ, వీఆర్‌ఏ వసూలు చేసిన వైనాన్ని ఆధారాలతో సహా 'సాక్షి' ప్రచురించడం సంచలనం రేపింది. ఈ కథనంపై కలెక్టర్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ విచారణ చేపట్టారు. గురువారం ఫిర్యాదుదారుడితోపాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌ఏలు హాజరయ్యారు. ఇరుపక్షాల నుంచి వివరణ తీసుకున్న అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ నివేదికను శుక్రవారం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు పంపారు. దీనిపై కలెక్టర్ ఏం నిర్ణయం తీసుకుంటారో అని ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికల సామగ్రి పరిశీలన

కరీంనగర్ అర్బన్: ఎన్నికల సామగ్రిని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ పరిశీలించారు. శుక్రవారం నగరంలోని ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ఈవీఎం గోడౌన్‌కు ఎన్నికల సామగ్రి రాగా పటిష్ట భద్రత నడుమ భద్రపరిచారు. ప్రతి పరికరాన్ని స్కానింగ్ చేసి వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, ఆర్డీవో ఆనంద్‌కుమార్, ఆయా పార్టీల ప్రతినిధులు అఖిల్, శ్రీనివాస్,రమణారెడ్డి, వాసుదేవారెడ్డి, మోహన్‌చారి, సురేశ్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ మహా సమ్మేళనం విజయవంతం చేయండి



జమ్మికుంట(హుజూరాబాద్): ఈనెల 7వ తేదీన నిర్వహించే బీజేపీ పార్టీ బూత్‌స్థాయి మహాసమ్మేళనం విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మికుంట పట్టణంలో సమ్మేళనానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాలైన కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూర్, చొప్పదండిలో కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ శ్రేణులు, బూత్‌కమిటీ, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేయనున్నట్లు వివరించారు.రాష్ట్రస్థాయి నుంచి పోలింగ్ బూత్ స్థాయి బాధ్యుల వరకు సమావేశానికి హాజరుకావాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాడ గౌతంరెడ్డి, మాడుగుల ప్రవీణ్, జెల్ల సుధాకర్, జీడీ మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా అర్చక పరీక్షలు



కరీంనగర్‌కల్చరల్: దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలో ఆగమ, అర్చక విభాగాల్లో కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కల్యాణమండపంలో నిర్వహించిన పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహసీల్దార్ డి. శ్రీనివాస్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. దేవాదాయ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్, పరీక్షల నోడల్ అధికారి ఆకునూరి చంద్రశేఖర్ పరీక్షలను పర్యవేక్షించారు. పరీక్షకు 365 అభ్యర్థులకుగాను 305మంది హాజరు అయ్యారని తెలిపారు. శనివారం వీరికి మరో పరీక్ష నిర్వహించనున్నారు.

నష్టపరిహారం ప్రకటిస్తేనే భూములిస్తాం

- జాతీయ రహదారి భూసేకరణ సభలో రైతుల డిమాండ్
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లిస్తామన్న ఆర్డీవో



అధికారులతో రైతుల వాగ్వాదం

కరీంనగర్‌రూరల్: జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు నష్టపరిహారం ఎంత చెల్లిస్తారో ముందుగా ప్రకటిస్తేనే భూములిస్తామని కరీంనగర్ మండలం నగునూరుకు చెందిన పలువురు రైతులు తేల్చిచెప్పారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారి–563 నిర్మాణంతో భూములు కోల్పోతున్న నగునూరు రైతులతో అధికారులు సమావేశం నిర్వహించారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని భూసేకరణ విభాగం అధికారి రామస్వామి తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర ఆధారంగా పరిహారం చెల్లించాలని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ముందుగా నష్టపరిహారం ఎంత చెల్లిస్తారో చెప్పాలని డిమాండ్‌చేశారు. పరిహారం ప్రకటిస్తేనే భూములిస్తామని, సంతకాలు చేయమని తేల్చిచెప్పడంతో అధికారులు ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు సమాచారమిచ్చారు. సర్పంచు ఉప్పుల శ్రీధర్ ఆధ్వర్యంలో కొంతమంది రైతులతో ఆర్డీవో చర్చించారు. మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. ఆర్‌ఐ రజనీకాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం ప్రకటించాలి



నాకు 2ఎకరాల 15గుంటలుంది. రోడ్డుకింద మూడున్నర గుంటలు పోతుంది. ఇక్కడ గుంటకు రూ. 2లక్షల ధర ఉంది. అధికారులు ఎంత నష్టపరిహారం ఇస్తారో చెప్పడం లేదు. ముందుగా పరిహారం విషయం తేల్చి చెప్పితే బాగుంటుంది.

– అమిశెట్టి అంజయ్య, రైతు, నగునూరు

భూముల విలువ ప్రకారం పరిహారం

జాతీయ రహదారి నిర్మాణానికి కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి, గంగాధర, రామడుగు మండలాల్లో మొత్తం 303.64 ఎకరాలను భూసేకరణ ద్వారా రైతుల నుంచి సేకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఆయా గ్రామాల్లోని భూముల విలువ ఆధారంగా రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుంది. జనరల్‌అవార్డు కింద భూములను సేకరిస్తున్నాం. రైతులు పరిహారం తీసుకోకుంటే ప్రభుత్వం కోర్టులో డిపాజిట్ చేస్తోంది.

– ఆనంద్‌కుమార్, ఆర్డీవో కరీంనగర్

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

కరీంనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆశ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ.. దేశంలో కోటి మంది స్కీమ్‌వర్కర్స్ ఐసీడీఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఉపాధి హామీ పథకం, సర్వశిక్షా అభియాన్, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం తదితర సేవలు అందిస్తున్నారని అన్నారు. వీరిని కార్మికులుగా గుర్తించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇరు ప్రభుత్వాల మొండివైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం కల్పిస్తామని అన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు శారద, ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత, విజయలక్ష్మి, వెంకటలక్ష్మీ, శంకరమ్మ, సుమ, శోభ, తదితరులున్నారు.

కాలానుగుణ నైపుణ్యంతోనే పశు సంతతి వృద్ధి



శిక్షణలో పాల్గొన్న అధికారులు

కరీంనగర్ అర్బన్: కాలానుగుణంగా వైద్యంలో వస్తున్న మార్పులను అవపోసన పట్టినపుడే గో పునరుత్పత్తి సాధ్యమని ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం ఏడీ డా.లింగారెడ్డి అన్నారు. 15 జిల్లాలకు చెందిన పశువైద్యులు, ప్రత్యేక బోధన సిబ్బందికి గో పునరుత్పత్తి ఉచిత చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. గోశాల నిర్వహణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. గోజాతి నిర్ధారణ, పునరుత్పత్తి సమస్యల నిర్ధారణ, నివారణ చర్యలతో పాటు ఆవు పాల విక్రయ విధానాలను వివరించారు. గోశాల నిర్వాహకులకు తగు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక బోధన నిపుణులు డా.జి.విజయకుమార్ శర్మ, డా.రాజిరెడ్డి, శిక్షణ కేంద్రం అధ్యాపకులు డా.ఎం.కోటేశ్వర్‌రావు, డా.సి.హెచ్.సాయిచైతన్య, డా.దివ్య, గోశాల నిర్వాహక బృంద సభ్యులు పుల్లూరి రామారావు, రాజేందర్‌రెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

- వేతనాలు రావు.. పెన్షన్లు లేవు
- బడ్జెట్ విడుదలకు అనుగుణంగానే కొనసాగుతున్న చెల్లింపులు
- ఆలస్యంగా ఉద్యోగుల బిల్లులు

ఫ్రీజింగ్.. ఫ్రీజింగ్!

కరీంనగర్: జిల్లాలో ఖజానా చెల్లింపులకు ఫ్రీజింగ్ గండం తప్పడం లేదు. అభివృద్ధి పనుల ప్రాధాన్యత క్రమంలోనే బిల్లుల చెల్లింపులు చేస్తున్నారు. ఉద్యోగులకు అవసరమైన చెల్లింపుల్లోనూ ఇదే విధానం పాటిస్తున్నారు. 1వ తేదీన ఇవ్వాల్సిన వేతనాలు, పెన్షనర్లకు 10వ తేదీ వరకు చెల్లింపులు జరుగుతూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి బిల్లులు, కాంట్రాక్టర్ల బిల్లుల బకాయిలు దాదాపు రూ.2కోట్లకు పైబడి ఉన్నట్లు సమాచారం. జిల్లా ట్రెజరీశాఖ పరిధిలో సుమారు 9వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, 12వేల మందికిపైగా పెన్షన్‌దారులు, వేతన ఫించన్‌ఖాతాదారులు ఉన్నారు.

- జీతభత్యాలు, భవిష్యనిధి, కార్యాలయాల నిర్వహణ, అద్దెలు, వాహన కిరాయిలు, టెలిఫోన్, విద్యుత్ బిల్లులు, వైద్య ఖర్చులు, తదితర ఖర్చుల బిల్లుల కోసం కలెక్టరేట్‌లోని ట్రెజరీకి వస్తుంటారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ జీపీఎఫ్ వేతన స్థిరీకరణ బకాయిల బిల్లులు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని ఆయా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వెంటనే చెల్లించాలని అంటున్నారు.
- అత్యవసర బిల్లులకు వారం నుంచి 15 రోజుల సమయం పడుతోంది. రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తున్న విధంగానే ఉద్యోగుల బిల్లులను క్లియర్ చేస్తున్నారు. ఆర్థికశాఖ నుంచే బిల్లులను ఉద్యోగుల అకౌంట్లలో జమ చేస్తున్నారు.
- జిల్లా పరిధిలో ప్రభుత్వ బిల్లుల చెల్లింపులపై గత కొన్ని నెలలుగా ఫ్రీజింగ్ కొనసాగుతోంది. ప్రతీ బిల్లు 15నుంచి నెల రోజుల వరకు సమయం పడుతోంది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ చెల్లింపులు, ఇతర బిల్లులు చెల్లింపుల్లోనూ నిధుల లేమి కారణంగా ఆలస్యమవుతోంది.
- జిల్లా పరిధిలోని సబ్ ట్రెజరీ, జిల్లాల ట్రెజరీ కార్యాలయాల్లో ఎప్పటికప్పుడు వచ్చిన బిల్లులను జనరేట్ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో అదేరోజు అప్‌లోడ్ చేస్తున్నారు. బిల్లుల స్టేటస్‌ను ఉద్యోగులకు పంపిస్తున్నారు. ఈ బిల్లులను ఆర్థికశాఖ అధికారులు ప్రాధాన్యత క్రమంలో చెల్లింపులు చేస్తున్నారు.
- ఉద్యోగులకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్‌లో జనరేట్‌కాగానే ఆ బిల్లు ఎక్కడెక్కడ ఉందో ఎప్పుడు చెల్లిస్తారో వారి మొబైల్‌కు సమచారాన్ని పంపిస్తున్నారు. ఆయా శాఖలకు బడ్జెట్ రిలీజ్ కాగానే చెల్లింపులు చేస్తున్నారు. జిల్లా ట్రెజరీ అధికారులకు కూడా ఏయే బిల్లులను ఏ రోజు చెల్లిస్తున్నారో ఆర్థికశాఖ నుంచి సమాచారాన్ని అందిస్తున్నారు.
- పలుశాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు, కాంట్రాక్టర్‌లకు రొటేషన్ పద్ధతిలో ఈ చెల్లింపులు చేస్తున్నారు. గతంలో ఈ బిల్లుల చెల్లింపునకు పనులు పూర్తి కాగానే 15నుంచి నెల రోజుల్లో చెల్లింపులు జరుగగా ప్రస్తుతం రెండు నుంచి మూడు నెలల వరకు సమయం పడుతోంది. ఉద్యోగులు తమకు త్వరగా చెల్లింపులు చేస్తే అవసరాలకు ఉపయోగపడుతాయని, మెడికల్ బిల్లులను ఆపకుండా చూడాలని కోరుతున్నారు.



జిల్లా ట్రెజరీ కార్యాలయం

ఆర్థిక శాఖ క్లియరెన్స్‌తో..



ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన బిల్లులు ఎప్పటికప్పుడు వెంటనే ఆమోదం తెలుపుతూ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వడంతోనే ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వచ్చిన బిల్లులను వెంటనే పంపుతున్నాం. ఉద్యోగుల బెనిఫిట్స్‌కు సంబంధించిన బిల్లులను పెండింగ్ లేకుండా పంపిస్తున్నాం. – నాగరాజు, జిల్లా ట్రెజరీ అధికారి, కరీంనగర్

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో ఫర్టిలైజర్ షాపు దగ్ధం

- దాదాపు రూ.3 లక్షల నష్టం



ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని సీఎస్‌సీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. బాధితుడి వివరాల ప్రకారం.. కొత్త రమేశ్ గురువారం రాత్రి తన షాపు మూసివేసి, ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు దుకాణంలో నుంచి పొగలు రావడాన్ని వాకింగ్‌కు వెళ్లినవారు గమనించారు. రమేశ్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే వచ్చి, షట్టర్ తెరిచి, విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ఈ ప్రమాదంలో షాపులోని మందుల డబ్బాలు కాలిపోయాయని తెలిపాడు. దాదాపు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



కమాన్‌పూర్(మంథని): ఖమ్మంలో ఈ నెల 7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పి.సాయిచరణ్, కె.రాంచరణ్ ఎంపికయ్యారు. విద్యార్థులను ఎంఈవో సంపత్‌రావు, పీడీ కృష్ణ, టీచర్లు అభినందించారు.

సౌత్‌జోన్ స్థాయి పోటీలకు..

జగిత్యాల: స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న సీహెచ్. రాహుల్ శాతవాహన యూనివర్సిటీ తరఫున సౌత్‌జోన్ ఖోఖో పోటీల కు ఎంపికయ్యాడు. ఈనెల 9 – 12 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అరిగెల అశోక్, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, పీడీ రవికుమార్ విద్యార్థిని అభినందించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: విదేశాల్లో చదివే మైనార్టీ విద్యార్థులకు సీఎం ఓవర్‌సీస్ పథకం కింద ఉపకార వేతనాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మెహరాజ్ తెలిపారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియా దేశాల్లోని యూనివర్సిటీల్లో 2022 ఆగస్టు–2022 డిసెంబర్‌లోగా ప్రవేశం పొందినవారు ఉపకార వేతనాలు లేదా ఆర్థికసాయం పొందేందుకు అర్హులన్నారు. ఈ నెల 23 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు జతల జిరాక్సు ప్రతులను జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనాలు లేదా ఆర్థికసాయంతో పాటు రెండు విడతల్లో రూ.60వేల వరకు విమాన చార్జీలు చెల్లిస్తారని పేర్కొన్నారు.

కలుషిత నీటితో విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులను పరామర్శిస్తున్న ఆగయ్య



వివరాలు తెలుసుకుంటున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

- 29 మందిని సిరిసిల్ల ఆస్పత్రికి తరలింపు
- 25 మంది డిశ్చార్జ్.. నలుగురికి ప్రత్యేక వైద్యం
- ఆందోళనలో తల్లిదండ్రులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/సిరిసిల్ల టౌన్: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 29 మంది శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. కలుషిత నీటితో చేసిన భోజనం తినడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురికాగా సమాచారం అందుకున్న తహసీల్దార్ జయంత్‌కుమార్ స్థానిక వైద్యసిబ్బందిని అప్రమత్తం చేసి ప్రథమ చికిత్స అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో మొత్తం 95 మంది విద్యార్థులు చదువుకుంటుండగా అందులో 29 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో నలుగురు విద్యార్థులు శరవున్ లిల్లి, బి.దివ్య, డి.శ్రీజ, గనగోని శ్రీనివాని తీవ్ర అస్వస్థతకు గురికాగా వారికి వైద్యులు వైద్యం అందిస్తున్నారు. ఈ సంఘటనపై తల్లిదండ్రులు పాఠశాల ముందు నిరసన తెలిపారు.

సంపులో నింపిన నీటితో వంటలు

పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా నీటి సంపుతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తయారీ రోజూ భగీరథనీటితోపాటు ఫిల్టర్‌వాటర్‌ను ఉపయోగిస్తారు. రెండు రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్కూల్‌కు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన సంపులో శుక్రవారం ఉదయం ట్యాంకర్ ద్వారా నీటిని నింపారు. సంపులో నింపిన నీటితోనే నిర్వాహకులు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేశారు. ఆ భోజనం తిన్న 29 మంది విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు పాపయ్య, విద్యార్థుల పరిస్థితిపై స్థానిక వైద్యాధికారులకు, తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విద్యార్థులను సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. 25 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, నలుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యులు వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు తెలిపారు. 25 మందికి వైద్యం అందించి ప్రత్యేక వాహనంలో ఇంటికి పంపించినట్లు తెలిపారు.

వైద్యుల పర్యవేక్షణలో నలుగురు

తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు విద్యార్థులకు జిల్లా వైద్యాధికారి పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థులను డీఈవో రాధాకిషన్, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంఈవో రఘుపతి, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎస్సై శేఖర్ పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రి ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా చేయగా పోలీసులు అదుపులోకి తీసుకుని, స్టేషన్‌కు తరలించారు.

దొంగపై పీడీయాక్టు.. 'చర్లపల్లి'కి తరలింపు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని గ్యాస్ ఏజెన్సీలో రెండుసార్లు చోరీ తదితర ఘటనల్లో దొంగపై పోలీసులు పీడీయాక్టు అమలు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సమృద్ధి గ్యాస్ ఏజెన్సీలో కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరుకు చెందిన బత్తిని తిరుపతి సిలిండర్ల డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. డబ్బులు ముట్టజెప్పడంలో తేడాలు రావడంతో యజమానులు అతడిని పనిలో నుంచి తీసివేశారు. దీంతో వారిపై కోపం పెంచుకున్న తిరుపతి గ్యాస్ గోదాంలోని 280 సిలిండర్లను తన స్నేహితుడు కట్కూరి రాజశేఖర్ సహాయంతో దొంగిలించాడు. యజమానులు రాజిరెడ్డి, సయ్యద్ మెరాజ్ అహ్మద్‌లపై పగ తీర్చుకోవాలని ఉత్తరప్రదేశ్ వెళ్లి, రెండు తపంచాలు కొనుగోలు చేశాడు. గతేడాది నవంబర్ 11న హనుమాన్‌నగర్‌లోని గ్యాస్ ఏజెన్సీలో యజమానులను చంపడానికి వెళ్లాడు. ఆ సమయంలో వారు లేకపోవడంతో సిబ్బందిని బెదిరించి, రూ.34,875 ఎత్తుకెళ్లాడు. గతంలోనూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఒక కేసులో అరెస్టయ్యాడు. చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో కరీంనగర్ పోలీసులు శుక్రవారం అతనిపై పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత ఉత్తర్వులను మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తిరుపతికి జైలర్ రమేశ్ సమక్షంలో అందించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. పీడీయాక్టు అమలు చేయడంలో కీలకపాత్ర పోషించిన సీఐ రాజ్‌కుమార్, పీడీ సెల్ ఇన్‌చార్జి పందిరీలను సీపీ సత్యనారాయణ అభినందించారు.



పీడీయాక్టు ప్రతులు అందిస్తున్న సీఐ రాజ్‌కుమార్

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



అవార్డు అందుకుంటున్న లలితారావు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు లలితారావు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. మంచిర్యాలలో వెలుగు ఫౌండేషన్ లుక్స్ బ్యూటీ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన బ్యూటీ కాంపిటీషన్‌లో ఆమె పాల్గొని, 30 మంది మహిళలకు 30 నిమిషాల్లో ఇన్‌స్టంట్ ఫేషియల్ గ్లో చేశారు. దీంతో ఇంటర్నేషియల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. లలితారావుకు తెలంగాణ స్టేట్ కో–ఆర్డినేటర్ మడపు రాంప్రకాశ్ చేతులమీదుగా అవార్డు అందజేశారు.

ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి పథకం

- జిల్లాకు మూడు యూనిట్లు మంజూరు
- ఈ నెల 20వరకు దరఖాస్తుల స్వీకరణ

పెద్దపల్లిరూరల్: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాకు మూడు యూనిట్లను మంజూరు చేసింది. ఆసక్తి, అర్హతగల ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. స్వయం ఉపాధి పథకం కింద వ్యవసాయానుబంధ పరిశ్రమలు, సేవా వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే ట్రాన్స్‌జెండర్‌లు కలెక్టర్ జారీ చేసిన గుర్తింపు కార్డు లేదా కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. నేషనల్ పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి.

తెలంగాణకు చెందినవారై ఉండి 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు గలవారై ఉండాలి. దరఖాస్తుదారు ఆధార్‌కార్డుతో పాటు రుజువు సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జతపర్చాలి. గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.2లక్షలకు మించకుండా తహసీల్దార్ ధ్రువీకరించిన ఆదాయ సర్టిఫికెట్ జతపర్చాలి.

వినియోగించుకోవాలి

ప్రభుత్వం సంక్షేమ శాఖ ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తోంది. ఈ సారి జిల్లాకు మూడు యూనిట్లు మంజూరు చేశారు. ఆసక్తి, అర్హత గల వారు వినియోగించుకోవాలి. మరిన్ని వివరాలకు 94408 52495, 99856 99702 నంబర్లలో సంప్రదించాలి.

– రవుఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖాధికారి

రైతులకు గుదిబండలా ధరణి పోర్టల్



కండువా కప్పుతున్న నగేశ్

విద్యానగర్(కరీంనగర్): ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ రైతులకు గుదిబండలా మారిందని, వెంటనే దాన్ని ప్రక్షాళన చేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ధరణి పోర్టల్ కారణంగా నానాతంటాలు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎండీ.అజార్ హుస్సేన్, ఎండీ.దావూద్, డి.రాజు తదితరులు వైఎస్సార్‌టీపీలో చేరగా వారికి కండువాలు కప్పి, ఆహ్వానించారు. రాష్ట్ర నాయకులు డాక్టర్ శివరాం, మహిళా విభాగం కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు రజితారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు తరలిరండి



మాట్లాడుతున్న లక్ష్మణ్

కరీంనగర్: భారత రాజ్యాంగ పరిరక్షణ జిల్లా సదస్సుకు తరలిరావాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి తాళ్లపెల్లి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సమితి ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, బహుజన వర్గాలకు చెందిన ప్రజలు అన్ని రంగాల్లో వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో భారత రాజ్యాంగం–దళిత ఆర్థిక పరిస్థితులు అనే అంశంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు బోయిని తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక పాలకులపై పోరాడాలి



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

కరీంనగర్: ప్రజావ్యతిరేక పాలకులపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో గుడికందుల సత్యం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. బీజేపీ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ తెలంగాణలో బలపడాలని చూస్తోందని ఆరోపించారు. దేశభక్తి ముసుగులో సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎన్నికలకు పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి రూ.3,016 ఇస్తామని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిందన్నారు. తర్వాత వాటిని విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరణిలోని భూ సమస్యలను పరిష్కరించాలని, కొత్తగా పెన్షన్, రేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుంద రెడ్డి, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులున్నారు.

'కార్మికులకు జాతీయ సంఘాల ద్రోహం'



మాట్లాడుతున్న సత్యనారాయణ

గోదావరిఖని(రామగుండం): 11వ వేతన ఒప్పందంలో జాతీయ సంఘాలు కార్మికులకు ద్రోహం చేశాయని టీఎన్‌టీయూసీ నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక వాడలకు మంచి నీరందించడంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. క్వార్టర్ల రిపేర్, శానిటేషన్‌ను పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందన్నారు. గనుల్లో సమస్యలపై ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు కోటగిరి పాపయ్య, సంగెం రాజు, నగునూరి రాజయ్య, ఎండీ.వాజిద్, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



మురళి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి(జూనియర్ ఆడిటర్) తాడబోయిన మురళి నేషనల్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ టోర్నమెంట్స్ 2022–23లో పాల్గొనే అవకాశం దక్కింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 13 మంది ఉద్యోగులు ఎంపిక కాగా, ఈ బృందంలో ఉమ్మడి కరీంనగర్ నుంచి మురళి ఒక్కడే ఎంపికవడం గమనార్హం. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగాల్లో ప్రతిభ చాటాడు. ఈనెల 5 నుంచి 7 వరకు ఢిల్లీలో జరుగుతున్న జాతీయ పోటీల్లో పాల్గొంటున్నాడు. కాగా, మురళికి మణికట్టు లేకపోయినా ఆత్మవిశ్వాసంతో స్విమ్మింగ్‌లో రాణిస్తున్నాడు.

పని స్థలాల్లో రక్షణ చర్యలు తీసుకోండి

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్



మాట్లాడుతున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. శుక్రవారం వకీల్‌పల్లి గనిని సందర్శించి, ఉత్పత్తి, రక్షణపై ఉద్యోగులతో మాట్లాడారు. పని స్థలాలను సర్వే మ్యాప్ ద్వారా పరిశీలించారు. గనిలోకి దిగి, గోఫ్ ఏరియాలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. అందరూ సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కూడా పాటించాలని సూచించారు. గత నెలలో వకీల్‌పల్లి గని 145 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినందున ఉద్యోగులను అభినందించారు. రాబోయే రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో ముందుకుసాగాలని చెప్పారు. జీఎం వెంట రక్షణ అధికారి రవీందర్, మేనేజర్ రవికిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్రశేఖర్, సర్వే అధికారి అఫ్సర్‌పాషా, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, సంక్షేమాధికారి ఓంకారిబాబు తదితరులున్నారు.

హక్కుల సాధనలో టీబీజీకేఎస్ విఫలం

- ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ సమ్మయ్య



మాట్లాడుతున్న సమ్మయ్య

గోదావరిఖని(రామగుండం): కార్మికుల హక్కుల సాధనలో టీబీజీకేఎస్ విఫలమైందని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ సమ్మయ్య ఆరోపించారు. శుక్రవారం ఓసీపీ–1లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందన్నారు. పలు విభాగాలు ప్రైవేటుపరం అవుతున్నాయని పేర్కొన్నారు. 11వ వేతన ఒప్పందాన్ని పోరాడి, సాధించుకునామని, ఆమోదయోగ్యమైన వేజ్‌బోర్డు ఒప్పందం జరిగిందని తెలిపారు. ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ డీటీరావు ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌లో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు, నాయకులు జూపాక రాంచందర్, రమణయ్య, రాజయ్య, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

ఆస్తుల రక్షణలో చెక్‌పోస్టుల పాత్ర కీలకం

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ



చెక్‌పోస్టును ప్రారంభిస్తున్న జీఎం నారాయణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఆస్తుల రక్షణలో చెక్‌పోస్టుల పాత్ర కీలకమని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. శుక్రవారం సెంట్రల్ నర్సరీ మూలమలుపు వద్ద నూతన చెక్‌పోస్టును ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పడిన జీడీకే–5 ఓసీపీతో రహదారి మళ్లింపు కారణంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా నిత్యం ఆర్జీ–2, 3 ఏరియాల్లోని ఓసీపీ–1, 3, జీడీకే–5 ఓసీపీల నుంచి వచ్చే బొగ్గు లారీలను ఖచ్చితంగా తనిఖీ చేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పుట్ట రమేశ్, సీఎంవోఏఐ ప్రతినిధి డేవిడ్, ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, సర్పంచ్‌లు రామగిరి లావణ్య, దాసరి రాయలింగు, ఫైనాన్స్ ఏజీఎం రామకృష్ణ, ఆడిట్ డీజీఎం రాజం, పర్సనల్ డీజీఎం సీహెచ్ లక్ష్మీనారాయణ, సీనియర్ పీవో సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

జ్యోతినగర్(రామగుండం): రవాణా రంగంలోని కార్మికులను ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రను చేపట్టిందన్నారు. ఖమ్మంలో ప్రారంభమైన జీపుయాత్ర ఈనెల 10న ఎన్టీపీసీ రామగుండం చేరుకుంటుందని వెల్లడించారు. యాత్రలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొనున్నారని పేర్కొన్నారు. ఆటో టాక్సీ, స్కూల్ బస్సులు తదితర విభాగాల్లో పని చేస్తున్న రవాణా కార్మికులకు ప్రభుత్వ నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆరోపించారు. డీజిల్ ధరలు, భరించలేని జరిమానాలు, వేధింపులు అనేక విధాలుగా కార్మికులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. పెట్రో ధరలు తగ్గించాలని, అర్హులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అధిక జరిమానాలు తగ్గించాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా ప్రత్యేక యాప్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జరుగనున్న రవాణా రంగ కార్మికుల యాత్రకు స్వాగతం పలికి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ తుంగపిండి మల్లేశ్, ఆటో యూనియన్ నాయకులు పూజారి రవిగౌడ్, మొగిలయ్య, నర్సింహులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం



పరుశరాములు పనిచేసిన ప్రదేశం (సర్కిల్‌లో)



పరుశరాములుగౌడ్ మృతదేహం

- పైనుంచి కింద పడి కాంట్రాక్ట్ కార్మికుడు మృతి
- నష్టపరిహారం కోసం కార్మికుల ఆందోళన



పరుశరాములు (ఫైల్)



కంపెనీ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో రడం పరుశరాములుగౌడ్ (48) అనే కాంట్రాక్ట్ కార్మికుడు మృతిచెందాడు. తోటి కార్మికులు, కార్మిక సంఘాల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పరుశరాములుగౌడ్ కంపెనీ క్రేన్ విభాగంలో దాదాపు 25 మీటర్ల ఎత్తులో పనిచేస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. హుటాహుటిన కంపెనీ అంబులెన్స్ ద్వారా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తిరిగి మృతదేహాన్ని కంపెనీ గేట్ వద్దకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సతీశ్ ఉన్నారు.

కార్మికుల ఆందోళన

కేశోరాంలో విధి నిర్వహణలో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు పరుశరాములు కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య ఆధ్వర్యంలో మృతుడి కుటుంబసభ్యులు, కార్మికులు కంపెనీ ప్రధాన గేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. బీజేపీ నాయకుడు కౌశికహరి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, కేశోరాం పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి, పాలకుర్తి వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, సర్పంచులు కట్టకోల వేణుగోపాలరావు, దుర్గం జగన్, ఈసాలతక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్, కన్నాల సింగిల్‌విండో మాజీ చైర్మన్ మల్క రామస్వామి, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్, తంగెడ అనిల్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని సంఘీభావం ప్రకటించారు. మృతుడి కుటుంబానికి రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సూర సమ్మయ్య హెచ్‌ఆర్ అధికారులతో చర్చలు నిర్వహించగా, కంపెనీ అధికారులు రూ.9.50 లక్షలు చెల్లిస్తామని తెలుపడంతో నాయకులు అంగీకరించలేదు. దీంతో ఆందోళన కొనసాగుతోంది.

క్లుప్తంగా

వాటర్ డిస్పెన్సర్ల వితరణ



కరీంనగర్: నగరంలోని వీరబ్రహ్మేంద్ర అనాథ ఆశ్రమం, మార్కెట్ యార్డు ఏరియాలోని ప్రభుత్వ అనాథ ఆశ్రమాలకు శుక్రవారం ఎల్ఐసీ క్లాస్–1 అధికారుల సంఘం ఆధ్వర్యంలో వాటర్ డిస్పెన్సర్లను వితరణ చేశారు. ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ సీనియర్ మేనేజర్ ప్రసాదరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సొంత లాభం కొంత మానుకొని సామాజిక బాధ్యతతో అధికారుల సంఘం మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు చలం, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, కార్యదర్శి ఆర్.సత్యనారాయణ, నిర్వాహక కార్యదర్శి రవీందర్, కార్యదర్శి సత్యనారాయణ, మల్లికార్జున శర్మ, బాల్‌రెడ్డి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నీల ముచ్చట్లు



కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో మాణికేశ్వర్‌నగరంలోని సీవీ కుమార్ ఇంటి దాబాపై శుక్రవారం 116వ ఎన్నీల ముచ్చట్లు జరిగాయి. కవి పుప్పాల శ్రీరాం రాసిన దీర్ఘ కవిత 1818ని ప్రముఖ రచయిత అన్నవరం దేవేందర్ ఆవిష్కరించగా.. దళిత సంకలనం 'చింధూనేల' పుస్తకాన్ని తెరవే రాష్ట్ర అధ్యక్షుడు గాజోజు నాగభూషణం ఆవిష్కరించారు. కవి బూర్ల వేంకటేశ్వర్లు రచన 'ఉపకారి' పుస్తకాన్ని శ్రీరాం ఆవిష్కరించారు. కవి రేగులపాటికి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు పీఎస్ రవీంద్ర, నడిమెట్ల రామయ్య, సరసిజ, ప్రభాకర్, గజేందర్‌రెడ్డి, విలాసాగరం రవీందర్, బసవేశ్వర్, ఖాలీద్, వడ్డేపల్లి రాజేశం, కూకట్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు నివాళి



సప్తగిరికాలనీ(కరీంనగర్): మాజీ ఎమ్మెల్సీ బాలకృష్ణ వర్ధంతిని కరీంనగర్‌లోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అప్రయత్న పదోన్నతి పథకం వంటి అనేక ఉపాధ్యాయ, ఉద్యోగ ప్రయోజన ఉత్తర్వులు అందించడంలో బాలకృష్ణ ఎనలేని కృషి చేసిశారన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నందికొండ విద్యాసాగర్, చింతపల్లి అశోక్‌రావు, అనిల్, ఖాజా, మంజూరలి లింగారెడ్డి, మల్లయ్య, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలువు.. నైపుణ్యాలతో సులువు

- మారుతున్న ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ
- ప్రతిభ గల విద్యార్థులకే కంపెనీల పట్టం
- వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ



గ్రూపు డిస్కషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

శాతవాహనయూనివర్సిటీ: కలలు కన్న కొలువులు కొట్టాలంటే కష్టపడక తప్పదు. మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకొని బరిలోకి దిగితేనే కోరుకున్న ఉద్యోగ సాధన సులభమవుతుంది. దీనికి తోడు కంపెనీలు కూడా ప్రతిభ గల విద్యార్థులకే పట్టం కడుతున్నాయి. కోర్సులు పూర్తవగానే కొలువు సాధించేందుకు కావల్సిన మెలకువలపై శిక్షణ తీసుకుంటున్నారు. విద్యార్థులు ఉద్యోగల సాధనకు కావాల్సిన మెలకువలు నేర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. టాస్క్ శిక్షణలో భాగంగా ఉద్యోగ సాధనకు కావాల్సిన పలు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనల్ స్కిల్, రెజ్యూమ్ సెట్టింగ్, గ్రూప్ డిస్కషన్, ప్రెజెంటేషన్ స్కిల్స్‌తో పాటు వివిధ నైపుణ్యాల్లో శిక్షణ తీసుకుంటున్నారు.

కోర్సు పూర్తికాగానే ఉద్యోగం



విద్యార్థులకు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే పాఠ్యాంశాలతో పాటు ఉద్యోగ సాధనకు కావాల్సిన మెలకువలు అవసరం. టాస్క్ ఆధ్వర్యంలో కళాశాలలో మూడు రోజుల సదస్సు జరుగుతుంది. విద్యార్థులు మెలకువలు నేర్చుకొని కోర్సులు పూర్తికాగానే ఉద్యోగం సాధించవచ్చు.

– డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల

ప్రతిభ గల వారి కోసం అన్వేషణ



ప్రస్తుతం అన్ని కంపెనీలు ప్రతిభ గల వారి కోసం అన్వేషిస్తున్నాయి. డిగ్రీ విద్యార్థులకు కోర్సులు పూర్తయిన తర్వాత బోలెడు అవకాశాలున్నాయి. కోర్సుల్లో పాఠ్యాంశాలతో పాటు మొదటి నుంచే నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. టాస్క్ ఆధ్వర్యంలో ఉద్యోగ సాధనకు కావాల్సిన అన్ని నైపుణ్యాలు నేర్పిస్తున్నాం.

– ఇంద్రకుమార్, టాస్క్ ట్రైనర్

శిక్షణ చాలా బాగుంది



టాస్క్ ఆధ్వర్యంలో మా కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ చాలా బాగుంది. మాకు తెలియని చాలా అంశాలను శిక్షణలో నేర్పించారు. వీటితో ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది.

– విభావరీ, ఎంబీఏ విద్యార్థిని

స్కిల్స్ నేర్పిస్తున్నారు



నేను ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న. మాకు డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాలు సాధించేందుకు కావాల్సిన ట్రెనింగ్‌ను కళాశాలలో అందిస్తున్నారు. 20పైగా రకాల స్కిల్స్ శిక్షణలో నేర్పిస్తున్నారు. కోర్సు పూర్తికాగానే ఉద్యోగం సాధిస్తాను.

– గాయత్రి, డిగ్రీ విద్యార్థిని

ఆత్మవిశ్వాసం పెరిగింది



టాస్క్ శిక్షణలో పాల్గొంటున్న. కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలంటే చాలా పోటీ ఉంటుంది. వాటిలో నెగ్గాలంటే అందరికంటే ఎక్కువ స్కిల్స్ ఉంటేనే సాధ్యపడుతుంది. అన్ని స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పుడు ఉద్యోగం సాధిస్తాననే ఆత్మవిశ్వాసం పెరిగింది.

– తేజ్‌బీర్ సింగ్, డిగ్రీ విద్యార్థి

ఆల్ ఇండియా వర్సిటీ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 9 నుంచి 12 వరకు జరుగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీల అథ్లెటిక్ పోటీలకు కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి వి.యువరాజు ఎంపికై నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా యువరాజును కళాశాల కరస్పాండెంట్ ఆగం రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, బండి శ్రవణ్ కుమార్, బండి సంపత్ కుమార్, రామేశ్వర్‌లతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి పనులు కొనసాగుతున్నందున శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు 11 కేవీ ఎల్లమ్మ బ్రిడ్జి ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, కోతిరాంపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

'పారమిత'లో ఆర్ట్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రసాదరావు

కొత్తపల్లి: పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగే వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను పారమిత విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు శుక్రవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చిత్రించిన 700కి పైగా కళాకృతులను ప్రదర్శించారు. మహిళా సాధికారత, ప్రకృతి, పర్యావరణం, వివిధ అంశాలపై వేసిన పెన్సిల్ స్కెచ్‌లు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ మాటలతో వ్యక్తపర్చలేని భావాలను ఆర్ట్ ద్వారా ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా ప్రస్ఫుటంగా వ్యక్తపర్చగలమని అన్నారు. కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు వీక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత పాఠశాలల డైరెక్టర్స్ అనూకర్‌రావు, ప్రసూన, వీయూఎం ప్రసాద్, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ సంజయ్ భట్టాచార్య, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయ కర్తలు రబింద్ర పాత్రో, లక్ష్మి దీప్తి, శ్రీలత, ఆర్ట్ టీచర్స్ అజయ్, బి.శ్రీలత ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రమేశ్

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల మూడు చట్టాలను రద్దు చేసి ఓఎస్‌హెచ్ కోడ్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీఐటీయూ) పిలుపు మేరకు ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా రూ.64 కోట్లు నిధులు భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఉన్నాయని,. వీటిని భవన నిర్మాణ కార్మికులకు వినియోగించకుండా లేబర్ డిపార్ట్‌మెంట్ మెయింటినెన్స్, అధికారుల జీతాలు, పాలకుల అడ్వర్టైజ్ కోసం వినియోగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా బిల్డింగ్–అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కదిరే రమేశ్, జిల్లా కోశాధికారి వట్టి జగదీశ్, జిల్లా ఉపాధ్యక్షులు సమ్మయ్య, నెల్లి కనకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రాజకుమారి, కవిత, వెంకన్న పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు

కరీంనగర్‌టౌన్: పార్టీ అభివృద్ధికి మహిళా మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ అన్నారు. శుక్రవారం జ్యోతినగర్‌లో మోర్చా అధ్యక్షురాలు కొమ్ము లావణ్యారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీజేపీ నగర పశ్చిమ జోన్ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పట్ల చిన్నచూపు చూస్తూ ఓట్ల కొరకే మహిళలను వాడుకుంటుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల కు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేశ శిల్ప, ఉపాధ్యక్షురాలు మామిడి చైతన్య, జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, జోన్ ప్రధాన కార్యదర్శి ఆలోచన, సింధుజ, సునీత, మాధవి, అనిత, లక్ష్మి, శోభ, దుర్గ భవాని, సరోజన పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఎస్సైగా చేరిన శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొమురయ్య, నగర అధ్యక్షుడు కమలాకర్, శ్రీధర్, రాంచంద్రం, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



పొంచి ఉన్న ప్రమాదం

కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రి ఎదురుగా గల పురాతమైన ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం వంగి ప్రమాదకరంగా ఉంది. పక్కన నూతన గద్దె నిర్మించినప్పటికీ మార్చమని కోరితే ఖర్చు అవుతుందని అధికారులు అంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరుగక ముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : నరేందర్, ఏడీఈ
సెల్ నంబర్ : 94408 11417

మంత్రి గంగుల కమలాకర్‌కు పలువురి పరామర్శ



మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే చిన్నయ్య



గంగుల కమలాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ వై.సునీల్‌రావు తదితరులు

కరీంనగర్: రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య బుధవారం మృతి చెందగా.. మంత్రిని శుక్రవారం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్దపల్లి, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ వై.సునీల్‌రావు, జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాద్‌రావు, లోక బాపురెడ్డిలు పరామర్శించారు. గంగుల మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మంత్రి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

రంగోత్సవ్‌లో మెరిశారు..

- డ్రాయింగ్, పెయింటింగ్, రైటింగ్ విభాగాల్లో పతకాలు
- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల సవారన్ విద్యార్థులు
- జాతీయస్థాయికి 13 మంది ఎంపిక



సాధించిన పతకాలతో విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని అందరూ అంటుంటారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, సాంస్కృతిక రంగం, డ్రాయింగ్ తదితర వాటిలో ఏదో ఒక దాంట్లో విద్యార్థులకు టాలెంట్ ఉంటుందని అది బయటకు వస్తే కానీ ఆ టాలెంట్ తెలవదని చెబుతుంటారు. అచ్చం అలానే జరిగింది. కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సవారన్ విద్యార్థులు నిరూపించారు. ముంబాయికి చెందిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్గనైజేషన్ వారు ఇటీవల జాతీయస్థాయిలో డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూన్, రైటింగ్‌తో పాటు పలు ఆర్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన సుమారు 57 మంది విద్యార్థులను పాఠశాల డ్రాయింగ్ టీచర్ కోడూరి సత్యనారాయణ సిద్ధం చేయగా 13 మంది జాతీయస్థాయికి ఎంపిక కావడం విశేషం. కాగా విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి తమ మేధస్సుకు పదును పెట్టి అద్వితీయమైన చిత్రాలను రంగురంగులతో దిద్ది పతకాలు సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 'సాక్షి' చిట్ చాట్..

పతకాలు సాధించిన విద్యార్థులు

పాక శ్రావణి, డోలి మహతిలు బంగారు పతకాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు సాధించగా.. ఏ.సిరిచందన, మధు, శరణ్య, కావ్య, ఎం.సిరిచందనలకు బంగారు పతకాలు, దాసరి కావ్యశ్రీ, జి అశ్విత, సీహెచ్ శ్రీవిద్య, అల్లం అక్షయ, ఎస్.వరుణ్ సందేశ్, ఎన్ గాయత్రిలు రజత పతకాలు సాధించారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలి. అప్పుడే వారు సమాజంలో నిలుదొక్కుకునేలా ఎదుగుతారు. ముంబాయి వారు నిర్వహించిన రంగోత్సవ పోటీల్లో పాఠశాల విద్యార్థులు రాణించడం సంతోషంగా ఉంది.

– సీహెచ్. రామమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

జాతీయ పోటీలకు సిద్ధం చేస్తున్నాం



పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూన్, రైటింగ్ విభాగాల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వారిని ఇప్పటినుంచే జాతీయ పోటీలకు సిద్ధం చేస్తున్నాం. జాతీయస్థాయిలో సైతం రాణించేలా మెరుగైన శిక్షణ అందిస్తున్నాం.

– కోడూరి సత్యనారాయణ, డ్రాయింగ్ టీచర్

భగత్‌సింగ్ చిత్రానికి స్పెషల్ ప్రైజ్



డ్రాయింగ్‌లో భగత్‌సింగ్, కార్టూన్‌లో డోరిమాన్ చిత్రాలతో పాటు రైటింగ్‌లో ఒక పేరాగ్రాఫ్ రాశా. డ్రాయింగ్‌లో వేసిన భగత్‌సింగ్ చిత్రానికి స్పెషల్ ప్రైజ్ వచ్చింది. సర్టిఫికెట్, మెమోంటో, గోల్డ్ మెడల్ రావడం హ్యాపీగా ఉంది. నేషనల్స్‌లో ఇంకా బాగా వేస్తా. – పి.శ్రావణి, 10వ తరగతి

టాటూస్‌లో గోల్డ్ మెడల్



టాటూస్ కాంపీటీషన్‌లో పాల్గొన్న. డ్రాగన్ టాటూను ఒక పేపర్ మీద వేశా. టాటూకు గోల్డ్ మెడల్ వచ్చింది. జాతీయస్థాయికి ఎంపికయ్యా. డ్రాయింగ్ టీచర్ నేర్పించిన మెలకువలతో పాటు యూట్యూబ్ ద్వారా ప్రాక్టీస్ చేశా.

– ఎస్.వరుణ్‌కుమార్, 8వ తరగతి

రైటింగ్‌లో అదరగొట్టా..



ఆర్ట్ కాంపిటీషనల్‌లో భాగంగా రైటింగ్ పోటీల్లో పాల్గొన్న. ఒక పేపర్ మొత్తం కాలీగ్రఫీలో ఆంగ్లంలో రాశా. లెటర్స్‌ను చాలా బాగా అందంగా ప్రింట్ మాదిరిగా రాయడంతో స్పెషల్ ప్రైజ్ వచ్చింది.

– డి.మహతి, 7వ తరగతి

జాతీయస్థాయిలో పతకం సాధిస్తా



జాతీయస్థాయి ఆర్ట్ పోటీల్లో కూడా బంగారు పతకం సాధించాలని ఉంది. కౌ బాయ్ ఎలా ఉంటాడో నా పెయింటింగ్ ద్వారా వేసి చూపించాను. బంగారు పతకం సాధించాను. చాలా హ్యాపీగా ఉంది.

– జి.గణేశ్, 6వ తరగతి

నేడు ఫిలింభవన్‌లో 'చిన్నితెర'

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి ఫిలింభవన్‌లో చిన్నితెర పేరుతో రెండు లఘు చిత్రాలు ప్రదర్శించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు పొన్నం రవిచంద్ర, లక్ష్మి గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన సినీ కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రైతేరాజు, ఆశా పాశం చిత్రాలు ప్రదర్శించబడుతాయని పేర్కొన్నారు.

సమాచారం

నేడు అభినందన సభ

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ కవి, రచయిత, అనువాదకులు, సినీ విమర్శకులు వారాల ఆనంద్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించిన సందర్భంగా శనివారం భగత్‌నగర్‌లోని భగవతి పాఠశాలలో సాహితీగౌతమి కరీంనగర్, భగవతి పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు సాహితీగౌతమి అధ్యక్ష, కార్యదర్శులు గంద్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు సన్మాన సభ

భవానీ సాహిత్య వేదిక ఉదయ సాహితీ సంస్థలు ఆధ్వర్యంలో వారాల ఆనంద్‌కు ఆదివారం వాగేశ్వరీ డిగ్రీ కళాశాలలో సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ హాజరుకానున్న సభకు సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న భాగవత ప్రవచనం

కరీంనగర్‌కల్చరల్: ఇటీవల మరణించిన పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి స్మృతిలో కరీంనగర్‌లోని శ్రీపురంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు మైలవరపు శ్రీనివాస్‌రావు భాగవత ప్రవచనం శుక్రవారం కొనసాగింది. ప్రహ్లాద చరిత్ర, గజేంద్రమోక్షం వంటి ఘట్టాలను వివరించారు.




ఆస్పత్రి వద్ద ఫ్లెక్సీతో ఆందోళన చేస్తున్న కుటుంబీకులు. (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్

పోలీసుల నిర్లక్ష్యం.. మార్చురీలో కుళ్లిన శవం!

సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో దారుణం

సంగారెడ్డి మున్సిపాలిటీ: పోలీసులు.. డాక్టర్ల నిర్లక్ష్యంతో 15 రోజులు మార్చురీలోనే ఓ మృతదేహం కుళ్లిపోయింది. చివరకు సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు.. పోలీసులు, అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందంటూ పెద్దఎత్తున సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దాంతో పోలీసులు లాఠీలకు పనిచెప్పారు. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఉదంతం పూర్వాపరాలిలా.. గత నెల 18వ తేదీన సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్న శ్రీనివాస్(28)కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స చేసినా ప్రయోజనం లేకపోయింది. డిసెంబర్ 23న మృతి చెందాడు. వాస్తవానికి 108 సిబ్బంది 18వ తేదీనే పుల్కల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా వారు స్పందించకపోవడం.. మృతుడికి సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మార్చురీకి తరలించారు. దాదాపు పదిహేనురోజులు కావడంతో శవం పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన రావడాన్ని గమనించిన అక్కడి ఉద్యోగులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శవాన్ని తరలించే క్రమంలో మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డును పరిశీలించారు. అందులో ఉన్న వివరాల మేరకు మృతుడు ఝరాసంఘం మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఒక్కసారిగా షాక్‌కు గురైన కుటుంబసభ్యులు పోలీసుల నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అదే సమయంలో జిల్లా పరిషత్ జనరల్‌బాడీ సమావేశానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసేందుకు నినాదాలు చేసుకుంటూ ఆస్పత్రి నుంచి జెడ్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. జెడ్పీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకొని లాఠీచార్జ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బాధ్యులపై చర్యలకు మంత్రి ఆదేశం

విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు మృతుడి కుటుంబసభ్యులు, బంధువులను సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి పిలిపించారు. శ్రీనివాస్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పోలీసులు, డాక్టర్ల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సంగారెడ్డి కలెక్టర్ శరత్‌ను మంత్రి ఆదేశించారు. విచారణ తర్వాత బాధ్యులపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మంత్రి బాధితులకు హామీ ఇచ్చారు. కాగా, భర్త మృతిపై మంత్రికి విన్నవించుకుందామని వెళుతుంటే అడ్డుకొని కర్కశంగా తన కడుపులో కాలుతో తన్నిందని మృతుడు శ్రీనివాస్ భార్య సంగీత ఓ మహిళా కానిస్టేబుల్, పోలీసుల తీరుపై మండిపడుతూ రోడ్డుపై రోదించిన తీరు కలచివేసింది. శ్రీనివాస్ సినీ ఇండస్ట్రీలో సీరియల్ ఆర్టిస్టుగా పనిచేస్తూ జీవనం సాగించేవాడని, వారం, పదిహేనురోజులకోసారి షూటింగ్‌ల నుంచి ఇంటికి వచ్చి వెళ్తారని ఆ నమ్మకంతోనే కుటుంబసభ్యులు శ్రీనివాస్ గురించి ఆరా తీయలేదని చెబుతున్నారు.

‘ఆజాద్’ కేసులో పోలీసులకు ఊరట

సాక్షి, హైదరాబాద్: ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో పోలీసులకు హైకోర్టులో ఊరట లభించింది. పోలీసులు విచారణ ఎదుర్కోవాల్సిందేనంటూ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. సుదీర్ఘకాలంగా సాగుతున్న మావోయిస్టు అగ్రనేత ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసు ఎన్నో మలుపులు తిరుగుతూ జిల్లా కోర్టుకు చేరడం తెలిసిందే. మూడు నెలల విచారణ తర్వాత డిసెంబర్ 13న జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. కేసుతో సంబంధమున్న 29 మంది పోలీసులు మున్సిఫ్ కోర్టులో విచారణకు హాజరు కావాలని జడ్జి ఆదేశించారు. గతంలో జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. తమ వాదనలను జిల్లా కోర్టు వినలేదని పేర్కొన్నారు. దీంతో మరోసారి వాదనలు వినాలని జిల్లా కోర్టును హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో ఇరువర్గాల వాదనలు విన్న తర్వాత జిల్లా కోర్టు తీర్పు వెల్లడించింది. జిల్లాకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పోలీసులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జిల్లాకోర్టు ఉత్తర్వులపై స్టే విధిస్తూ, విచారణను వాయిదా వేశారు.

వివరాలిచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించండి

ఎమ్మెల్యేలకు ఎర కేసులో హైకోర్టుకు సీబీఐ విజ్ఞప్తి

- 9న సీబీఐ వాదనలు వింటామన్న ధర్మాసనం
- రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌పై వాడీవేడిగా వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు ఆరోపణల కేసు వివరాలు తమకు ఇవ్వాలంటూ రాష్ట్ర సర్కారుకు లేఖ రాశామని, వివరాలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీబీఐ శుక్రవారం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. వివరాలు ఇస్తే దర్యాప్తు చేపడతామని తెలిపింది. అయితే ఇదే కేసుకు సంబంధించిన అప్పీల్‌పై విచారణ సాగుతోందని, సోమవారం సీబీఐ వాదనలు కూడా వింటామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు దర్యాప్తు చేయాలంటూ సీబీఐ డైరెక్టర్‌ను హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా అధికారిక ఆర్డర్ కాపీ సీబీఐకి గురువారం అందింది. దీంతో కేసు దర్యాప్తు బాధ్యతను ఢిల్లీ విభాగానికి సీబీఐ అప్పగించింది. ఈ నేపథ్యంలో సీబీఐ ఢిల్లీ బృందం హైదరాబాద్‌కు వచ్చింది. సిట్ నుంచి కేసు పత్రాలను స్వాధీనం చేసుకుని తమకు ఇవ్వాలని సీఎస్‌కు లేఖ రాసింది. అయినా వివరాలు అందకపోవడంతో శుక్రవారం సీజే ధర్మాసనం ముందు విజ్ఞప్తి చేసింది. అంతకుముందు ఈ కేసులో వాడీవేడిగా వాదనలు సాగాయి. ‘ఎమ్మెల్యేలకు ఎర’ కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసిన విషయం తెలిసిందే. నిందితులు నందుకుమార్, రామచంద్ర భారతి, సింహయాజీ తరఫున సీనియర్ న్యాయవాదులు డీవీ సీతారాంమూర్తి, ఎల్.రవిచందర్, బీజేపీ తరఫున సీనియర్ న్యాయవాది సి.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) గాడి ప్రవీణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

నిందితులే నేరస్తులని సీఎం చెప్పారు..

‘ముఖ్యమంత్రి మీడియా సమావేశానికి ముందే సమాచారం అంతా పబ్లిక్ డొమెయిన్‌లో ఉందని ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పారు. సీఎం ప్రెస్‌మీట్ పెడితే తప్పులేదు.. కానీ, ఈ కేసులో నిందితులే నేరస్తులని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సహా పలువురు బీజేపీ అగ్రనేతలకు ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు వెల్లడించారు. డీసీలు, పెన్‌డ్రైవ్‌లు పంచిపెట్టారు. కేసు వివరాలను రహస్యంగా ఉంచాల్సి ఉండగా, ఎవరికి వారు మీడియాకు లీకులిస్తూ వచ్చారు. జీవో నంబర్ 63 ప్రకారం సిట్ ఏర్పాటు అయ్యింది. ఈ సందర్భంగా డీజీపీ లేఖ రాస్తూ.. కేసు సంచలనాత్మకం, సున్నితం అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం, డీజీపీ వాడిన పదజాలం పోలీసులను ప్రభావితం చేసేదిగా ఉంది. ఇది సిట్ దర్యాప్తు ఒకవైపు మొగ్గ చూపేలా చేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు. సిట్‌లో సీనియర్ అధికారులు ఉన్నా.. వారంతా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో విధులు నిర్వహించేవారే. సింగిల్ జడ్జి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిగణనలోకి తీసుకున్నాకే తీర్పు వెలువరించారు. క్రిమినల్ కేసు కనుక అప్పీల్‌పై విచారణ జరిపే అర్హత ఈ కోర్టుకు లేదు. అందువల్ల సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోజాలదు..’ అని నిందితుల తరఫు న్యాయవాదులు వాదించారు.



తదుపరి విచారణ 9కి వాయిదా

రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే ఢిల్లీలో ఉన్నారని, సోమవారం వర్చువల్‌గా వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని ఏజీ కోరారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ చేపడతామని తెలిపింది.

కోర్టు రాజకీయాలకు వేదిక కాదు: ధర్మాసనం

‘ఇతర రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అక్కడి ప్రభుత్వాలను కూల్చారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను బీజేపీ తీసుకోలేదు. కానీ టీఆర్ఎస్ 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐల నుంచి 37 మంది ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది. వీరంతా రాజీనామాలు చేయకుండా చేరినవారే. ఎమ్మెల్యేలకు ఎర కేసులో ఫిర్యాదుదారు రోహిత్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా ఇతర పార్టీల తరఫున పోటీ చేసి టీఆర్ఎస్‌లో చేరినవారే. ఈ క్రమంలో కేసును సీబీఐకి అప్పగించడమే సరైంది..’ అని బీజేపీ తరఫు న్యాయవాది దామోదర్‌రెడ్డి అన్నారు. ఈ క్రమంలో ధర్మాసనం జోక్యం చేసుకుని.. సింగిల్ జడ్జి బీజేపీ పిటిషన్‌ను కొట్టివేసినప్పుడు బీజేపీ అప్పీల్ చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అప్పీల్ చేసిందని ప్రశ్నించింది. బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయాలకు కోర్టును వేదికగా వాడుకోరాదని ఘాటుగా వ్యాఖ్యానించింది.

మద్యం కేసులో ఈడీ అనుబంధ చార్జిషీటు

12 మంది వ్యక్తులు, సంస్థల పేర్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 13,567 పేజీలతో తొలి అనుబంధ చార్జిషీటు దాఖలు చేసింది. 12 మంది వ్యక్తులు, సంస్థల పేర్లతో కూడిన ఈ చార్జిషీటును శుక్రవారం రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టులో జస్టిస్ నాగ్‌పాల్ ధర్మాసనం ముందు దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది. ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీటులో సమీర్‌మహేంద్రు, విజయ్‌నాయర్, అభిషేక్‌బోయినపల్లి, బినోయ్‌బాబు, శరత్‌చంద్రారెడ్డి, ముత్తా గౌతమ్, కుల్దీప్‌సింగ్, నరేందర్ సింగ్, అరుణ్ పిళ్లై, దినేష్‌అరోరా, అమిత్ అరోరాలతోపాటు 12వ పేరు కింద సమీర్ మహేంద్రుకు చెందిన సంస్థల పేర్లు పొందుపరిచింది. దీంతోపాటు 428 పేజీలతో కూడిన సమాచార పత్రాన్ని కోర్టుకు అందజేసింది. అనుబంధ చార్జిషీటులో సౌత్ గ్రూపునకు చెందిన సంస్థలు, ఇతరత్రా అంశాలతోపాటు సొమ్ములు ఏ విధంగా ఎవరెవరికి బదలీ అయ్యాయనే అంశాలు కూడా చేర్చినట్లు ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు అభిషేక్ బోయినపల్లి, బినయ్‌బాబు, విజయ్‌నాయర్, శరత్‌చంద్రారెడ్డిల జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో శనివారం ఈడీ అధికారులు కోర్టు ముందు హాజరుపర్చనున్నారు. శరత్‌చంద్రారెడ్డి బెయిలు పిటిషన్‌పైనా విచారణ సాగనుంది.


ఈ నెల 9 న పీఎం అప్రెంటిస్‌షిప్ మేళా

- తెలంగాణలో 6 జిల్లాలు, ఏపీలో 9 జిల్లాల్లో మేళా
- దేశవ్యాప్తంగా మొత్తం 242 జిల్లాల్లో ఏర్పాట్లు

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా యువతకు కెరీర్ అవకాశాలను పెంపొందించేందుకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా 242 జిల్లాల్లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ అప్రెంటిస్‌షిప్ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని యువతకు కొత్త నైపుణ్యాలు నేర్చుకొనేందుకు అవకాశాలు ఇవ్వనున్నాయి. ఈ అప్రెంటిస్‌షిప్ మేళాను తెలంగాణలోని 6 జిల్లాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని 9 జిల్లాల్లో నిర్వహించనున్నారు.

ఎక్కడెక్కడంటే...

తెలంగాణలోని మణుగూరు ప్రభుత్వ ఐటీఐ (భద్రాద్రి కొత్తగూడెం), ముషీరాబాద్ ప్రభుత్వ ఐటీఐ(హైదరాబాద్), భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐ(జయశంకర్ భూపాలపల్లి), పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ(పెద్దపల్లి), అల్వాల్ ప్రభుత్వ ఐటీఐ(రంగారెడ్డి), భువనగిరి ప్రభుత్వ ఐటీఐ(యాదాద్రి భువనగిరి)ల్లో మేళా జరుగనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం ప్రభుత్వ ఐటీఐ(బీ) (అనంతపురం), కాకినాడ ప్రభుత్వ ఐటీఐ (కాకినాడ), విజయవాడ ప్రభుత్వ ఐటీఐ(ఎన్టీఆర్ కృష్ణా), మాచర్ల ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐ (పల్నాడు), ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ(బీ) (ప్రకాశం), ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ(శ్రీకాకుళం), తిరుపతి ప్రభుత్వ ఐటీఐ(తిరుపతి), విశాఖపట్టణం ప్రభుత్వ ఐటీఐ (ఓల్డ్) (విశాఖపట్టణం), కడప ప్రభుత్వ ఐటీఐ (వైఎస్సార్ కడప)ల్లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నారు.



గువాహటిలో లోయలో పడిన ట్రక్కు

ట్రక్కు నదీలోయలో పడి ఖమ్మం జవాన్ మృతి

అరుణాచల్ ప్రదేశ్‌లో ఘటన

గార్ల: అరుణాచల్ ప్రదేశ్ గువాహటి సమీపంలో జవాన్ల సామగ్రితో వెళ్తున్న ట్రక్కు నదీ లోయలో పడిపోవడంతో ఇండో టిబెటిన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) విభాగంలో విధులు నిర్వహిస్తున్న జవాన్ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం జవాన్ కుటుంబం తొమ్మిదేళ్ల నుంచి ఖమ్మంలోని శ్రీసిటీలో నివాసం ఉంటోంది. గార్ల మండలం పీక్లీతండాకు చెందిన భూక్యా రమేశ్ (31) గువాహటి సమీపంలో గురువారం తెల్లవారుజామున సైనికులకు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్తున్న ట్రక్కులో ఉన్నారు. ప్రమాదవశాత్తు ట్రక్కు నదీ లోయలో పడిపోయింది. దీంతో నలుగురు జవాన్లు నదీ లోయలో పడిపోగా.. ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. ఇందులో రమేశ్ మాత్రం నదిలో పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇటీవల సెలవుపై రమేశ్ ఖమ్మం వచ్చి కుటుంబ సభ్యులతో గడిపి మళ్లీ విధులకు వెళ్లి మృత్యువాతపడ్డారని భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమయ్యారు.

కొత్తగా 9 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం 5,262 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా, వారిలో 9 మంది వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. కాగా, రాష్ట్రంలో ఎక్స్‌బీబీ1.5 వేరియంట్ కేసులు నమోదయ్యాయని గ్లోబల్ ఇన్షియేటివ్ ఆన్ షేరింగ్ ఇన్ఫ్లుయెంజా డాటా (జీఐఎస్ఏఐడీ) వెల్లడించింది. నాలుగు వారాల క్రితం ఎక్స్‌బీబీ1.5 సబ్ వేరియంట్ కేసులు దేశంలో 10 నమోదు కాగా, అందులో నాలుగు కేసులు మహారాష్ట్రలో, మూడు కేసులు తెలంగాణలో, మరో మూడు కేసులు గుజరాత్‌లో నమోదయ్యాయి.

కోహెడలో 50 రూ.కోట్లతో చేపల మార్కెట్

- గొర్రెలు, మేకల మార్కెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోండి
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు మరింత చేరువగా చేపల విక్రయాన్ని అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో చేపల యార్డుకు శ్రీకారం చుట్టామని పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు అత్యాధునిక వసతులతో సుమారు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో రంగారెడ్డి జిల్లా కోహెడలోని 10 ఎకరాల విస్తీర్ణంలో హోల్‌సేల్ చేపల మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో పశు, మత్స్య, డెయిరీ, పశు గణాభివృద్ధిపై అధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సమీక్షలో షీప్ ఫెడరేషన్, విజయ డెయిరీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, సోమా భరత్‌కుమార్, పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అధర్ సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచందర్, టీఎస్ఎల్‌డీఏ సీఈవో మంజువాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఆలోచనల మేరకు ఉచితంగా చేప, రొయ్య పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ హోల్‌సేల్ మార్కెట్ అందుబాటులోకి వస్తే చేపలకు మంచి ధర లభించి మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని

గొర్రెలు, మేకల మార్కెట్ల నిర్మాణానికి చర్యలు

అన్ని జిల్లాలలో గొర్రెలు, మేకల మార్కెట్ల నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని డైరెక్టర్ రాంచందర్‌ను మంత్రి తలసాని ఆదేశించారు. పెద్దపల్లి, ఖమ్మం, కామారెడ్డి తదితర జిల్లాలలో స్థలాలను గుర్తించడం జరిగిందని, అక్కడ నిర్మాణపనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్ల సహకారంతో వారంరోజులలోగా స్థలాలను సేకరించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో రూ.19 కోట్ల వ్యయంతో 57 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ట్రైనింగ్ సెంటర్‌కు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కంసాన్‌పల్లి వద్ద నిర్మిస్తున్న పశువీర్య ఉత్పత్తి కోసం కేంద్రాన్ని మార్చిలో ప్రారంభిస్తామని, ఈ లోగానే నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కేంద్రానికి కనువిప్పు కలిగేలా..

నేడు హైదరాబాద్‌లో మజ్దూర్ ప్రవాసీ దివస్

- ఇండోర్ ‘ప్రవాసీ దివస్’ఎజెండాలో కనిపించని గల్ఫ్ కార్మికుల అంశం
- నిరసనగా గల్ఫ్ జేఏసీ పోటీ సభ

మోర్తాడ్ (బాల్కొండ): మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వేదికగా ఈనెల 8 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న 17వ ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో గల్ఫ్ వలస కార్మికుల అంశం ప్రస్తావన లేకపోవడంతో గల్ఫ్ ప్రవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అనురాగ్ సింగ్ ఠాకూర్, డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ, ధర్మేంద్ర ప్రధాన్, మీనాక్షి లేఖి, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయి పటేల్‌తోపాటు పలువురు ప్రముఖులు ప్రవాసీ భారతీయ దివస్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. విదేశాంగ శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు ఐదు అంశాలపై చర్చించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఇందులో గల్ఫ్ వలస కార్మికుల సమస్యలపై చర్చకు అవకాశం కల్పించలేదు. ప్రవాసీ భారతీయ దివస్‌ను కేవలం సంపన్న ప్రవాసుల కోసమే నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రానికి కనువిప్పు కలిగించేలా హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం గల్ఫ్ జేఏసీ మజ్దూర్ ప్రవాసీ దివస్‌ను నిర్వహిస్తోంది.

విదేశీ మారకద్రవ్యం ఆర్జనలో గల్ఫ్ వలస కార్మికులదే పైచేయి

మన దేశం నుంచి వివిధ దేశాలకు వలస వెళ్లిన కార్మికులు ఆర్జించే విదేశీ మారకద్రవ్యం విషయంలో గల్ఫ్ వలస కార్మికులదే పై చేయిగా ఉంది. గల్ఫ్‌యేతర దేశాలకు వలస వెళ్లిన వారు అక్కడే స్థిరపడి తమ సంపాదనతో స్థిరాస్తులను కూడబెట్టుకుంటున్నారు. ఒక్క గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారు మాత్రం ప్రతి నెలా కోట్లలో విదేశీ మారకద్రవ్యాన్ని మన దేశానికి చేరవేస్తున్నారు. గల్ఫ్‌కు వలస వెళ్లిన భారతీయుల సంఖ్య 88 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులకు పునరావాసం, పునరేకీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని జేఏసీ అనేక సార్లు విజ్ఞప్తి చేసింది. అయితే ఎక్కడ కూడా గల్ఫ్ వలస కార్మికులకు ప్రాధాన్యం దక్కకపోవడంతో ప్రవాసీ భారతీయ దివస్‌ను వేదికగా చేసుకుని తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలనే సంకల్పంతో జేఏసీ ప్రయత్నిస్తోంది.

గల్ఫ్ వలస కార్మికులపై చిన్నచూపు తగదు..

గల్ఫ్ వలస కార్మికులపై చిన్నచూపు తగదు. ఎంతో శ్రమకోర్చి కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి గల్ఫ్ దేశాలకు వలస వెళుతున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని ప్రయోజనాలనైనా కల్పించాలి. ప్రవాసీ భారతీయ దివస్‌లో గల్ఫ్ కార్మికుల సమస్యలపై దృష్టిసారించాలి.

– గుగ్గిల్ల రవిగౌడ్, చైర్మన్, గల్ఫ్ జేఏసీ

20 కోట్ల ఆఫర్‌ని కాదన్నాడు

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): రూ.20 కోట్లకు బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాదీ నుంచి ఖరీదైన పెట్‌ను సొంతం చేసుకున్నాడంటూ వచ్చిన కథనాలన్నీ అవాస్తవం. రష్యాకు చెందిన ‘కొకేషియన్ షెఫర్డ్’ అనే జాతికి చెందిన కుక్క కోసం హైదరాబాద్‌కు చెందిన కన్‌స్ట్రక్టర్ బెంగళూరులోని ‘ఇండియన్ డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్’ ప్రెసిడెంట్, పెట్ యజమానైన సతీష్ కెడబామ్స్‌ను సంప్రదించాడు. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఈ పెట్‌కు రూ.20కోట్లు ఇస్తానంటూ యజమానికి ఆఫర్ ఇచ్చాడు. తాను ఈ ఆఫర్‌ను నిరాకరించానని, ఈ పెట్‌ను రూ.100కోట్లు ఇచ్చినా అమ్మేది లేదంటూ ఆయన ‘సాక్షి’కి చెప్పారు. రూ.20కోట్లకు తాను కొన్నానంటూ వచ్చిన కథనాలు అవాస్తవమని కొట్టిపారేశారు. ‘రష్యాకు చెందిన ఈ కొకేషియన్ షెఫర్డ్ జాతి శునకం వయసు ఏడాదిన్నర, బరువు 100కేజీలు. ఇది దక్షిణ రష్యాలోని ఆర్మేనియా, అజర్‌బైజాన్, జార్జియాలతోపాటు టర్కీలో కూడా లభిస్తుంది. చూడటానికిది ఆడ సింహం మాదిరిగా ఉంటుంది. ఈ జాతికి చెందిన శునకం మనదేశంలో దొరికినప్పటికీ రష్యాలో ఉన్న మాదిరిగా ఉండదు. ‘కెడబామ్స్ హైడర్’ అని ముద్దుగా పిలిచే ఈ శునకం త్రివేండ్రంలో జరిగిన ‘కెనల్ క్లబ్ కాంపిటీషన్’లో 32 మెడల్స్‌ను సొంతం చేసుకుని ది బెస్ట్ డాగ్‌గా నిలిచింది’ అని కెడబామ్స్ చెప్పారు.



తెలంగాణ వైద్య, అరోగ్య శాఖకు కేంద్రం ప్రశంసలు

- నేషనల్ మెటర్నల్ హెల్త్ వర్క్ షాప్‌లో రెండు అవార్డులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ చేపడుతున్న అనేక కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ ప్రశంసించింది.మాతా శిశు సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలిచాయని పేర్కొంది. ఢిల్లీలో నిర్వహించిన నేషనల్ మెటర్నల్ హెల్త్ వర్క్ షాప్‌లో తెలంగాణకు రెండు అవార్డులు ప్రకటించింది. హైరిస్క్ గర్భిణులను గుర్తించి చికిత్స అందించడంలో తెలంగాణ దేశంలో రెండో స్థానంలో ఉండగా,మిడ్ వైఫరీ వ్యవస్థకు ప్రత్యేక అవార్డు అందుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుబంధ విభాగం యునిసెఫ్ కూడా తెలంగాణ మిడ్ వైఫరీ వ్యవస్థపై ప్రశంసలు కురిపించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

తునికాకు కూలీలకు బోనస్ చెల్లించండి

అధికారులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: గతంలో తునికాకు (బీడీ ఆకు) సేకరించిన కూలీలకు బోనస్ డబ్బులు చెల్లించాలని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బోనస్ చెల్లింపుల్లో జాప్యం తగదని, త్వరగా కూలీలకు బోనస్ చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చే వేసవిలో దాదాపు రెండున్నరలక్షల మంది గిరిజన, గిరిజనేతర కూలీలకు ఆదాయం సమకూర్చిపెట్టే తునికాకు సేకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అడవిపై స్థానిక ప్రజలకే పూర్తి హక్కులున్నాయని పేర్కొన్నారు. అటవీ సంపదపై వచ్చే ఆదాయం ఆ ప్రాంత ప్రజలకే చెందాలనే ఉద్దేశంతో రాయల్టీ డబ్బులను కూలీలకు బోనస్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. శుక్రవారం అరణ్య భవన్‌లో కూలీలకు తునికాకు సేకరణ పెండింగ్ బోనస్ చెల్లింపులు, ఈ సీజన్‌లో తునికాకు సేకరణ ఏర్పాట్లపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాలు 37 డివిజన్లలో విస్తరించిన అటవీ ప్రాంతాల్లో బీడీ ఆకులను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా సేకరిస్తున్నామని మంత్రికి అధికారులు వివరించారు. ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డొబ్రియల్, అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, అదనపు పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సమీక్షలో పాల్గొన్నారు.

‘కూల్ రూఫ్ పాలసీ’ ముసాయిదా సిద్ధం

- హైదరాబాద్‌లో వంద చ.కి.మీ., తెలంగాణలో 300 చ.కి.మీ.

సాక్షి, హైదరాబాద్: ‘అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్’(యూహెచ్ఐ) ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుంబిగించింది. శరవేగంగా పెరుగుతున్న పట్టణీకరణ మూలంగా పచ్చదనం అదేస్థాయిలో క్షీణిస్తోంది. భూ ఉపరితలానికి నీడ కరువై, తేమ శాతం తగ్గడంతో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ వేడి ఉంటోంది. దీనిని శాస్త్ర పరిభాషలో ‘అర్బన్ హీట్ ఐలాండ్ ఎఫెక్ట్’(యూహెచ్ఐ)గా పిలుస్తున్నారు. మరోవైపు వాతావరణ మార్పుల మూలంగా మరింత వేడెక్కుతుండగా అనియంత్రిత అభివృద్ధి, ఏసీల వినియోగం పెరగడంతో పరిస్థితి మరింత దిగజారి యూహెచ్ఐకి దారితీస్తోంది. ఈ నేపథ్యంలో యూహెచ్ఐ ప్రభావాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘కూల్ రూఫ్ పాలసీ’ముసాయిదాను రూపొందించింది.

ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యంతో యూహెచ్ఐని నిరోధించేందుకు ఉన్న అవకాశాలపై శుక్రవారం హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించింది. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అర్బన్ అఫైర్స్ భాగస్వామ్యంతో ఆగాఖాన్ ఏజెన్సీ ఫర్ హ్యాబిటాట్(అకా) ఈ వర్క్‌షాప్ నిర్వహించింది.

అడవుల పరిరక్షణకు అటవీ శాఖ చర్యలు

సాక్షి, హైదరాబాద్: అడవుల పరిరక్షణ, పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేసేలా అటవీ శాఖ వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా జాతీయ, అంతర్జాతీయంగా పర్యావరణ ప్రాధాన్యత ఉన్న తేదీల సందర్భంగా అటవీ శాఖ వివిధ ప్రాంతాల్లో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వనదర్శిని, నేచర్ వాక్, ఫారెస్ట్ బాతింగ్, బర్డ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోంది. ప్రధానంగా విద్యార్థులకు ప్రకృతి, పర్యావరణం పట్ల అవగాహన కల్పించడం, అడవుల ప్రాధాన్యం, వివిధ రకాల చెట్లు, జంతువులతో పర్యావరణ సమతుల్యత ఎలా ఏర్పడుతుందనే అంశాలను అధికారులు వివరిస్తున్నారు. అటవీ అధికారులు ప్రకృతి పట్ల సమాజంలో మార్పు కోసం ఛేంజ్ ఏజెంట్లుగా పనిచేస్తారని శుక్రవారం పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్ తెలిపారు.

హైదరాబాదీలు కలవడం శుభదినం

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో కేటీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు హైదరాబాద్ వాసులు కలవడం ద్వారా శుభదినం ప్రారంభమవుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో ఉన్న మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్లతో ఆయన బస చేసిన ఓ హోటల్‌లో శుక్రవారం కేటీఆర్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. తమ భేటీలో బిజినెస్, బిర్యానీ గురించి మాట్లాడు కున్నామని తెలిపిన కేటీఆర్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్లతో దిగిన ఫోటోలను ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఇదిలా ఉంటే భారత్ పర్యటనకు వచ్చిన సత్య నాదెళ్ల రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. బెంగళూరులో జరిగిన ఫ్యూచర్ టెక్నాలజీ సదస్సులో కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వటపత్రశాయిగా నారసింహుడు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పంచనారసింహుడు వటపత్రశాయి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శ్రీస్వామి వారిని పరమపద నాథుడి (వైకుంఠ నాథుడిగా)గా అలంకరించి తిరువీధి నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఈవో గీతారెడ్డి పాల్గొన్నారు.

అనుమతిలేని ఇంటర్ కాలేజీ విద్యార్థులకు పరీక్షకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: అనుబంధ గుర్తింపు లభించని ప్రైవేటు కాలేజీల్లో చదివిన విద్యార్థులను వివిధ మార్గాల్లో పరీక్షలకు హాజరయ్యేందుకు ఇంటర్ బోర్డు అనుమతించింది. మొదటి సంవత్సరం వారిని ప్రైవేటు కాలేజీల ద్వారా, రెండో ఏడాది విద్యార్థులను ప్రభుత్వ కాలేజీల ద్వారా పరీక్షకు పంపాలని సూచించింది. ఈమేరకు జిల్లా అధికారులకు బోర్డు ఆదేశాలు జారీచేసింది. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీతో పాటు, ఇతర సాంకేతిక అనుమతులు లేని దాదాపు 400 కాలేజీలకు ఈ ఏడాది సకాలంలో బోర్డ్ అఫిలియేషన్ ఇవ్వలేదు. అగ్నిమాపక శాఖ ఇటీవల ఇచ్చిన అనుమతి కారణంగా చివరకు గుర్తింపు ఇచ్చారు. ఇందులో 24కాలేజీలకు గుర్తింపు దక్కలేదు. అఫిలియేషన్ ఉన్న కాలేజీల నుంచి విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫలితంగా అఫిలియే షన్ రాని 24 కాలేజీల్లోని 5 వేల మంది విద్యా ర్థులకు నష్టం కలిగే వీలుందని భావించడంతో ప్రత్యామ్నాయ మార్గాలను బోర్డు సూచించింది.

బీసీల బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలి

ఆర్థిక మంత్రి హరీశ్‌కు ఆర్.కృష్ణయ్య వినతి

ముషీరాబాద్ (హైదరాబాద్): బీసీల బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లకు పెంచాలని ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావును రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బడ్జెట్‌లో బీసీలకు కేవలం 2% మాత్రమే కేటాయించడం వల్ల బీసీల అభివృద్ధి కుంటుపడిందని తెలిపామన్నారు. 52% జనాభా కలిగిన బీసీలకు కనీసం 10% నిధులు కేటాయించాలని కోరామని చెప్పారు. బడ్జెట్‌లో బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లను కేటాయించాలని, 12 బీసీ కులాల ఫెడరేషన్‌కు జనాభా నిష్పత్తిలో రూ.2 వేల కోట్లను కేటాయించాలని కోరినట్లు తెలిపారు. బీసీ అడ్వొకేట్‌లకు ఇచ్చే స్టైఫండ్ రూ.వేయి నుంచి రూ.10 వేలకు పెంచాలని కోరామన్నారు. తమ డిమాండ్లపై హరీశ్‌రావు స్పందించి బీసీల బడ్జెట్ పెంచే విషయంపై సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు కృష్ణయ్య తెలిపారు.

విదేశీ వైద్య విద్యార్థులకు వెసులుబాటు

విదేశాల్లో ఇంటర్న్‌షిప్ ఒక్కఏడాదికి గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: గతంలో భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) అనుమతి పొందిన, 2022 అక్టోబరు 21వ తేదీ లోపు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) గుర్తించిన విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు.. ఆయా దేశాల్లోనే ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేస్తే దాన్ని ఈ ఒక్క ఏడాది వరకు గుర్తిస్తామని ఎన్ఎంసీ స్పష్టం చేసింది. ప్రస్తుతం ఏ దేశంలో ఎంబీబీఎస్ పూర్తి చేసినా కూడా భారత్‌లో అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అనంతరం ఒక ఏడాది పాటు తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంది. ఈ నిబంధన తాజాగా అమల్లోకి రావడంతో 2022 అక్టోబర్‌కు ముందే ఇంటర్న్‌షిప్ విదేశాల్లో పూర్తి చేసిన వారు మళ్లీ ఇక్కడ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో అలాంటి అభ్యర్థులు ఈ నిబంధనను సడలించాలని ఎన్ఎంసీని కోరారు. దీన్ని పరిశీలించిన ఎన్ఎంసీ తాజాగా వెసులుబాటు కల్పించింది. తాము అనుమతించిన కాలేజీలు, విశ్వవిద్యాలయాల్లో గతేడాది అక్టోబర్ 21కు ముందు ఎంబీబీఎస్, తత్సమాన అర్హతతో వైద్య విద్య పూర్తి చేసి, ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేసినట్లయితే వారికి ఈ ఒక్క ఏడాదికి సడలింపిస్తామని ఉత్తర్వులు జారీచేశారు.

కొత్తగా 300 ఏఈవో పోస్టులు!

కొత్త వ్యవసాయ క్లస్టర్ల ఏర్పాటు నేపథ్యంలో అందుబాటులోకి..

- హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- ప్రస్తుతం కొన్ని క్లస్టర్లలో 6–10 వేల ఎకరాలు
- మరికొన్నింటిలో తక్కువ భూమి
- వీటిని దాదాపు ఐదు వేల ఎకరాలకు మార్చేందుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 300కుపైగా వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) పోస్టులు రానున్నాయి. ఈ మేరకు వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్రం సాగుభూమి పెరగడం, ఏఈవో క్లస్టర్ల పరిమాణం పెరగడంతో వాటిని హేతుబద్ధీకరించాలని.. అవసరమైన చోట కొత్త క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్త క్లస్టర్ల అవసరం, వాటికి ఏఈవోల నియామకంపై ప్రతిపాదనలు సిద్ధం చేసింది. క్లస్టర్ల ఏర్పాటు అమల్లోకి రాగానే, కొత్త ఏఈవో పోస్టులు కూడా అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా వాటిని భర్తీ చేస్తారు.

సాగుభూమి పెరగడంతో..

రాష్ట్ర ప్రభుత్వం 2018లో వ్యవసాయ భూములను క్లస్టర్ల వారీగా విభజించి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోంది. దాదాపు 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. అప్పుడు వానాకాలం సీజన్‌లో దాదాపు కోటి ఎకరాల వరకు సాగయ్యేది. కాస్త చిన్న, పెద్ద కలిపి 2,601 క్లస్టర్లు ఏర్పాటయ్యాయి. ప్రతీ క్లస్టర్‌కు ఒక ఏఈవో ఉంటారు. ఆ క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ భూమిని పర్యవేక్షించడం, రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడం, రైతు వేదికల నిర్వహణ, రైతుబంధు, రైతుబీమా లబ్ధిదారుల గుర్తింపు, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి బాధ్యతలను ఏఈవోలు నిర్వర్తిస్తారు. క్లస్టర్ పరిధిలో ఏయే పంటలు సాగు చేస్తున్నారనే సమగ్ర సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా అప్‌లోడ్ చేస్తారు.



అయితే కాళేశ్వరం, ఇతర సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం, రైతుబంధు వంటి కారణాలతో రాష్ట్రంలో సాగయ్యే భూమి విస్తీర్ణం 1.46 కోట్ల ఎకరాలకు చేరిందని వ్యవసాయశాఖ వర్గాలు చెప్తున్నాయి. దీనితో చాలా క్లస్టర్ల పరిధిలో సాగు భూమి ఐదు వేల ఎకరాలకు మించి పెరిగింది. 300కుపైగా క్లస్టర్లలో 6 వేల నుంచి 12 వేల ఎకరాల వరకు సాగుభూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ క్లస్టర్లకు సంబంధించిన ఏఈవోలపై పనిభారం పెరిగింది. పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో సాగుభూమి పెరిగిన, తక్కువగా ఉన్న క్లస్టర్లను హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు.

ఏఈవో క్లస్టర్లలో.. పంటల వారీగా క్లస్టర్లు

రాష్ట్రంలో పంటల వారీగా క్లస్టర్లను కూడా ప్రభుత్వం గతేడాది గుర్తించింది. ఏ పంట ఏ క్లస్టర్లలో అధికంగా సాగవుతుందో నిర్ధారించింది. ఆ ప్రకారం రానున్న సీజన్‌లో గుర్తించిన క్లస్టర్లలో పంటలను ప్రత్యేకంగా ప్రోత్సహించనున్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. పంట కోత అనంతరం క్లస్టర్లను బట్టి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తారు. దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందనేది సర్కారు ఉద్దేశం. రాష్ట్రంలో ప్రధాన పంటలకు సంబంధించి 2,613 క్లస్టర్లుగా వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అత్యధికంగా పత్తి పంటకు 1,081 క్లస్టర్లు, వరికి 1,064 పంట క్లస్టర్లు, కందులకు 71 క్లస్టర్లు, సోయాబీన్‌కు 21 క్లస్టర్లు, మొక్కజొన్నలకు తొమ్మిది క్లస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

2017 నుంచి ఏ కోర్సుకు ఎంత శాతం ఉపాధి వివరాలు

కోర్సు	2017	2018	2019	2020	2021	2022	2023
బీటెక్	50.69	51.52	57.09	49	46.82	55.15	57.44
ఎంబీఏ	42.28	39.4	36.44	54	46.59	55.09	60.1
బీఏ	35.66	37.39	29.3	48	42.72	44.2	49.2
బీకాం	37.98	33.93	30.6	47	40.3	42.62	60.62
బీఎస్సీ	31.76	33.62	47.37	34	30.34	38.06	37.69
ఎంసీఏ	31.36	43.85	43.19	25	22.42	29.3	30.64
ఐటీఐ	42.22	29.46	-	-	-	31.3	34.2
పాలిటెక్నిక్	25.77	32.67	18.05	32	25.02	21.42	27.61
బీఫార్మసీ	42.30	47.78	36.29	45	37.24	44.63	57.51

(2023కు సంబంధించిన శాతం అంచనా)

బీకాం.. భలే గిరాకీ!

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీల్లో డేటా అనాలసిస్ వ్యవస్థ పెరిగింది. దీంతో అనలిస్టుల అవసరం పెరిగింది. బీకాం నేపథ్యం ఉన్న విద్యార్థులకు అంతర్జాతీయంగా డిమాండ్, తద్వారా ఉపాధి పెరగడానికి ఇది దోహద పడింది. ఇండియాలో బీకామ్‌కు ఉద్యోగావకాశాలు ఐదేళ్లలో దాదాపు 30 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. దీంతో పాటు జీఎస్టీ తీసుకొచ్చిన తర్వాత ట్యాక్స్ నిపు ణుల ప్రాధాన్యత ఎక్కువైంది. గతంలో ఉన్న ఇన్‌కం ట్యాక్స్‌కు, ఇప్పటి జీఎస్టీకి చాలా తేడాలు న్నాయి. ఇదే కాలంలో డిజిటల్ చెల్లింపులు ఎక్కు వగా పెరిగాయి. వీటన్నింటినీ సమన్వయం చేయ డానికి ట్యాక్స్ నైపుణ్యతను పెంచుకోవాల్సిన అవస రం ఏర్పడింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, రిటైల్ బిజి నెస్ రంగాల్లో కూడా కామర్స్ నేపథ్యం ఉన్న సిబ్బంది అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలోనే అనలిస్ట్ ఉద్యోగుల వేతనం మూడేళ్లలోనే 98 శాతం పెరిగినట్టు ఇండియా స్కిల్ నివేదిక పేర్కొంది. బీకాం కోర్సుల్లో వచ్చిన మార్పులు కూడా ఈ పరిస్థితికి కారణమని తెలిపింది.

బీకాం కోర్సులకు క్రేజ్

అందివస్తున్న మార్కెట్ అవసరాల నేపథ్యంలో రాష్ట్రంలో బీకాం కోర్సులకు రానురాను డిమాండ్ పెరుగుతోంది. డిగ్రీ ప్రవేశాల్లో 41 శాతం వరకు బీకాం విద్యార్థులే ఉంటున్నారు. వాస్తవానికి ఆరేళ్ళ కిందట 46 శాతం సైన్స్ విద్యార్థులే ఉండేవాళ్ళు. ఇప్పుడు వీరి సంఖ్య 36 శాతానికి పడిపోయింది. 2017–18లో 80,776 మంది బీకాం కోర్సులో చేరితే, 2022–23లో 87,480 మంది చేరారు. అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్‌ను అందుకోవడానికి వీలుగా బీకాం కోర్సుల్లో తీసుకొచ్చిన మార్పులు ఇందుకు దోహదపడ్డాయి. బీకాంలో జనరల్, కంప్యూటర్స్, ట్యాక్సేషన్, ఆనర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కొత్త కోర్సులు ఉపాధి అవకాశాలు పెంచుతున్నాయి. స్టాక్ మార్కెట్ ట్రెండ్‌ను అంచనా వేసే టెక్నాలజీని కూడా బీకాం కోర్సుల్లో మేళవించారు. ఈ తరహా కామర్స్ కోర్సుల్లో నైపుణ్యం సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఈ–కామర్స్ పెరగడంతో మంచి డిమాండ్

ఈ–కామర్స్ పెరిగిన నేపథ్యంలో ట్యాక్స్ కన్సల్టెన్సీ, ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో బహుళజాతి కంపెనీలు కామర్స్ విద్యార్థులను అత్యధిక వేతనాలతో నియమిస్తున్నాయి. ప్రతి ఏటా డెలాయిట్, బ్రాడ్‌రిచ్, వెల్స్‌ఫార్‌గో, జేపీ మోర్గాన్ వంటి సంస్థలు క్యాంపస్ నియామకాలు చేపడుతున్నాయి. హైదరాబాద్‌లో రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వార్షిక వేతనాన్ని ఆఫర్ చేస్తున్నాయి. ఢిల్లీలో రూ. 21 లక్షల వరకు బహుళజాతి సంస్థలు ఇస్తున్నాయి. బీకాం తర్వాత విదేశాల్లో ఎంబీఏ చేసిన వారికి మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలు వస్తున్నాయి.

– డాక్టర్ మోహన్‌కుమార్ (భద్రుక కాలేజీ ప్రిన్సిపల్)

జీఎస్టీపై పట్టు ఉంటే మంచి వేతనం

జీఎస్టీ వచ్చిన తర్వాత కామర్స్ విద్యార్థులకు డిమాండ్ పెరిగింది. అన్ని రకాల సర్టిఫికేషన్ కోర్సులు చేసిన వారికి ఎక్కువ వేతనం ఇస్తున్నారు. ఫైలింగ్ సిస్టమ్‌లో అనుభవాన్ని బట్టి వేతనాలు ఉన్నాయి. మల్టీ నేషనల్ కంపెనీలో సీఏ తర్వాత జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్ ఉన్న వాళ్ళకు పొజిషన్ ఇస్తున్నారు. సీఏలకు ఏటా రూ.50 లక్షలు ఇవ్వడం కంటే జీఎస్టీ సర్టిఫికేషన్ ప్రోగ్రాం చేసిన వారికి రూ. 21 లక్షలు ఇవ్వడం కంపెనీలకు లాభదాయకంగా మారింది.

– ఎక్కులేదేవి పరమేశ్వర్ (ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం ప్రధాన కార్యదర్శి)

సీఏ చేసే పనులన్నీ చేస్తున్నాం

కామర్స్ తర్వాత యూఎస్‌లో మాస్టర్ ప్రోగ్రాం చేశాను. బహుళజాతి కంపెనీలో ఆడిట్, రిస్క్ మేనేజ్‌మెంట్ వింగ్‌లో ఉద్యోగం వచ్చింది. మొదట్లో రూ.18 లక్షలు ఇచ్చారు. సీఏ చేసే పనులన్నీ చేయగలుగుతున్నాం. జీఎస్టీ విధానంలో ఎక్కువ అనుభవం గడించాం. రెండేళ్లలో నా వేతనం రూ.21 లక్షలకు పెరిగింది.

– శశాంక్ (బహుళజాతి కంపెనీ ఉద్యోగి, ఢిల్లీ)

2017 నుంచి 2023 వరకు తెలంగాణలో బీకాం కోర్సుల్లో చేరికలు ఇలా..

సంవత్సరం	మొత్తం ప్రవేశాలు	బీకాంలో	బీఎస్సీలో
2017-18	2,00,806	80,776 (40.23)	91,937 (45.78)
2018-19	2,01,866	78,842 (39.06)	90,786 (44.97)
2019-20	2,02,342	80,891 (39.98)	83,209 (41.12)
2020-21	2,22,620	90,267 (40.55)	90,423 (40.61)
2021-22	2,55,132	1,07,137 (41.99)	94,809 (37.16)
2022-23	2,10,970	87,480 (41.47)	75,896 (35.98)

వారికి ఇంటర్ పరీక్ష ఫీజులో మినహాయింపు

- బహుళ అంతస్తుల భవనాల్లోని కాలేజీలకే వర్తింపు..
- రూ. వెయ్యికి బదులు రూ.వంద చెల్లిస్తే సరి

సాక్షి, హైదరాబాద్: బహుళ అంతస్తుల భవనాల (మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ)లో నడిపే ఇంటర్మీడియెట్ కాలేజీల్లోని విద్యార్థులకు పరీక్ష ఫీజులో ఇంటర్ బోర్డు ప్రత్యేక మినహాయింపు ఇచ్చింది. రూ.వెయ్యి ఆలస్య రుసుముకు బదులు రూ.వంద చెల్లిస్తే సరిపోతుందని బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 15 మీటర్ల ఎత్తులో ఉండే బహుళ అంతస్తుల భవనాలకు అగ్నిమాపక శాఖ అనుమతి తప్పనిసరి. 2020 సెప్టెంబర్ 24న ప్రభుత్వం ఈ మేరకు జీవో విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అలాంటి బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్న దాదాపు 400 ప్రైవేటు ఇంటర్ కాలేజీలకు ఫైర్ సేఫ్టీ అనుమతులు లభించడం కష్టమవుతోంది. ఇది ఉంటేనే ఇంటర్ బోర్డ్ అనుబంధ గుర్తింపు ఇస్తుంది. ఈ కారణంగా ప్రతి ఏటా మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉన్న కాలేజీలకు పరీక్షల తేదీ దగ్గరపడుతున్నా అఫ్లియేషన్ రావడం లేదు. ప్రతీ ఏటా కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు ఆ సంవత్సరం వరకూ అనుబంధ గుర్తింపు ఇవ్వడం, వచ్చే ఏడాది ఇవ్వబోమని బోర్డ్ అధికారులు చెప్పడం షరామామూలైంది. ఈ సంవత్సరం కూడా 2022–23, 2023–24కు అగ్నిమాపక శాఖ ప్రత్యేక అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ కాలేజీల్లో 15 మినహా అన్నింటికి బోర్డ్ అనుబంధ గుర్తింపు ఇచ్చింది. అప్పటికే ఇంటర్ పరీక్షఫీజు గడువు ముగిసింది. రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించుకునే అవకాశం ఉంది. అనుబంధ గుర్తింపు లేకుండానే విద్యార్థులను చేర్చుకున్న కాలేజీల తప్పిదం వల్ల తాము రూ.వెయ్యి ఆలస్య రుసుం చెల్లించడం సరికాదని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఇంటర్ బోర్డ్ దృష్టికి తెచ్చాయి. దీంతో రూ.వంద ఆలస్య రుసుముతో ఈ నెల 7వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించేందుకు అనుమతించింది. 8న విద్యార్థుల ఫీజులను బోర్డ్ ఖాతాలో జమ చేయాలని ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆదేశించింది.

15న 5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ప్రారంభం

సమీక్షలో సింగరేణి సీఎండీ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్/జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలో నిర్మించిన 5 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటును ఈనెల 15న ప్రారంభించనున్నారు. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ శుక్రవారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. రెండేళ్ల కాలంలో 8 చోట్ల ఏర్పాటు చేసిన 219 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఇప్పటి వరకు 505 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో సంస్థకు రూ.300 కోట్లు ఆదా అయ్యాయి. మూడో దశలో భాగంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రిజర్వాయర్‌పై 15 మెగావాట్ల సామర్థ్యంతో 2 ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను నిర్మిస్తుండగా, అందులో సిద్ధమైన 5 మెగా వాట్ల ప్లాంట్లను సంక్రాంతి సందర్భంగా 15న ప్రారంభిస్తారు. తొలి, రెండు దశల్లో 219 మెగావాట్ల ప్లాంట్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన సింగరేణి మూడో దశ కింద 300 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను నిర్మిస్తోంది.

8 ఏళ్లు.. రూ.10,762 కోట్లు

- రూ.10 వేల కోట్ల మార్కును దాటిన ఆర్టీసీ నష్టాలు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే అతి తక్కువ నష్టాలు
- ప్రభుత్వ సాయం కోసం ఆర్టీసీ నివేదన

సాక్షి, హైదరాబాద్: నష్టాల్లో ఆర్టీసీ రికార్డు సృష్టించింది. తెలంగాణ ఆర్టీసీ ఆవిర్భవించిన ఎనిమిదేళ్లలో రూ.10 వేల కోట్ల నష్టాల మార్కును దాటి సింది. రాష్ట్రం విడిపోయిన తొలి సంవత్సరం మినహా ఆ తర్వాత తన నష్టాల రికార్డును తానే అధిగమిస్తూ గత డిసెంబర్ నాటికి ఏకంగా రూ.10,762.50 కోట్లకు చేరింది. రాష్ట్రం విడిపోయాక 2014–15 ఆర్థిక సంవత్సరంలో రూ.299.64 కోట్ల నష్టాలతో టీఎస్ఆర్టీసీ నష్టాల పరంపరను ప్రారంభించింది.

సమ్మెతో మరింత దిగజారి..

ఆర్టీసీ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 2019లో సమ్మె జరిగింది. ఏకంగా 52 రోజుల పాటు ఉద్యోగులు సమ్మెలో ఉండటంతో బస్సులు సరిగ్గా తిరగక నష్టాలు మరింత పెరిగాయి. ఫలితంగా 2019–20లో రూ.1,002 కోట్ల నష్టాలు ఏర్పడ్డాయి. ఇక ఆ తర్వాత వరసగా రెండేళ్లు కోవిడ్ వల్ల సమస్య మరింత పెరిగింది. రెండేళ్లు సగటున రూ.2 వేల కోట్ల చొప్పున నష్టం వచ్చిపడింది. ఈ ఎనిమిదేళ్లలో తక్కువ నష్టాలు నమోదైంది 2022లోనే కావడం గమనార్హం. కోవిడ్ కష్టాల నుంచి తేరుకుని ఇప్పుడు లాభాల వైపు పయనిస్తుండటంతో ఎట్టకేలకు నష్టాలకు ముకుతాడు పడినట్టయింది. ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల ప్రస్తుతం 26 డిపోలు లాభాల్లోకి వచ్చాయి. మరో 20 డిపోలు బ్రేక్‌ఈవెన్‌కు చేరువయ్యాయి. మిగతా డిపోల్లో నష్టాలు తగ్గాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ఏప్రిల్‌నాటికి కొత్త నష్టాలు పూర్తిగా నియంత్రణలోకి వస్తాయని అధికారులు ఆశిస్తున్నారు. కాగా, ఇటీవలి నష్టాల లెక్కలను ఆర్టీసీ ప్రభుత్వం ముందుంచింది. ఆర్టీసీకి రావాల్సిన బకాయిలు, సీసీఎస్, పీఎఫ్‌లకు చెల్లించాల్సిన మొత్తాలను పేర్కొంటూ నివేదిక ఇచ్చింది. తన స్థాయిలో తాను సంస్కరణలతో నష్టాలకు ముకుతాడి వేసినందున, బకాయిలను ప్రభుత్వం చెల్లించాలని కోరింది.

మెడికల్ కాలేజీల్లో 147 ప్రొఫెసర్ పోస్టులు

- కాంట్రాక్టు విధానంలో నియామకానికి నోటిఫికేషన్
- 69 ఏళ్ల వయసు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- 12వ తేదీన ఇంటర్వ్యూ.. అదే రోజు తుది జాబితా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల్లో 147 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ కాంట్రాక్టు పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు.. 69 ఏళ్ల వయసున్నవారు కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ మేరకు వైద్యవిద్య డైరెక్టర్ (డీఎంఈ) రమేశ్‌రెడ్డి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ పోస్టులకు ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అదే రోజున తుది జాబితా ప్రకటిస్తారు. ఎంపికైనవారు ఈ నెల 23వ తేదీ నాటికి ఆయా చోట్ల చేరాల్సి ఉంటుంది. ఏడాది పాటు ఆయా కాలేజీలు, ఆస్పత్రుల్లో ప్రొఫెసర్లుగా, అసోసియేట్ ప్రొఫెసర్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఎంపికలో తెలంగాణకు చెందినవారికి ప్రాధాన్యమిస్తారు. స్థానిక అభ్యర్థులు అందుబాటులో లేకుంటే ఇతర రాష్ట్రాల వారికి అవకాశం కల్పిస్తారు. నోటిఫికేషన్ నాటికి అభ్యర్థుల వయసు 69 ఏళ్లు దాటకూడదు.

రూ. లక్షా 90 వేల వరకు వేతనం

అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు నెలకు రూ.50 వేలు వేతనం ఇస్తారు. మిగతా విభాగాల అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.లక్షన్నర, ప్రొఫెసర్లకు రూ.1.90 లక్షలు ఇస్తారు. ఇవి కాంట్రాక్టు నియామకాలు కావడం వల్ల.. ఆయా పోస్టులకు ప్రమోషన్లు, రెగ్యులర్ నియామకాలు జరిగితే వీరిని తొలగిస్తారు. అనాటమీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 9 చొప్పున భర్తీ చేస్తారు. ఫిజియాలజీలో 9 ప్రొఫెసర్, ఏడు అసోసియేట్ ప్రొఫెసర్.. బయోకెమిస్ట్రీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 9 చొప్పున.. ఫార్మకాలజీలో ఏడు అసోసియేట్, పాథాలజీలో 9 అసోసియేట్, మైక్రోబయాలజీలో ఏడు అసోసియేట్, జనరల్ మెడిసిన్‌లో 9 ప్రొఫెసర్, డెర్మటాలజీలో 4 అసోసియేట్, సైకియాట్రీలో 9 అసోసియేట్, రెస్పిరేటరీ మెడిసిన్‌లో ఐదు అసోసియేట్, జనరల్ సర్జరీలో 9 ప్రొఫెసర్, ఆర్థోపెడిక్స్‌లో 9 అసోసియేట్, గైనకాలజీలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 9 చొప్పున, ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 9 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు.

ఎవరి సొమ్ముతో ఎవరు కులుకుతున్నారు?

▶ మొదటి పేజీ తరువాయి

పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పన్నుల రూపంలో కేంద్రానికి రూ.3.68 లక్షల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తే.. రూ.1.68 లక్షల కోట్లు మాత్రమే కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఇంకా రూ.2 లక్షల కోట్లు కేంద్రమే తీసుకుందన్నారు. 'ఇది వాస్తవం కాదని నిరూపిస్తే నేను మంత్రి పదవికి రాజీనామా చేస్తా.. లేదంటే నువ్వు రాజీనామా చేస్తావా?..' అని కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమంలోనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేదని, ఇప్పుడు మంత్రి పదవిని వదులుకుంటావని అనుకోనంటూ ఎద్దేవా చేశారు. దీనిపై తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కేటీఆర్.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వివిధ పనులకు శంకుస్థాపన, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

మేం అప్పులు చేయట్లేదు.. పెట్టుబడులు పెడుతున్నాం..

'బీజేపీ నాయకులు మతం పేరుతో రాజకీయం చేస్తున్నారు తప్ప, రాష్ట్రానికి వారు చేసిందేమీ లేదు. పైగా సిగ్గు, నీతి లేకుండా రాష్ట్రం అప్పుల పాలైందంటూ మాట్లాడుతున్నారు. మేము చేస్తోంది అప్పులు కాదు. భవిష్యత్ పెట్టుబడులు పెడుతున్నాం. రూ.30 వేల కోట్లతో 5 వేల





నల్లగొండ జిల్లా చండూరులో ఫ్లోరోసిస్ బాధితురాలు తిరుపతమ్మకు రూ. 5లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి ● హుజూర్‌నగర్ సభకు హాజరైన ప్రజలు.. (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న కేటీఆర్

మెగావాట్ల పవర్ ప్రాజెక్టు, రూ.40 వేల కోట్లతో మిషన్ భగీరథను చేపట్టి ఇంటింటికీ నీరు అందిస్తున్నాం. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులపై పెట్టుబడి పెట్టి సంపదను పునరుత్పత్తి చేస్తున్నాం. కేసీఆర్ 12 లక్షల మంది పెళ్లిళ్లు చేశారు. 11 లక్షల కేసీఆర్ కిట్లు, 66 లక్షల మందికి రూ.65 వేల కోట్ల రైతుబంధు, 90 వేల మందికి రైతు బీమా అందించిన ఘనత కూడా కేసీఆర్‌దే.

మోదీ ఏ వర్గానికీ న్యాయం చేయలేదు..

ప్రధాని మోదీ ఈ ఎనిమిదిన్నరేళ్ల కాలంలో చేసిన ఏ ఒక్క పనీ ప్రజలకు అక్కరకు రాలేదు. కేంద్రం ఏటా ఇస్తామన్న 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి? ప్రభుత్వ రంగ సంస్థలు అన్నింటినీ మూసివేస్తున్నారు. తెలంగాణ వచ్చినప్పుడు రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.24 లక్షలు ఉంటే ఇప్పుడది రూ.2.78 లక్షలకు పెరిగింది. దేశంలో మాత్రం రూ.1.49 లక్షలే ఉంది. దీన్నిబట్టే ఎవరు సమర్థులో, ఎవరు అసమర్థులో తెలుస్తుంది. దేశంలో 14 మంది ప్రధానమంత్రుల కాలంలో రూ.56 లక్షల కోట్ల అప్పులు ఉంటే ఈ ఎనిమిదిన్నరేళ్ల మోదీ పాలనలోనే రూ.100 లక్షల కోట్ల అప్పు చేశారు. దేశంలోని ప్రతి పౌరునిపై రూ.1.25 లక్షల అప్పు మోపారు. పేదలను కొట్టి పెద్దలకు పెడుతున్న మోదీ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలేదు. కేవలం మోదీ దోస్తులే సంపన్నులుగా మారారు..' అని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమకూ దక్కాలంటే బీఆర్ఎస్‌కు బాధ్యత అప్పగించాలని ఇతర రాష్ట్రాల ప్రజలు భావిస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి నమూనాగా చూపించారని, దీంతో కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలు అలాంటి అభివృద్ధిని కోరుకుంటున్నాయని చెప్పారు.

ప్రజల ఆశీర్వాదం ఉండాలి

చండూరు, గట్టుప్పల మండలాల్లో అభివృద్ధి పనులకు కూడా కేటీఆర్ శంకుస్థాపన చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై ప్రజల ఆశీర్వాదం ఉంటే.. మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, గ్యాదరి కిషోర్, రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎవర్ యూత్



ఫిట్ ఫుడ్

వయసు పెరిగే కొద్ది రకరకాల మార్పులు రావడం సహజం. ముఖ్యంగా ముఖంలో ముడతలు, ముఖం మెరుపు కోల్పోయి కళావిహీనం కావటం, కళ్లకింద ఉబ్బెత్తుగా ఉండటం, మంగు మచ్చలు వంటి సమస్యలు వస్తూ ఉంటాయి. వీటినుంచి ఉపశమనానికి, అందంగా కనిపించడానికి చాలా మంది మార్కెట్‌లో లభించే అనేకమైన కాస్మెటిక్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. అయితే వీటి వినియోగం వల్ల పరిష్కారం లభించకపోగా అనేక రకాల అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటికి బదులుగా కొన్ని రకాల ఆహారాన్ని తీసుకుంటూ సహజసిద్ధమైన ఫేస్‌ప్యాక్‌లను వాడటం వల్ల శరీరం యవ్వనంగా తయారవుతుంది. అంతేకాకుండా చాలా రకాల చర్మసమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

బొప్పాయి

దీనిలో చర్మానికి కావాల్సిన చాలా రకాల పోషకాలు ఉంటాయి కాబట్టి బొప్పాయి పండ్లను ప్రతి రోజూ తినడం మంచిది. బొప్పాయిలో యాంటీ ఏజింగ్ గుణాలు అధిక పరిమాణంలో ఉంటాయి కాబట్టి దీనిని తినడం వల్ల శరీరానికి అధిక పరిమాణం లో యాంటీ ఆక్సిడెంట్లు లభించి చర్మం ఆరోగ్యంగా మిలమిలలాడుతుంది. అంతేకాదు, అనేకరకాల చర్మ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది. బొప్పాయి గుజ్జును ఫేస్‌ప్యాక్‌లా వాడటం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది.

ఆకు కూరలు

ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి వీటిని ప్రతి రోజూ ఆహారంలో తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలు కలుగుతాయి. చర్మం ఆరోగ్యంగా, కళ్లు మెరుపులీనుతూ ఉండాలంటే ఆకుకూరలను ఆహారంలో తీసుకోవడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఆకుకూరల వాడకం వల్ల ఏ లోపం లేకుండా శరీరానికి సమృద్ధిగా విటమిన్లు అందుతాయి. అంతేగాక అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ముఖ్యంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడేవారికి మంచి ఫలితాలు లభిస్తాయి.



పాలు, బాదం

పాలలో ఉండే పోషకాల గురించి చిన్నప్పటినుంచి వింటున్నదే కాబటిట ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు. ఇక బాదం పప్పును ఏ విధంగా తీసుకున్నా అందులో చర్మాన్ని యవ్వనంగా ఉంచే లక్షణాలున్నాయి కాబట్టి రోజూ గుప్పెడు బాదం పప్పు తీసుకోవడం చాలా మంచిది.



ఫేషియల్ ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల ముడతలను సమర్థంగా నివారించవచ్చు. హాయిగా నవ్వేవాళ్లు ఎప్పుడూ ఆరోగ్యంగానే కాక అందంగాకూడా కనిపిస్తారు. వార్ధక్యం వీరిదరి చేరదా... అనిపించేలా ఉంటారు. నవ్వడం వల్ల ముఖంలోని కండరాలకు ఎక్సర్‌సైజ్ అంది రక్తప్రసరణ బాగా జరుగుతుంది. చర్మం పటుత్వంతో ఉంటుంది.



దానిమ్మ

దానిమ్మను ప్రతి రోజూ తీసుకోవడం వల్ల వృద్ధాప్యాన్ని ఆపడానికి సహాయపడుతుంది. చర్మం ఎక్కువ కాలం యవ్వనంగా ఉండాలంటే రోజూ ఆహారంలో దానిమ్మను వినియోగించాలి. దానిమ్మ రసాన్ని తాగడం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. షుగర్ ఉన్న వారు కూడా దానిమ్మను నిరభ్యంతరంగా తీసుకోవచ్చు.

పెరుగు

శరీరానికి కావాల్సిన ప్రోబయోటిక్స్ అధిక పరిమాణంలో లభించాలంటే ఆహారంలో పెరుగు తప్పనిసరిగా ఉండాల్సిందే. పెరుగును ఫేస్ ప్యాక్‌గా కూడా వాడచ్చు. ప్రతి రోజూ పెరుగును ఆహారంలో తీసుకుంటే ముడతలు తొలగిపోవడంతోపాటు చర్మంపై రంధ్రాలు, మచ్చలు లేకుండా ముఖ చర్మం మృదువుగా తయారవ్వుతుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచి పెరుగు తినే అలవాటు చేయడం మంచిది.



పైన చెప్పుకున్న వాటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల మందులు, సౌందర్య సాధనాలతో పనిలేకుండా యవ్వనంగా ఉండచ్చు.

● హెల్త్ టిప్స్

గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఫ్యాటీ ఫిష్ తినడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. చేపలలో ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి గుండెను ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.



కిడ్నీలో రాళ్లను తొలగించడంలో టొమాటో రసం బాగా ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితిలో రెండు టమోటాలను కడిగి వాటిని మెత్తగా రుబ్బుకోవాలి. ఈ జ్యూస్‌లో ఉప్పు, మిరియాల పొడి కలిపి వెంటనే తాగాలి. కావాలంటే తయారు చేసుకున్న మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు.



అరకప్పు పెరుగులో చెంచా నిమ్మరసం, అరస్పూను ఉప్పు వేసి ఆ మిశ్రమాన్ని బాగా కలుపుకుని తాగాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.



తులసి ఆకుల రసాన్ని తీసి దానికి ఒక చెంచా తేనె కలిపి ఈ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



రుచిగా ఉంది కదా అని ఒకోసారి పులిహోర ఎక్కువగా తినేస్తుంటాం. ఫలితంగా కడుపు బరువుగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ ఫీలింగ్ తగ్గాలంటే పులిహోర తిన్న వెంటనే - గోరు వెచ్చని నీరు ఒక గ్లాసుడు తాగేస్తే తొందరగా జీర్ణం అవుతుంది. వేడి కూడ చేయదు.



పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారంలో ఫ్యాట్ ఎక్కువగా ఉన్నప్పుడు ఏదో ఒక రూపంలో పుదీనా తీసుకుంటే అజీర్తి సమస్య ఉండదు.

పైత్యం, ఆ కారణంగా తలతిప్పటం వంటి సమస్యలున్నప్పుడు జీలకర్రను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్ట్‌ను నీటిలో కలిపి తాగాలి. ఇలా రెండు రోజుల పాటు రోజుకు రెండుసార్లు చేయాలి.

పొట్టకి సంబంధించిన పలు సమస్యలకు వెల్లుల్లి మంచి మందు, ఒకటి రెండు రెబ్బల వెల్లుల్లిని మెత్తగా నూరి ఆ రసాన్ని అరకప్పు నీటిలో కలిపి తాగడం వల్ల అరుగుదల సమస్య దూరం అవుతుంది. దాంతోపాటు పొట్టలో పురుగులు, శరీరంలోని విషపదార్థాలు నశిస్తాయి. కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది.



పొద్దున లేవగానే ఖాళీ కడుపుతో యాపిల్ పండు తింటే తలనొప్పి సమస్య తలెత్తదు.

రోజు ఉదయాన్నే ఒక గ్లాసు నీటిలో ఒక్కొక్కటి నాలుగైదు చొప్పున తులసి, వేప ఆకులను, ఐదారు మిరియాలను వేసి మరిగించి తాగాలి. (హై బిపితో బాధపడుతన్న వాళ్లు మినహాయించాలి).



ప్రతి రోజు అల్లంతో చేసిన టీని తాగుతుంటే జీర్ణ సమస్యలు, గ్యాస్, కడుపులో మంట మొదలైన పొట్టకి సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయి.

ప్రతిరోజు గోధుమ జావ తాగితే బీపీ ఉన్న వారికి మంచిది.

పెరిగే పిల్లలకు సోయాబీన్ మంచి పోషణని ఇస్తుంది. దేహదారుఢ్యానికి, పెరుగుదలకు దోహదం చేస్తుంది. శరీరం పెరుగుదలతో పాటు మెదడును వికసింపచేస్తుంది.

పొట్ట సమస్యలకు క్యారట్ జ్యూస్

పొట్ట సమస్యలతో బాధపడుతున్న వారికి క్యారెట్ జ్యూస్ ప్రభావవంతంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే గుణాలు శీతాకాలంలో వచ్చే పొట్ట సమస్యల నుంచి సులభంగా ఉపశమనం కలిగిస్తాయి. తరచు మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారు తప్పకుండా క్యారట్ జ్యూస్‌ను ప్రతిరోజు తాగాల్సి ఉంటుంది.

● క్యారట్ రసంలో విటమిన్ ఎ, సి, డి, కె మొదలైన అనేక రకాల విటమిన్లు లభిస్తాయి. కాబట్టి వీటిని ప్రతి రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి చాలా రకాల ప్రయోజనాలను చేకూర్చుతుంది. క్యారట్‌లో బీటా కెరోటిన్ అనే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ అధిక పరిమాణంలో లభిస్తుంది. కాబట్టి శరీర బరువును నియంత్రించడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది.

● మలబద్ధకంతో బాధపడుతున్న వారికి క్యారట్ జ్యూస్ ప్రభావవంతంగా పని చేస్తుంది. ఇందులో ఉండే గుణాలు జీర్ణవ్యవస్థను శక్తిమంతంగా చేసి అనారోగ్య సమస్యల నుంచి శరీరాన్ని కాపాడతాయి. కాబట్టి పొట్ట సమస్యలు, బరువు తగ్గాలనుకునేవారు ప్రతి రోజూ ఖాళీ కడుపుతో క్యారట్ జ్యూస్ తీసుకోవడం మంచిది.



● మీకు తెలుసా

తల తిరగడం గుండె వైఫల్యానికి సంకేతంగా తీసుకోవాల్సి ఉంటుంది. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది. కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకుని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యుని కలిసి తగిన పరీక్షలు చేయించుకుని ఏ సమస్యా లేదని తెలిస్తే నిశ్చింతగా ఉండవచ్చు.



సినిమా

జైలర్‌కు అతిథిగా...



● రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలో మలయాళ స్టార్ మోహన్‌లాల్ కనిపించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ 'జైలర్' సినిమాను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో, తమన్నా కీ రోల్ చేస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నైలో జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో మోహన్‌లాల్ కూడా నటిస్తున్నట్లు తెలిసింది. మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించనున్నారని, ఈ వారంలోనే షూటింగ్‌లో జాయిన్ అవుతారని కోలీవుడ్ సమాచారం. కాగా 'జైలర్' సినిమాను ఏప్రిల్ 14న విడుదల చేయాలని అనుకుంటున్నారు.




● మోహన్‌లాల్

మరో సవాల్

ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యం చూపించ డానికి హీరో విక్రమ్ ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటారు. సరికొత్త పాత్రలను చాలెంజ్‌గా తీసుకుని ఎంతో కష్టపడుతుంటారు. 'శివపుత్రుడు', 'ఐ', 'కోబ్రా' వంటి సినిమాల్లో విక్రమ్ చేసిన పాత్రలే ఇందుకు ఉదాహరణ. కాగా ప్రేక్షకులను మరోసారి అబ్బురపరిచేందుకు విక్రమ్ మరో సవాల్‌లాంటి పాత్ర చేస్తున్నారు. విక్రమ్ హీరోగా 'కబాలి' ఫేమ్ పా. రంజిత్ దర్శకత్వంలో 'తంగలాన్' అనే సినిమా తెరకెక్కుతోంది. పీరియాడికల్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో విక్రమ్ ఓ గిరిజన తెగ నాయకుడి పాత్రలో నటిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ పాత్ర కోసం విక్రమ్ ప్రోస్థటిక్ మేకప్ వేసుకుంటున్నారు. ఈ మేకప్‌కి నాలుగు గంటలు పడుతోందట. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చెన్నైలో జరుగుతోంది. తదుపరి షెడ్యూల్‌ను కర్ణాటకలో ప్లాన్ చేశారు. పార్వతీ మీనన్, మాళవికా మోహనన్, పశుపతి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోంది.



● విక్రమ్



● నాగచైతన్య

చివరి షెడ్యూల్ షురూ

'బంగార్రాజు' వంటి హిట్ చిత్రం తర్వాత అక్కినేని నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటిస్తున్న ద్వితీయ చిత్రం 'కస్టడీ'. వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు–తమిళ భాషల్లో ఈ చిత్రం రూపొందుతోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. కాగా ఈ చిత్రం చివరి షెడ్యూల్‌ని శుక్రవారం ప్రారంభించారు. ''నాగచైతన్య కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రాల్లో మా 'కస్టడీ' ఒకటి. కొత్త సంవత్సరం కానుకగా విడుదలైన గ్లింప్స్‌లో నాగచైతన్య ఫెరోషియస్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చివరి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణంపై సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఈ సినిమాని ఈ ఏడాది మే 12న విడుదల చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, కెమెరా: ఎస్‌ఆర్ కదిర్, సమర్పణ: పవన్ కుమార్.

శర్వానంద్ పెళ్లి ఫిక్స్



హీరో శర్వానంద్ బ్యాచిలర్ లైఫ్‌కి బై బై చెప్పనున్నారు. త్వరలోనే ఫ్యామిలీ లైఫ్‌కి హాయ్ చెప్పేందుకు రెడీ అవుతున్నారు. అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌తో ఆయన ఏడడుగులు వేయనున్నారు. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్న అమ్మాయితో కొత్త జీవితంలోకి అడుగు పెట్టేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది. ఈ నెల 26న శర్వానంద్ నిశ్చితార్థం జరగనుంది. ఏప్రిల్‌లో వీరి పెళ్లికి ముహూర్తం ఖరారు చేశారు.. పెళ్లి తేదీని 26న ప్రకటించే అవకాశం ఉంది. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం అని సమాచారం.



● తమన్నా

యువరాణి

పదిహేనేళ్లకు పైగా అగ్ర కథానాయికల్లో ఒకరిగా రాణిస్తున్న తమన్నా తొలిసారి ఓ మలయాళ సినిమా చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మలయాళ హిట్ ఫిల్మ్ 'రామ్‌లీల' (2017) తర్వాత హీరో దిలీప్, దర్శకుడు అరుణ్ గోపీ కాంబినేషన్‌లో తాజాగా మరో సినిమా తెరకెక్కుతోంది. 'బాంద్రా' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఇందులో తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆమె కెరీర్‌లో ఇదే తొలి మలయాళ సినిమా. కాగా కొచ్చిలో జరుగుతున్న ఈ సినిమా షూటింగ్‌లో తమన్నా పాల్గొననున్నారు. ఈ నెల 20 నుంచి తమన్నా ఈ సినిమా షెడ్యూల్‌లో జాయిన్ అవుతారట. ఆ తర్వాత ముంబై లొకేషన్స్‌లో మరో షెడ్యూల్‌ను ప్లాన్ చేసిందట చిత్ర యూనిట్. కాగా ఈ సినిమాలో తమన్నా యువరాణి తరహా పాత్ర చేస్తున్నారని టాక్. ఈ పాత్ర మలయాళం, హిందీ భాషలు మాట్లాడుతుందట. కొచ్చితో పాటు ముంబై నేపథ్యంలోనూ సినిమా సాగుతుందని సమాచారం. ఈ సంగతి ఇలా ఉంచితే.. నటుడు విజయ్ వర్మతో తమన్నా ప్రేమలో ఉన్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల కొత్త సంవత్సరాన్ని ఈ ఇద్దరూ గోవాలో జరుపుకున్నారంటూ కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ వార్త గురించి ఇటు తమన్నా కానీ అటు విజయ్ వర్మ కానీ స్పందించలేదు.

ఆర్ట్ డైరెక్టర్ సునీల్ మృతి



ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్, ప్రొడక్షన్ డిజైనర్ సునీల్ బాబు (50) మృతి చెందారు. గురువారం అర్ధరాత్రి ఆయనకి గుండెపోటు రావడంతో కేరళలోని ఎర్నాకుళంలో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. మలయాళ, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాలకు ఆర్ట్ డైరెక్టర్‌గా చేశారు సునీల్ బాబు. తెలుగులో 'రామయ్యా వస్తావయ్యా, మహర్షి, లక్ష్య, సీతారామం', తమిళంలో 'గజినీ, బెంగుళూరు డేస్' వంటి పలు చిత్రాలకు పని చేశారాయన. సునీల్ బాబు చేసిన తాజా చిత్రం 'వారసుడు' (తమిళంలో 'వారిసు') ఈ నెల 11న విడుదల కానుంది. కాగా ప్రభాస్–దీపికా పదుకోన్ జంటగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'ప్రాజెక్ట్ కె' చిత్రానికి కూడా సునీల్ పని చేస్తున్నారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సునీల్ బాబు మృతిపట్ల హీరో దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ హను రాఘవపూడి, వైజయంతీ మూవీస్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు నివాళి అర్పిస్తూ, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

వేసవిలో చోరుడు



● 'చోరుడు'లో ఓ దృశ్యం

జీవీ ప్రకాశ్, ఇవానా జంటగా ప్రముఖ దర్శకుడు భారతీరాజా ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'చోరుడు'. పీవీ శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు సినిమాటోగ్రఫీ అందించారు. ఢిల్లీ బాబు నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హీరో ధనుష్ విడుదల చేశారు. పోస్టర్ చూస్తుంటే ఈ చిత్ర కథ అటవీ నేపథ్యంలో ఉంటుందని తెలుస్తోంది. సినిమాని వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు పోస్టర్ ద్వారా తెలియజేశారు. ''అడ్వెంచర్, థ్రిల్లర్ అంశాలతో కూడిన కామెడీ డ్రామా 'చోరుడు'. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ట్రైలర్, ఆడియో, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పూర్ణేష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కె.వి. దురై.

సాక్షి బిజినెస్
శనివారం
7-1-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
453	133
59,900	17,859

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	10,496	△ 193
డోజోన్స్	33,527	△ 597
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,699	△ 66
డాక్స్	14,610	△ 174
షాంఘై	3,158	△ 2
నికాయ్	25,974	△ 153

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	55,587 ▽ 209
బంగారం (99.5 స్వచ్ఛత)	55,363 ▽ 210
వెండి (కేజీ)	67,888 △ 210

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.57	80.89
£	బ్రిటన్ పౌండ్	84.69	89.20
€	యూరో	95.75	100.59
¥	జపాన్ ఎన్ (100)	49.00	74.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	53.40	58.24
S$	సింగపూర్ డాలర్	59.15	63.68
SAR	సౌదీ రియాల్	21.06	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	21.62	23.42
¥	చైనా యువాన్	10.93	12.96

అమెజాన్ ఇండియాలో 1,000 ఉద్యోగాల కోత



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సిబ్బందిని తగ్గించుకునే ప్రక్రియలో భాగంగా ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కంపెనీకి భారత్‌లో 1 లక్ష మంది ఉద్యోగులు ఉండగా సుమారు 1 శాతం సిబ్బందిపై ఉద్వాసనల ప్రభావం పడవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రపంచవ్యాప్తంగా 18,000 మందిని తొలగించాలని నిర్ణయం తీసుకోవడంతో భారత్‌లో 1,000 మంది సిబ్బందిపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాయి. మరోవైపు అంతర్జాతీయంగా తమ అమెజాన్ స్టోర్స్, పీఎక్స్‌టీ (పీపుల్, ఎక్స్‌పీరియన్స్, టెక్నాలజీ) విభాగాల్లో ఎక్కువగా కోతలు ఉండనున్నాయని కంపెనీ ప్రతినిధి తెలిపారు. 2021 డిసెంబర్ 31 నాటికి అమెజాన్‌లో 16,08,000 మంది ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉన్నారు.

హైదరాబాద్‌లో జీ స్క్వేర్ రెండో ప్లాట్ ప్రాజెక్టు

హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో ప్రముఖ ప్లాట్ ప్రమోటర్ జీ స్క్వేర్ ఎపిటోమ్ హౌసింగ్ సంస్థ హైదరాబాద్‌లో రెండో ప్రతిష్టాత్మక ప్లాట్ ప్రాజెక్టును చేపట్టింది. 'కాబోయే గచ్చిబౌలి'గా పేర్కొంటున్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి మార్గంలో 1,242 ఎకరాల విస్తీర్ణంలో జీ స్క్వేర్ ఎపిటోమ్ ఇంటిగ్రేటెడ్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మొదటి దశ ప్రాజెక్ట్‌లో 368 ఎకరాలను 140కు పైగా అంతర్జాతీయ సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నారు. వంద ఎకరాల గోల్ఫ్ కోర్స్, 40 ఎకరాల లగ్జరీ రిసార్ట్, వెల్‌నెస్ కేంద్రం, స్పోర్ట్స్ అకాడెమీ, స్కూల్, కాలేజీతో పాటు మరెన్నో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలు ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉంటాయి. ''ఇటీవల బీఎన్ రెడ్డి నగర్‌లో ఆవిష్కరించిన మా మొదటి ప్రాజెక్ట్ జీ స్క్వేర్ ఈడెన్ గార్డెన్‌కు అపూర్వ స్పందన లభించింది. ఈ స్ఫూర్తితో పలు లైఫ్‌స్టైల్ ఫీచర్లతో 1242 ఎకరాల విస్తీర్ణంలో మరో ఇంటిగ్రేటెడ్ సిటీని ప్రారంభించాము. రాబోయే కొద్ది ఏళ్లలో తూర్పు కారిడర్‌లో భారీగా ధరలు పెరగనున్నాయి. ఇప్పుడు పెట్టుబడులు పెట్టిన వారికి మంచి రాబడులు వస్తాయి'' అని జీ స్క్వేర్ హౌసింగ్ సీఈవో ఈశ్వర్ ఎన్ తెలిపారు.



ఈ ఏడాది వృద్ధి 7 శాతమే!

- తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు
- కేంద్రం తొలి ముందస్తు అంచనా గణాంకాలు విడుదల



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2022-23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికి పరిమితం అవుతుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) తొలి ముందస్తు అంచనాలు వెల్లడించాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే (8.7 శాతం) ఇది 1.7 శాతం తక్కువ కావడం గమనార్హం. తయారీ, మైనింగ్ రంగాల పేలవ పనితీరు వృద్ధి రేటు అంచనా భారీ తగ్గదలకు కారణమని తొలి అంచనాలు వెలువరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగంలో అసలు వృద్ధిలేకపోగా 1.6 శాతం క్షీణత నమోదవుతుందని ఎన్ఎస్ఓ అంచనా. 2021-22లో ఈ రంగం 9.9% వృద్ధిని నమోదు చేసింది. మొత్తం ఎకానమీలో పారిశ్రామిక రంగం వెయిటేజ్ దాదాపు 15 శాతంకాగా ఇందులో మెజారిటీ వాటా తయారీ రంగానికి కావడం గమనార్హం. ఇక మైనింగ్‌లో కూడా వృద్ధి రేటు 11.5 శాతం నుంచి 2.4%కి పడిపోతుందని అంచనాలు వెలువడ్డం గమనార్హం. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 6.8% అంచనాలకన్నా కేంద్రం అంచనాలు 20 బేసిస్ పాయింట్లు అధికంగా ఉండడం గమనార్హం. ఎన్ఎస్ఓ ప్రకటనలో ముఖ్యాంశాలు ఇవీ..

- జీడీపీలో దాదాపు 15 శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగంలో వృద్ధి 3.5 శాతంగా ఉండనుంది. 2021-22లో ఈ రేటు 3%.
- ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్లు,, బ్రాడ్‌కాస్టింగ్ విభాగానికి సంబంధించిన సర్వీసుల వృద్ధి రేటు 11.1 శాతం నుంచి 13.7 శాతానికి చేరనుంది.
- ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలలో వృద్ధి రేటు 4.2% నుంచి 6.4%కి పెరగనుంది.
- అయితే నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 11.5%నుంచి 9.1 శాతానికి తగ్గనుంది.
- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవల వృద్ధి రేటు కూడా 12.6% నుంచి 7.9%కి పడనుంది.
- స్థూల విలువ జోడింపు (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్- జీవీఏ) ప్రాతిపదికన 2022-23లో వృద్ధి రేటు 8.1% నుంచి 6.7%కి తగ్గనుంది. ఆర్థిక వ్యవస్థలో ఒక ప్రాంతం, పరిశ్రమ లేదా రంగంలో ఉత్పత్తి చేసిన వస్తువులు, సేవల విలువే జీవీఏ. ఇంకా చెప్పాలంటే జీడీపీలో ఒక నిర్దిష్ట రంగం ఉత్పత్తి తోడ్పాటును జీవీఏ ప్రతిబింబిస్తుంది. అన్ని రంగాల జీవీఏలను కలిపి, పన్నులు-సబ్సిడీలకు సంబంధించి అవసరమైన సర్దుబాటు చేస్తే ఆర్థిక వ్యవస్థ జీడీపీ విలువ వస్తుంది.

ఎన్ఎస్ఓ అంచనా విలువల్లో.. 2011-12 స్థిర ధరల ప్రాతిపదికన (ద్రవ్యోల్బణం సర్దుబాటు చేస్తూ) వాస్తవ జీడీపీ విలువ 2021-22లో రూ.147.36 లక్షల కోట్లయితే, ఇది 2022-23లో రూ.157.60 లక్షల కోట్లకు పెరగనుందని ఎన్ఎస్ఓ తాజా అంచనా. అంటే వృద్ధి రేటు 7 శాతం అన్నమాట.

2022-23పై పలు సంస్థల అంచనాలు (శాతాల్లో)

సంస్థ	అంచనా
ఐఎంఎఫ్	6.8
ప్రపంచ బ్యాంక్	6.9
ఫిక్కీ	7.0
సిటీగ్రూప్	6.7
గోల్డ్‌మన్ శాక్స్	7.0
ఆర్‌బీఐ	6.8
ఏడీబీ	7.0
ఎస్‌బీఐ	6.8
మూడీస్	7.6
క్రిసిల్	7.3
ఇండియా రేటింగ్స్	6.9

లోటస్ చాకొలెట్‌లో మరింత వాటా

రిలయన్స్ ఓపెన్ ఆఫర్



న్యూఢిల్లీ: లోటస్ చాకొలెట్‌లో మరో 26 శాతం వాటా కొనుగోలుకి రిలయన్స్ గ్రూప్ కంపెనీలు రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్, రిలయన్స్ రిటైల్ వెంచర్స్ ఓపెన్ ఆఫర్ ప్రకటించాయి. లోటస్ చాకొలెట్ వాటాదారుల నుంచి ఈ వాటాను సొంతం చేసుకునేందుకు ఓపెన్ ఆఫర్ చేపట్టనున్నట్లు తెలియజేశాయి. ఇందుకు షేరుకి రూ. 115.5 ధరను నిర్ణయించినట్లు 2 సంస్థల తరఫున ఆఫర్‌ను చేపట్టనున్న డీఏఎం క్యాపిటల్ తెలియజేసింది. తద్వారా 33.38 లక్షల షేర్లను కొనుగోలు చేయనున్నట్లు తెలియజేసింది. పూర్తి వాటాకు రూ. 38.56 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఓపెన్ ఆఫర్ ఫిబ్రవరి 21న ప్రారంభమై మార్చి 6న ముగియనున్నట్లు పబ్లిక్ నోటీస్ ద్వారా తెలియజేసింది.

3 నెలల గరిష్టం

రిలయన్స్ సంస్థలు కన్నేయడంతో లోటస్ చాకొలెట్ షేరు బీఎస్ఈలో గురువారం రూ. 149ను దాటి ముగిసింది. ఇది మూడు నెలల గరిష్టంకాగా.. శుక్రవారం(6న) సైతం షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. రూ. 157 సమీపంలో నిలిచింది. కంపెనీ చాకొలెట్లు, కోకోవా ప్రొడక్టులు, డెరివేటివ్స్‌ను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. రిలయన్స్ కన్జూమర్.. రిలయన్స్ రిటైల్ ఎఫ్ఎంసీజీ విభాగంకాగా.. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూప్ కంపెనీలివి. లోటస్ చాకొలెట్‌లో గత వారమే రిలయన్స్ కన్జూమర్ ప్రమోటర్ల నుంచి 51 శాతం వాటాను చేజిక్కించుకుంది.

మూడోరోజూ బేర్ గుప్పిట్లో మార్కెట్

- 60 వేల దిగువకు సెన్సెక్స్
- తొలి వారం నష్టాల ముగింపు
- నిఫ్టీ 133 పాయింట్ల పతనం
- ఎఫ్ఎంసీజీ షేర్లకు మాత్రమే లాభాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ఈ కొత్త ఏడాది తొలి వారాన్ని నష్టాలతో ముగించింది. ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ విధాన వైఖరి భయాలతో దేశీయ స్టాక్ సూచీలు మూడోరోజూ నష్టాలు మూటగట్టుకున్నాయి. భారత మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం, ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం, ప్రపంచ మార్కెట్లలో బలహీనతలు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి నేలచూపులు తదితర అంశాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 453 పాయింట్లు నష్టపోయి 59,900 వద్ద స్థిరపడింది. ఈ సూచీలో ఐదు షేర్లు మాత్రమే లాభపడగా, మిగిలిన అన్ని దెబ్బతిన్నాయి. నిఫ్టీ 133 పాయింట్లు పతనమై 17,859 వద్ద నిలిచింది. ఉదయం అతి స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు.., అంతర్జాతీయ ప్రతికూల సంకేతాల నేపథ్యంలో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 683 పాయింట్లు క్షీణించి 59,670 వద్ద, నిఫ్టీ 196 పాయింట్లను కోల్పోయి 17,796 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.73%, 0.72 శాతం చొప్పున నష్టపోయాయి.

బ్యాంక్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు

- ప్రత్యామ్నాయ మార్గాల్లో రీ-కేవైసీ
- స్పష్టం చేసిన రిజర్వ్ బ్యాంక్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కేవైసీ విషయంలో బ్యాంక్ ఖాతాదారులకు ఊరట కలిగించేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. చెల్లుబాటు అయ్యే పత్రాలను ఖాతాదారులు ఇప్పటికే బ్యాంక్‌కు సమర్పించి తమ చిరునామాను మార్చుకోనట్లయితే.. నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాలను అప్‌డేట్ చేయడానికి ఇకపై వారి బ్యాంక్ శాఖలను సందర్శించాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. కేవైసీ సమాచారంలో ఎటువంటి మార్పు లేకుంటే కస్టమర్లు నమోదిత ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా స్వీయ డిక్లరేషన్‌ను సమర్పించవచ్చు. కేవైసీ అప్‌డేషన్ కోసం కస్టమర్లు శాఖల సందర్శన కోసం బ్యాంకులు పట్టుబట్టరాదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్న నేపథ్యంలో.. రిజర్వ్ బ్యాంక్ గురువారం దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం కేవైసీ సమాచారంలో ఎటువంటి మార్పు లేకుంటే.. తిరిగి కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి వినియోగదారు నుండి సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోతుంది. ఇందుకు తగు ఏర్పాట్లు చేయాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. చిరునామాలో మార్పు మాత్రమే ఉన్నట్లయితే వినియోగదార్లు ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్, ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా సవరించిన/నవీకరించిన చిరునామాను అందించవచ్చు.

జనవరి 25న తొలి విడత గ్రీన్ బాండ్ల జారీ

2 విడతల్లో రూ.16,000 కోట్ల సమీకరణ



ముంబై: రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) జనవరి 25, ఫిబ్రవరి 9వ తేదీల్లో.. రెండు విడతలుగా సావరిన్ గ్రీన్ బాండ్లు (ఎస్‌జీఆర్ బాండ్స్) జారీ చేయనుంది. రెండు విడతల ద్వారా రూ.8,000 కోట్ల చొప్పున మొత్తం రూ.16,000 కోట్ల సమీకరణ లక్ష్యం. కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంగా ప్రభుత్వ రంగ ప్రాజెక్టులకు ఈ నిధులను సమకూర్చడం జరుగుతుంది. వార్షిక బడ్జెట్ (2022-23)లో ప్రకటించిన విధంగా, కేంద్ర ప్రభుత్వం తన మొత్తం మార్కెట్ రుణాలలో భాగంగా గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం వనరులను సమీకరించడానికి సావరిన్ గ్రీన్ బాండ్‌లను జారీ చేస్తుంది.

గ్లాండ్ ఫార్మా చేతికి సినెక్సీ

100% వాటా కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: ఔషధ రంగ హైదరాబాద్ కంపెనీ గ్లాండ్ ఫార్మా.. యూరోపియన్ సంస్థ సినెక్సీ గ్రూప్‌లో పూర్తి వాటాను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. 100 శాతం వాటా కొనుగోలుకి ఎఫ్‌పీసీఐ సినో ఫ్రెంచ్ మిడ్‌క్యాప్ ఫండ్‌తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. సింగపూర్‌లోని సొంత అనుబంధ సంస్థ గ్లాండ్ ఫార్మా ఇంటర్నేషనల్ పీటీఈ ద్వారా వాటా కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలియజేసింది. గతేడాది నవంబర్‌లో చేసుకున్న పుట్ ఆప్షన్ ఒప్పందం ప్రకారం 12 కోట్ల యూరోల(సుమారు రూ. 1,015 కోట్లు)కు సినెక్సీ గ్రూప్‌ను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించింది. అనుబంధ సంస్థలతోపాటు 2004లో ఏర్పాటైన సినెక్సీ గ్రూప్ ప్రధానంగా ఫార్మాస్యూటికల్ ప్రొడక్టుల కాంట్రాక్ట్ తయారీ, అభివృద్ధి సంస్థ(సీడీఎంవో)గా సేవలందిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్

హుసాముద్దీన్‌కు స్వర్ణం

జాతీయ సీనియర్ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ బంగారు పతకం సాధించాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన అతను సర్వీసెస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఎస్‌సీబీ)కు ప్రాతినిధ్యం వహించాడు. 57 కేజీల ఫైనల్లో హుసాముద్దీన్ 4-1తో సచిన్ (రైల్వేస్)ను ఓడించాడు. హిస్సార్‌లో శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో సర్వీసెస్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకుంది. ఈ జట్టుకు చెందిన బాక్సర్లు మొత్తం 10 పతకాలు సాధించారు. ఇందులో ఆరు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలున్నాయి. భారత మేటి బాక్సర్ శివ థాపా (అస్సామ్) స్వర్ణం సాధించాడు. 63.5 కేజీల ఫైనల్లో అతను అంకిత్ నర్వాల్ (రైల్వేస్)పై గెలుపొందాడు. సర్వీసెస్ బాక్సర్లలో విశ్వామిత్ర చొంగ్తామ్ (51 కేజీలు), సచిన్ (51 కేజీలు), ఆకాశ్ (67 కేజీలు), సుమిత్ (75 కేజీలు), వాకోవర్‌తో నరేందర్ (ప్లస్ 92 కేజీలు) పసిడి పతకాలు గెలిచారు.



ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తేనే...



- సిరీస్ విజయంపై భారత్ దృష్టి
- నేడు శ్రీలంకతో చివరి టి20
- టీమిండియాపైనే ఒత్తిడి
- రా.గం.7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్-1'లో ప్రసారం

రాజ్‌కోట్: టి20 సిరీస్‌లో ఆఖరి పోరుకు భారత్, శ్రీలంక సిద్ధమయ్యాయి. ఇరు జట్ల లక్ష్యం ఒక్కటే... సిరీస్ వశం చేసుకోవడం. దీంతో నిర్ణాయక పోరు మరింత ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్ ఫలితం, ప్రదర్శన చూస్తే ఆతిథ్య జట్టు కంటే శ్రీలంక జట్టే మేటిగా ఉంది. టీమిండియా గతి తప్పిన బౌలింగ్, టాపార్డర్ వైఫల్యం ఏమాత్రం కొనసాగినా మ్యాచే కాదు... సిరీస్‌నే మూల్యంగా చెల్లించుకోవాల్సి వుంటుంది. ఈ నేపథ్యంలో ఒత్తిడంతా భారత శిబిరంపైనే ఉంది. పొట్టి సిరీస్ గెలుచుకోవాలంటే గట్టి పోరాటం చేయాల్సిందే!

ఓపెనర్లు మెరిపించాలి

గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్ నిరాశపరిచారు. వీరిద్దరు శుభారంభం ఇవ్వలేకపోయారు. తొలి మ్యాచ్‌లో కిషన్ రాణించినా పెద్దగా మెరిపించలేకపోయాడు. కీలకమైన ఆఖరి పోరులో ఇద్దరు బాధ్యత తీసుకోవాలి. లేదంటే అది ఇన్నింగ్స్‌పై కచ్చితంగా ప్రభావం చూపిస్తుంది. సూర్యకుమార్ ఫామ్‌లో ఉన్నాడు. అతనిపై జట్టు మేనేజ్‌మెంట్‌కు ఏ బెంగా లేదు. అక్షర్ పటేల్ రూపంలో అదనపు బ్యాటింగ్ బలం కనిపిస్తున్నప్పటికీ రెగ్యులర్ బ్యాటర్లు హార్దిక్ పాండ్యా, దీపక్ హుడా బ్యాట్లకు పనిచెబితేనే లంక బౌలింగ్‌పై పట్టు సాధించవచ్చు. అప్పుడే పోరాడే స్కోరైనా... ఛేదించే లక్ష్యమైనా సాకారమవుతుంది.

బెంగంతా బౌలింగ్‌పైనే...

ఈ సిరీస్‌లో భారత బౌలింగ్ తీసికట్టుగానే ఉంది. ప్రధాన బౌలర్లే ఓవర్‌కు పది పైచిలుకు పరుగులు ఇవ్వడం జట్టును ఆందోళన పరుస్తోంది. అర్ష్‌దీప్ గత మ్యాచ్ 'నోబాల్స్'ను మరిచి లయ అందుకోవాల్సి ఉంది. ఉమ్రాన్ మలిక్ నిప్పులు చెరుగుతున్నప్పటికీ వైవిధ్యం కొరవడటంతో ధారాళంగా పరుగులు సమర్పించుకుంటున్నాడు. చహల్ మ్యాజిక్ కరువైంది. మొత్తంగా నిలకడలేని బౌలింగ్ జట్టుకు ప్రతికూలంగా పరిణమించింది. నిర్ణాయక పోరులో సమష్టి బాధ్యత కనబరిస్తే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. లేదంటే కష్టాలు తప్పవు.

ఆత్మవిశ్వాసంతో లంక సేన

గత మ్యాచ్ ఫలితమే కాదు... ఆటతీరు కూడా శ్రీలంక జట్టులో ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచింది. బ్యాటింగ్‌లో మెరుపులు, ఆరంభంలో వికెట్లు షనక సేనను పైచేయిగా నిలబెట్టింది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండిస్‌లతో పాటు అసలంక, షనక ఫామ్‌లో ఉన్నారు. బౌలింగ్‌లో కసున్ రజిత, మదుషంక, షనక సమష్టిగా భారత బ్యాటర్స్‌ను వణికించారు. సిరీస్‌ను తేల్చే ఈ మ్యాచ్‌లోనూ తమ జోరు కనబరచాలనే పట్టుదలతో ఉన్నారు. ముఖ్యంగా బ్యాటింగ్‌కు స్వర్గధామమైన రాజ్‌కోట్ పిచ్‌పై మరోసారి తమ బ్యాటింగ్ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్, దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, అక్షర్ పటేల్, చహల్, అర్ష్‌దీప్, శివమ్ మావి, ఉమ్రాన్ మాలిక్.


శ్రీలంక: షనక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, అసలంక, భానుక రాజపక్స, ధనంజయ డిసిల్వా, హసరంగ, కరుణరత్నే, తీక్షణ, మదుషంక, కసున్ రజిత.

పిచ్-వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన వికెట్ ఇది. కాబట్టి ప్రేక్షకులకు మెరుపుల విందు, మ్యాచ్‌లో భారీ స్కోర్లు గ్యారంటీ. టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కే మొగ్గు చూపుతుంది. వర్షం ముప్పు లేదు.

'కాస్త సహనం ప్రదర్శించాలి'

- వచ్చే టి20 ప్రపంచకప్‌కు జట్టును సిద్ధం చేస్తున్నాం
- భారత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్



పుణే: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ కోసం జట్టును తీర్చిదిద్దే పనిలో ఉన్నామని, కుర్రాళ్ల ప్రదర్శన విషయంలో కాస్త సహనం ప్రదర్శించాలని భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యానించాడు. యువ ఆటగాళ్లకు మరింత అనుభవం కావాలని అతను అభిప్రాయం వ్యక్తం చేశాడు. గురువారం శ్రీలంక చేతిలో 16 పరుగుల తేడాతో భారత్ ఓడిన తర్వాత ద్రవిడ్ మీడియాతో మాట్లాడాడు. 'భారత జట్టులోని కుర్రాళ్లలో మంచి ప్రతిభ ఉంది. అయితే ఇంకా నేర్చుకునే దశలో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడుతూ ఉంటేనే నేర్చుకునేందుకు అవకాశం ఉంటుంది. అందుకే వారి విషయంలో మనం కాస్త ఓపిక ప్రదర్శించాలి. వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్ కోసమే ఈ టీమ్‌ను సిద్ధం చేస్తున్నాం. వరల్డ్ కప్ సెమీ ఫైనల్ ఆడిన టీమ్‌తో పోలిస్తే జట్టులో చాలా మారింది. ముగ్గురు, నలుగురు మాత్రమే ప్రస్తుత తుది జట్టులో ఉన్నారు' అని ద్రవిడ్ చెప్పాడు. ఈ వ్యాఖ్యతో టి20 క్రికెట్‌లో కోహ్లి, రోహిత్ శర్మవంటి సీనియర్ల ఆట ముగిసిందని ద్రవిడ్ పరోక్షంగా చెప్పినట్లయింది. ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్‌కప్‌పైనే అందరి దృష్టీ ఉంటుంది కాబట్టి కొత్త కుర్రాళ్లకు టి20ల్లో అవకాశం ఇచ్చేందుకు ఇదే సరైన సమయంగా ద్రవిడ్ భావిస్తున్నాడు. 'వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్ కప్‌ల గురించి అంతా ఆలోచిస్తున్నారు. అందుకే ఈ ఫార్మాట్‌లో కొత్తవారికి అవకాశాలు అవసరం. వారికి తగినన్ని మ్యాచ్‌లు ఇచ్చి అండగా నిలవడం అవసరం. కుర్రాళ్లు ఉన్న టీమ్‌లకు ఇలాంటి మ్యాచ్‌లలో ఓటములు సహజమని అర్థం చేసుకోవాలి' అని ద్రవిడ్ స్పష్టం చేశాడు.

గ్రాండ్‌మాస్టర్‌గా ప్రణేశ్

రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన భారత కుర్రాడు



స్టాక్‌హోమ్: తమిళనాడుకు చెందిన 16 ఏళ్ల ఎం.ప్రణేశ్ భారత 79వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపు పొందాడు. స్టాక్‌హోమ్‌లో జరిగిన రిల్టన్ కప్‌లో విజేతగా నిలిచిన ప్రణేశ్ టైటిల్ గెలుచుకోవడంతో పాటు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా సాధించాడు. ఈ టోర్నీకి ముందే అతను మూడు జీఎం నార్మ్‌లు పొందగా, ఇప్పుడు 2500 ఎలో రేటింగ్ పాయింట్లు (లైవ్) కూడా దాటాడు. 'ఫిడే' సర్క్యూట్‌లో తొలి టోర్నీ అయిన రిల్టన్ కప్‌లో ప్రణేశ్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. 136 మంది ఆటగాళ్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఆడిన 9 గేమ్‌లలో అతను 8 గెలిచి ఒకటి ఓడాడు. తెలంగాణకు చెందిన రాజా రిత్విక్ 6 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచాడు. ప్రముఖ చెస్ కోచ్ ఆర్‌బీ రమేశ్ వద్ద ప్రణేశ్ శిక్షణ పొందుతున్నాడు. 'అద్భుత ప్రదర్శన కనబర్చిన ప్రణేశ్‌కు నా అభినందనలు. మంచి స్కోరుతో అతను విజేతగా నిలిచాడు. మన దేశంలో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య వేగంగా పెరుగుతోంది' అని దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్పందించారు.

ఆంధ్ర ఘన విజయం

154 పరుగులతో హైదరాబాద్ చిత్తు



సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి'లో ఆంధ్ర జట్టు కీలక విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం ముగిసిన మ్యాచ్‌లో ఆంధ్ర 154 పరుగుల తేడాతో హైదరాబాద్‌ను చిత్తు చేసింది. 401 పరుగుల లక్ష్యం ముందుండగా...ఓవర్‌నైట్ స్కోరు 75/2తో ఆట కొనసాగించిన హైదరాబాద్ 73.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌటైంది. చందన్ సహాని (87 బంతుల్లో 56; 10 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా...రోహిత్ రాయుడు (46), అలంకృత్ అగర్వాల్ (35), శశాంక్ (33) కొద్దిగా పోరాడారు. ఆంధ్ర బౌలర్లలో 5 వికెట్లతో కేవీ శశికాంత్ (5/68) ప్రత్యర్థిని దెబ్బ కొట్టగా...సుదర్శన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆడిన నాలుగు మ్యాచ్‌లలో హైదరాబాద్‌కు ఇది మూడో ఓటమి కాగా... ఆంధ్రకు రెండో విజయం. మంగళవారంనుంచి జరిగే తమ తర్వాతి మ్యాచ్‌లో ఢిల్లీతో ఆంధ్ర...సౌరాష్ట్రతో హైదరాబాద్ తలపడతాయి.



ప్రతిష్టాత్మక ఇండియన్ స్టయిల్ రెజ్లింగ్ 'హింద్ కేసరి' పోటీలు శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. పురుషులు, మహిళల విభాగాల్లో కలిపి దేశవ్యాప్తంగా సుమారు 550 మంది రెజ్లర్లు ఇందులో పాల్గొంటున్నారు. తొలి రోజు పోటీల్లో ఒక దృశ్యం.

సర్ఫరాజ్ పోరాటంతో...

'డ్రా'గా ముగిసిన పాక్, కివీస్ టెస్టు



కరాచీ: పాకిస్తాన్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు ఉత్కంఠభరిత మలుపులు తిరిగి చివరకు 'డ్రా'గా ముగిసింది. ఒక దశలో పాక్ ఓటమి ఖాయమనిపించి, ఆపై గెలుపు అవకాశం చిక్కినా వాడుకోలేకపోగా... పేలవ బౌలింగ్‌తో చివరకు కివీస్ 'డ్రా'తో సంతృప్తి పడాల్సి వచ్చింది. 319 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 0/2తో ఆట కొనసాగించిన పాక్ శుక్రవారం మ్యాచ్ ముగిసే సమయానికి 90 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. సర్ఫరాజ్ అహ్మద్ (176 బంతుల్లో 118; 9 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత సెంచరీ సాధించగా...షాన్ మసూద్ (35), సౌద్ షకీల్ (32), ఆగా సల్మాన్ (30) అండగా నిలిచారు. ఒక దశలో 80 పరుగుల వద్దే పాక్ 5 వికెట్లు కోల్పోయింది. అయితే సర్ఫరాజ్, షకీల్ ఆరో వికెట్‌కు 123 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. సల్మాన్‌తో కూడా సర్ఫరాజ్ వేగంగా 70 పరుగులు జత చేశాడు. చివరి 15 ఓవర్లలో 70 పరుగులు చేయాల్సి ఉండగా... తక్కువ వ్యవధిలో 3 వికెట్లు తీసి న్యూజిలాండ్ విజయంపై గురి పెట్టింది. అయితే 32 పరుగులు చేయాల్సిన స్థితిలో సర్ఫరాజ్ 9వ వికెట్‌గా వెనుదిరిగాడు. చివరి వికెట్ తీస్తే కివీస్ గెలుపు అందుకునే అవకాశం ఉండగా...చివరి జోడి నసీమ్ షా (15 నాటౌట్), అబ్రార్ (7 నాటౌట్) వికెట్ పడకుండా 21 బంతులు జాగ్రత్తగా ఆడారు. మిగిలిన 3 ఓవర్లలో పాక్‌కు 15 పరుగులు అవసరం కాగా... వెలుతురు మందగించడంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. దాంతో రెండు టెస్టుల సిరీస్ 0-0తో డ్రాగా ముగిసింది.

మూడో రోజు వర్షార్పణం

సిడ్నీ: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చివరి టెస్టును వరుసగా మూడో రోజూ వర్షం వెంటాడింది. తొలి రెండు రోజులు వాన కారణంగా పూర్తి ఓవర్లు సాధ్యం కాకపోగా...శుక్రవారం అయితే ఆట మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. వర్షం ఏమాత్రం తెరిపినివ్వకపోవడంతో ఒక్క బంతి కూడా వేయడం సాధ్యం కాలేదు. గురువారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 475 పరుగులు చేసింది.

సివిల్ సప్లైస్ గోదాములపై సోలార్ పలకలు

24 చోట్ల ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కూడా..

- రెడ్కో సహకారంతో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు
- రైస్‌మిల్లుల్లోనూ సౌర విద్యుత్ వ్యవస్థలు నెలకొల్పాలని నిర్ణయం
- పౌర సరఫరాల సంస్థ చైర్మన్ రవీందర్‌సింగ్ వెల్లడి



రెడ్కో మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య, తెలంగాణ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ గౌడ్‌తో చర్చిస్తున్న రవీందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: నెలవారీ విద్యుత్ బిల్లుల భారం నుంచి బయటపడటం, అదే సమయంలో ఆదాయాన్ని కూడా పొందడం కోసం పౌర సరఫరాల శాఖ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పౌర సరఫరాల శాఖ గోదా ములపై సోలార్ పలకలను అమర్చి.. విద్యుత్ ఉత్పత్తి చేసుకోవాలని, ఇదే సమయంలో పలుచోట్ల ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పునరుద్ధర ణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో)తో కలసి సివిల్ సప్లైస్ పరిధిలోని గోదా ములతోపాటు పెట్రోల్, ఎల్పీజీ ఔట్‌లెట్లలోనూ ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం పౌర సరఫరాల భవనంలో రెడ్కో మేనేజింగ్ డైరెక్టర్ జానయ్య, తెలంగాణ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ గౌడ్, ఇతర అధికారులతో రవీందర్‌సింగ్ సమావేశమై చర్చించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడంతోపాటు పౌర సరఫరాల సంస్థకు సంబంధించిన కరెంటు చార్జీలను తగ్గించుకు నేందుకు గోదాముల్లో సోలార్ వ్యవ స్థలను ఏర్పాటు చేయాలని నిర్ణ యించినట్టు రవీందర్‌సింగ్ వెల్లడించారు. తొలిదశలో సంస్థకు చెందిన 19 గోదాములు, రెండు పెట్రోల్ బంకులు, ఐదు ఎల్పీజీ గోదాములు కలిపి మొత్తం 26 చోట్ల ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే ప్రతిపా దనలపై చర్చించామన్నారు. అందులో 24 చోట్ల అనుకూలంగా ఉన్న ట్టుగా అధికారులు ధ్రువీకరిం చారని తెలిపారు. ఇక తమ పరిధిలోని రైస్‌మిల్లుల్లోనూ సౌర విద్యుత్‌ను వినియోగించే అం శాన్ని పరిశీలిస్తున్నట్టు వివరించారు. సమావేశం అనంతరం రవీందర్‌సింగ్ సికింద్రాబాద్‌లోని జిల్లా పౌర సరఫరాల కార్యాలయాన్ని పరిశీలించారు. అక్కడ సోలార్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ గోదాముల్లో సోలార్ వ్యవస్థల ఏర్పాటు నిర్ణయంపై సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

జేఈఈ పరీక్ష కేంద్రాల కుదింపు

- రాష్ట్రంలో నాలుగు సెంటర్ల ఎత్తివేత
- దూర ప్రాంత విద్యార్థులకు తప్పని తిప్పలు



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 24 నుంచి జరిగే జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాలను నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కుదించింది. గతంలో 21 పట్ట ణాల్లో నిర్వహించే ఈ పరీక్షను ఈసారి 17 పట్టణా లకే పరిమితం చేసినట్టు స్పష్టం చేసింది. కరోనా నేపథ్యంలో గతంలో భౌతికదూరం పాటించాల్సి వచ్చిందని, అభ్యర్థులు గుంపులుగా ఉండకుండా ఉండేందుకు పరీక్ష కేంద్రాలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఈసారి ఆ తీవ్రత లేకపోవడంతో పరీక్ష కేంద్రాలను తగ్గించినట్టు పేర్కొన్నారు. కోవిడ్ కాలంలో నాలుగు దఫాలుగా నిర్వహించిన పరీక్షను ఈసారి రెండు దఫాలకు తగ్గించిన విషయం తెలిసిందే. పరీక్ష కేంద్రాల విషయంలో విద్యార్థుల వెసులు బాటు, పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను ప్రామాణికంగా తీసుకున్నట్టు అధికారులు చెబుతు న్నారు. అయితే పరీక్ష కేంద్రాల తగ్గింపు వల్ల పలు జిల్లాల్లో విద్యార్థులు ఇబ్బంది పడాల్సి ఉంటుంది. ఆదిలాబాద్‌లో పరీక్ష రాసే విద్యార్థులు నిజామాబా ద్‌కుగానీ, హైదరా బాద్‌కుగానీ వెళ్లాల్సి ఉంటుంది. వికారాబాద్ అభ్యర్థులు హైదరాబాద్‌లోగానీ, సం గారెడ్డిలోగా నీ రాయాల్సి ఉంటుంది. గద్వాల విద్యార్థులు మహబూబ్‌నగర్ పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసేందుకు 95 కిలోమీటర్లు ప్రయాణిం చాల్సి ఉంటుంది. ఆదిలాబాద్, గద్వాల, వికా రాబాద్, మంచిర్యాలలో ఉన్న కేంద్రాలను ఈసారి తీసేశారు.

పరీక్ష కేంద్రాలు ఇవే.

జేఈఈ మెయిన్స్ పరీక్ష కేంద్రాల జాబితాను ఎన్టీఏ ప్రకటించింది. ఇందులో హయత్‌నగర్, హైదరా బాద్, జగిత్యాల, జనగాం, కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, సంగా రెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ ఉన్నాయి.

ఐఏఎస్ హోదాకు 25 మంది పేర్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులకు 2021 సంవత్సరానికి నాన్ కేడర్ ఐఏఎస్ హోదా కల్పించాలని సిఫారసు చేస్తూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కు రాష్ట్ర ప్రభుత్వం జాబితాను అందజేసింది. ఐఏఎస్ హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసే అధికారులను నాన్-స్టేట్ సివిల్ సర్వీసెస్ (నాన్-ఎస్‌సీఎస్) అధికారులు అంటారు. ఈ నెల 24, 27 తేదీల్లో వీరికి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్టు యూపీఎస్సీ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. వి.శ్రీనివాసులు, ఎస్.సురేష్, కె.హరిత, డి.శ్రీ నివాస్ నాయక్, ఎన్.యాదగిరి రావు, కె.చం ద్రశేఖర్ రెడ్డి, ఈవీ నరసింహారెడ్డి, కె.అశోక్ రెడ్డి, వి.సైదా, పి.మహేందర్, డి.ప్రశాంత్‌కు మార్, టి.వెంకన్న, ఇ.నవీన్ నికోలస్, వి.సర్వే శ్వర్ రెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, పి.కాత్యాయని దేవి, పి.వెంకటేశం, ఆర్.లక్ష్మణుడు, ఎ.పుల్లయ్య, ఆర్.ఏడుకొండలు, డి.హన్మం తు, సి.చంద్రకాంత్‌రెడ్డి, వి.పాపయ్య, జీవీనారాయణరావు, ఎం.పద్మజ జాబితాలో ఉన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.